భవిష్యత్తుకు భరోసా

నిన్న బయోగ్యాస్ ప్లాంటు.. నేడు పారిశ్రామిక పార్కు

- త్వరలో ట్రిపుల్ ఐటీ.. సోలార్ విద్యుత్ ప్రాజెక్టు
- ఏవీ ఆగవు.. మరిన్ని వస్తాయన్న కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఆంధ్రజ్యోతి, ఒంగోలు
రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి జిల్లాలో పశ్చిమ ప్రాంతం.. ప్రత్యేకించి కనిగిరి నియోజకవర్గ భవిష్యత్తుకు భరోసా లభించింది. గత ఏప్రిల్‌లో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి కనిగిరి నియోజకవర్గంలోనే శ్రీకారం పలికారు. తాజాగా సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన పార్కుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ప్రారంభోత్సవం చేస్తున్నారు. రేపోమాపో ట్రిపుల్ ఐటీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన జరగబోతోంది. మరోవైపు సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల రాకకు రంగం సిద్ధమైంది. నడికుడి రైల్వేలైన్ నిర్మాణం ఊపందుకుంది. నియోజకవర్గం నుంచి వెళ్తూ రెండు జాతీయ రహదారులు నిర్మాణంలో ఉన్నాయి. వీటన్నింటికితోడు వెలిగొండ పూర్తయితే నియోజకవర్గం చివరి ప్రాంతం వరకు నీరు వస్తుందనే ఆశ ప్రజల్లో కలిగింది. దీనంతటికీ రాష్ట్రప్రభుత్వంలో కీలకంగా ఉన్న సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లతో శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డికి సన్నిహిత

మిగతా 4వ పేజీలో



పీసీపల్లి మండలం జి.లింగన్నపాలెం వద్ద సిద్ధం చేసిన సభా ప్రాంగణం



ఏర్పాట్లపై చర్చించుకుంటున్న ఎమ్మెల్యేలు ఉగ్ర, బీఎన్, దామచర్ల, కలెక్టర్ రాజాబాబు, జడా చైర్మన్ రియాజ్



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరోసారి జిల్లాకు వస్తున్నారు. ఈ ఏడాదిలో ఆయన పర్యటన ఇది మూడోసారి కాగా మూడు విడతలు పశ్చిమ ప్రాంతంలోనే పర్యటించడం విశేషం. అందులోనూ సీఎం గతంలో పాల్గొన్న రెండు, మంగళవారం పర్యటన కూడా రాష్ట్రస్థాయి కార్యక్రమాలే. తొలుత ఈ ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రభుత్వం తరపున మార్కాపురంలో నిర్వహించగా అందులో పాల్గొన్నారు. తర్వాత ఈ ఏడాది ఆగస్టు 3న దర్శి నియోజకవర్గంలోని తూర్పువీరాయపాలెం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొని రాష్ట్రస్థాయి అన్నదాత సుఖీభవ పథకం తొలివిడత నిధులను మంజూరు చేశారు. మూడోసారి మంగళవారం వస్తున్నారు. కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలం జి.లింగన్నపాలెం వద్ద సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్‌ఎంఈ) పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు.

ఏడాదిలో మూడోసారి

నేడు జిల్లాకు సీఎం చంద్రబాబు

- జి.లింగన్నపాలెంలో ఎంఎస్‌ఎంఈ పార్కు ప్రారంభం
- పశ్చిమప్రాంతంపై ప్రత్యేక ఫోకస్
- ఈసారి కూడా ఆ ప్రాంతంలోనే పర్యటన
- పారిశ్రామిక ఉపాధి, సాగునీటి రంగాలకు భరోసా
- ఇప్పటికే కీలక అంశాలపై దృష్టి
- ముఖ్యమంత్రి కార్యక్రమానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఒంగోలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఈవిడత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామిక, ఉపాధి రంగాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఒకవైపు దేశ, విదేశాల నుంచి భారీ పెట్టుబడులను ఆకర్షించి పెద్దఎత్తున పారిశ్రామిక సంస్థలను రాష్ట్రంలో ఏర్పాటు చేయించడం ద్వారా ఉపాధి మార్గాల పెంపునకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు స్థానికంగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి అక్కడి వనరుల ఆధారంగా చిన్న, సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటు.. తద్వారా ఉపాధి కల్పనపై దృష్టి సారించారు. ఈక్రమంలో ఎంఎస్‌ఎంఈ నూతన పాలసీ రూపొందించి ఔత్సాహిక

మిగతా 4వ పేజీలో

- ఉదయం 10.15 గంటలకు హెలికాప్టర్‌లో జి.లింగన్నపాలెం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- ఉదయం 10.25కు ప్రజాప్రతినిధులు, అధికారులను కలుస్తారు.

సీఎం పర్యటన ఇలా...

- ఉదయం 10.35కు హెలిప్యాడ్‌నుంచి సభా ప్రాంగణానికి చేరుకుంటారు.
- ఉదయం10.35 నుంచి12.15 వరకు పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడతారు.
- మధ్యాహ్నం 12.25కు తిరిగి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12.30కు హెలికాప్టర్‌లో వెళ్లిపోతారు.

సీఎం పర్యటన 2.15 గంటలు

- జి.లింగన్నపాలెం వద్ద పైలాన్ ఆవిష్కరణ, సభ
- అక్కడే హెలిప్యాడ్ ఏర్పాటు
- 829 మంది పోలీసులతో బందోబస్తు
- ఎమ్మెల్యే ఉగ్ర ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు
- ట్రయల్ రన్ నిర్వహించిన హెలికాప్టర్



జి.లింగన్నపాలెంలో ట్రయల్ రన్ వేస్తున్న హెలికాప్టర్

ఒంగోలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈసారి జిల్లా పర్యటన కొద్ది సమయం మాత్రమే ఉండనుంది. అది కూడా అధికారిక కార్యక్రమానికే పరిమితం కానుంది. ఆయన కేవలం 2.15 గంటలు మాత్రమే పీసీపల్లి మండలం జి.లింగన్నపాలెంలో ఉండనున్నారు. మంగళవారం ఉదయం 10.15 గంటలకు జిల్లాకు చేరుకునే సీఎం తిరిగి 12.30కు వెళ్లిపోనున్నారు. జి.లింగన్నపాలెంలో హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. అక్కడికి సమీపంలోని ఎంఎస్‌ఎంఈ పార్కుతోపాటు వర్చువల్‌గా రాష్ట్రంలోని 50 ఎంఎస్‌ఎంఈ పార్కులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సంబంధించి ఏర్పాటు చేసిన పైలాన్‌ను సీఎం ఆవిష్కరిస్తారు. అనంతరం అక్కడ ఔత్సాహిక

మిగతా 4వ పేజీలో



జి.లింగన్నపాలెం వద్ద సిద్ధం చేస్తున్న పైలాన్



గుండ్లకమ్మ నదిలో బయటపడిన శివలింగం, నంది

గుండ్లకమ్మలో శివలింగం, నంది

- ముష్టగంగవరం గ్రామ సమీపంలో తంగిరాల వద్ద బయటపడిన వైనం
- పూజలు చేస్తున్న గ్రామస్థులు

నష్టాన్ని గుర్తించాం.. ప్రభుత్వానికి నివేదిస్తాం

- కేంద్ర బృందం భరోసా
- మొంథా తుఫాన్ నష్టాల పరిశీలన
- బృందాన్ని కలిసి పరిస్థితిని వివరించిన ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నేతలు



నాగులుప్పలపాడు వద్ద దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'మొంథా తుఫాన్‌తో వాటిల్లిన నష్టాన్ని గుర్తించాం. ప్రభుత్వానికి క్షేత్రస్థాయిలోని పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇస్తాం' అని కేంద్ర బృందం సభ్యులు భరోసా ఇచ్చారు. తుఫాన్ వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు పి.పోసు మిబసు, మహేష్‌కుమార్, శశాంక్ శేఖర్‌రాయ్, సాయిభగీరథ్‌లతో కూడిన బృందం సోమవారం జిల్లాకు

మిగతా 4వ పేజీలో



శివ శివ శంకర..

కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా జిల్లాలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే బారులు తీరారు. సర్వేశ్వరుడికి పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రికి మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఒంగోలులోని సంతపేట సాయిబాబా మందిరంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. : లోపలి పేజీల్లో..

జిల్లాకు రెండు అవార్డులు

నేడు గుంటూరు సదస్సులో ప్రదానం

ఒంగోలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డ్వామా పర్యవేక్షణలో జరుగుతున్న వాటర్ షెడ్ పనుల అమలులో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు రెండు అవార్డులు లభించాయి. దేశవ్యాప్తంగా వాటర్‌షెడ్ పనులు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పెద్దఎత్తున జరుగుతున్నాయి. వాటిపై సమీక్ష కోసం సోమ, మంగళవారాల్లో గుంటూరులో జాతీయ స్థాయి సదస్సును కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నిర్వహిస్తోంది. ఈ పనులలో మంచి ఫలితాలు సాధించిన వాటర్ షెడ్‌లకు జనభగీదారి పేరుతో అవార్డులను ఇస్తున్నారు. అలా రాష్ట్రంలో ఏడు వాటర్‌షెడ్‌లకు అవార్డులు లభించగా వాటిలో జిల్లాకు రెండు దక్కాయి. మారెళ్ల, తువ్వపాడు వాటర్‌షెడ్లకు ఈ అవార్డులు వచ్చాయి. మంగళవారం గుంటూరు సదస్సులో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. జిల్లా నుంచి ఈ అవార్డులు అందుకునేందుకు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ హాజరుకానున్నారు.

రేపు వెలిగొండకు మంత్రి నిమ్మల

- నాలుగురోజుల వ్యవధిలోనే మరోసారి సమీక్ష



త్రిపురాంతకం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం వెలిగొండ ప్రాజెక్టును మరోసారి సందర్శించనున్నారు. ఈనెల 7న ప్రాజెక్ట్ పనులను పరిశీలించి అధికారులతో సమీక్షించిన ఆయన పనుల పురోగతిని పరిశీలించేందుకు మళ్లీ వస్తానని చెప్పారు. ఈ మేరకు మంత్రి నాలుగు రోజుల వ్యవధిలోనే రెండోసారి వస్తుండటం వెలిగొండకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనంగా కనిపిస్తోంది. మంగళవారం రాత్రికి వెలిగొండ గెస్ట్ హౌస్‌కు చేరుకుని అక్కడ బస చేస్తారు. 12వ తేదీ ఉదయం 9.30గంటలకు ప్రాజెక్ట్ టన్నెళ్ల వద్ద పనులను పరిశీలిస్తారు. 11 గంటలకు అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

రూ.కోటి ఆస్తికి టెండర్

- దేవస్థాన సత్రం ట్రస్ట్‌కు బదలాయింపు
- రహస్యంగా రిజిస్ట్రేషన్
- గుంటిగంగ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నిర్వాకం



గంగమ్మ భక్తుల కోసం నిర్మించిన దేవస్థాన అన్నదాన సత్రం

తాళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గుంటి గంగమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవస్థాన అన్నదాన సత్రం పేరిట నిధులు సమకూర్చి భవనాన్ని నిర్మించారు. అయితే ఆలయ కమిటీ తాజా మాజీ చైర్మన్ దాన్ని శ్రీగంగమ్మ అన్నదాన ట్రస్ట్ సత్రంగా మార్చడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విరాళాలతో నిర్మించిన అన్నదాన సత్రాన్ని తన సొంతమన్నట్లు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం మార్చడం పట్ల దాతలు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవస్థాన అన్నదాన సత్రం నిర్మించాలని 2023 డిసెంబర్ 1న ఏకగ్రీవ తీర్మానం చేశారు. అందుకోసం గుడికి సమీపాన 20సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. దాదాపు రూ.60లక్షలతో సత్రాన్ని నిర్మించారు. దీన్ని గత ఏడాది 25వతేదీన ప్రారంభించేందుకు శిలాఫలాకాన్ని కూడా ఏర్పాటు చేశారు. కానీ ఏ కారణంచేతనో అది ఆగిపోయింది. ఆలయ కమిటీ తాజా మాజీ

మిగతా 4వ పేజీలో

మైనార్టీ కమిషన్ సభ్యుడిగా కపిల్‌బాషా

మరో ముగ్గురు కార్పొరేషన్ డైరెక్టర్లగా నియామకం

వివరాలు 5వ పేజీలో

జిల్లాలో పోలీసులు అప్రమత్తం

ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలో విస్తృత తనిఖీలు

వివరాలు లోపలి పేజీల్లో..



ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ సైదుబాబు

ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలో ఆకస్మిక తనిఖీ

మార్కాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ ఎర్రకోట వద్ద సోమవారం సాయంత్రం జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో మార్కాపురం పోలీసులు అప్రమత్తమయ్యారు. పట్టణంలోని రద్దీగా ఉండే ఆర్టీసీ, దోర్నాల బస్టాండ్, స్థానిక కంభం రోడ్డు, పూలసుబ్బయ్యకాలనీ, జవహర్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో టౌన్ ఎస్ఐ ఎం.సైదుబాబు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. అంతేగాక మార్కాపురం రైల్వేస్టేషన్‌లో రూరల్ ఎస్ఐ పీ అంకమ్మరావు సిబ్బందితోకలిసి ప్రయాణికులను, సామగ్రిని తనిఖీ చేశారు.

యువకుడి అదృశ్యంపై కేసు

పుల్లలచెరువు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి ఈనెల 5న వెళ్లిన యువకుడు తిరిగి రాలేదు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని పిడికిటివారిపల్లెకి చెందిన 19 ఏళ్ల పుచ్చకాయల నాగేంద్రబాబు కనిపించడం లేదని ఈనెల 10న కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు.

గుండ్లకమ్మలో బయటపడిన శివలింగం, నంది

కురిచేడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో సోమవారం ప్రాచీన శివలింగం, నంది విగ్రహాలు బయటపడ్డాయి. కురిచేడు మండలం ముష్టగంగవరం గ్రామ సమీపంలో తంగిరాల వద్ద గుండ్లకమ్మ నది మధ్యన చట్టులో కనిపించాయి. దీంతో కార్తీకమాసంలో శివుడు తమ గ్రామానికి వచ్చాడంటూ గ్రామస్థులు పూజలు చేస్తున్నారు. తంగిరాల గ్రామం పక్కనే గుండ్లకమ్మ నది ప్రవహిస్తుంది. అక్కడ రెండు పాయలుగా విడిపోయి మరలా కిందకు వెళ్ళి కలిసి ప్రవహిస్తుంది. రెండు పాయల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశంలో గతంలో పెద్ద మట్టిచట్టు ఉంది. ఇటీవల తుఫాన్‌తో కురిసిన భారీవర్షాలకు గుండ్లకమ్మ నదికి పెద్ద ఎత్తున వరద వచ్చింది. నదిలో చాలా భాగం మట్టి కొట్టుకుపోయింది. దీంతో రాతిచట్టు బయటపడింది. సోమవారం చేపల వేటకు వెళ్ళిన జాలర్లకు అందులో శివలింగం, నంది కనపడ్డాయి. వెంటనే వారు గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి వెళ్లి, మా గ్రామాన్ని కాపాడటానికి శివయ్యే కార్తీక మాసంలో వచ్చాడంటూ పూజలు చేశారు. గుండ్లకమ్మ నదికి ఎంత ప్రవాహం వచ్చినా దెబ్బతినకుండా ఉండేలా ఆలయం నిర్మిస్తామని గ్రామస్థులు తెలిపారు.





శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు, గుండ్లకమ్మ నదిలో బయటపడిన శివలింగం, నంది

ఏడాదిలో మూడోసారి

(3వ పేజీ తరువాయి)

పారిశ్రామిక వేత్తలకు భారీ రాయితీలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించారు. గతంలో ఆయా ప్రాంతాల్లో మంజూరు చేసిన ఎంఎస్ఎంఈ పార్కులతో పాటు ఈ ఏడాది నియోజకవర్గానికి ఒక పార్కు ఏర్పాటుకు సంకల్పించారు. అలా రాష్ట్రంలో కొన్నిచోట్ల మంజూరు చేసిన ఎంఎస్ఎంఈ పార్కుల పనులు పూర్తి లేదా పురోగతిలో ఉండగా కొన్నింటికి భూములు గుర్తించి అభివృద్ధి పర్చేందుకు సిద్ధంగా ఉన్నాయి.

వర్చువల్‌గా ప్రారంభం

ఎంఎస్ఎంఈ పార్కులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసే రాష్ట్రస్థాయి మెగా కార్యక్రమాన్ని పీసీపల్లి మండలం జి.లింగన్నపాలెం వద్ద ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు వద్ద నుంచి మంగళవారం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఆ మేరకు రెండు రోజుల క్రితం జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులకు అధికారికంగా సమాచారం రావడంతో ఆగమేఘాలపై అక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నీతానై పర్యవేక్షిస్తున్నారు. అక్కడ సీఎం కార్యక్రమం సుమారు రెండు గంటలపాటు సాగనుంది. ఇతర చోట్ల కార్యక్రమాలు నిర్వహించిన రీతిలోనే భారీ బహిరంగ సభలు లేకుండా పరిమిత సంఖ్యతోనే సభను నిర్వహించనున్నారు. తొలుత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి ఏర్పాటు చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించనున్నారు.

పశ్చిమంపైనే ఫోకస్

ఈసారి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జిల్లాలోని పశ్చిమప్రాంతంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. అందువల్లనే ఈ ఏడాది ఇప్పటివరకు చేసిన రెండు పర్యటనలు, తాజాగా వస్తున్న కార్యక్రమానికి కూడా ఆ ప్రాంతాన్నే ఎంచుకున్నారు. పారిశ్రామిక, ఉపాధి, సాగు, తాగునీరు వంటి సౌకర్యాల పెంపు ఆ ప్రాంతంలో విస్తారంగా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన మార్కాపురం జిల్లా ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కొద్దిరోజుల్లోనే అది సాకారం కానుంది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిపై ప్రజల్లో నమ్మకం కలిగింది. వచ్చే ఏడాది ఆగస్టుకు తొలిదశ, తద్వారా పశ్చిమ ప్రాంతంలో కరువు నివారణ, శాశ్వతంగా సాగు, తాగునీటి ఇక్కట్లు తీరనున్నాయి. ఇక దొనకొండ కారిడార్ ప్రాంతంలో పలు పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వపరంగా వేగంగా చర్యలు కనిపిస్తున్నాయి. కనిగిరి కేంద్రంగా పునరుత్పాదక ఎనర్జీ ప్లాంటు ఏర్పాటుకు శ్రీకారం చుట్టి వాటిని విస్తరించే ప్రయత్నాలు, పలు మండలాల్లో వాటి ఏర్పాటుకు చర్యలు సాగుతున్నాయి. ఇక కనిగిరి నియోజకవర్గంలోని జి.లింగన్నపాలెం వద్ద ఎంఎస్ఎంఈ పార్కు వద్ద నుంచి రాష్ట్రంలో ఆ తరహా పార్కుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం ద్వారా పశ్చిమప్రాంత ప్రజల ఉపాధికి భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు ప్రభుత్వ విధానం కాగా జిల్లాలోని ఇతర నియోజకవర్గాల పార్కులకు కూడా ఇదేసమయంలో శంకుస్థాపనలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భవిష్యత్‌కు భరోసా

(3వ పేజీ తరువాయి)

సంబంధాలు దోహదం చేశాయి. అంతకుమించి వలసలకు నిలయమైన నియోజకవర్గ ప్రజల స్థితిగతులను ఎప్పటికప్పుడు వారికి వివరించి ఏచిన్న అవకాశం వచ్చినా ఆయా పథకాలు రాబట్టేందుకు ఉగ్ర అప్రమత్తంగా వ్యవహరించడం ఓ కారణంగా చెప్పుకోవచ్చు.

నేటి కార్యక్రమం ఓ మచ్చుతునక

జిల్లాలోని పశ్చిమప్రాంతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. అందులోనూ కనిగిరి నియోజకవర్గానికి పెద్దపీట వేస్తున్నారు. అందుకు మంగళవారం జి.లింగన్నపాలెంలో పారిశ్రామిక పార్కు ప్రారంభోత్సవం నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఇలాంటి పార్కులు నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికి రాష్ట్రంలో సుమారు 50కిపైగా ఎంఎస్ఎంఈ పార్కుల కోసం మౌలిక వసతుల కల్పన జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు కనిగిరి నియోజకవర్గంలోనే కార్యక్రమం ఏర్పాటుకు నిర్ణయించడం విశేషం. ఇక్కడి నుంచి సుమారు 50 ఎంఎస్ఎంఈ పార్క్‌లను సీఎం వర్చువల్‌లో ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే ఉగ్ర సహకారంతో 48 గంటల వ్యవధిలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పార్కు వలన ఇప్పటికిప్పుడే భారీగా ఉపయోగం ఉంటుందని చెప్పలేం కాని భవిష్యత్తులో ఆ ప్రాంత అభివృద్ధి, ప్రజల ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు దోహదం చేస్తుందని సీనియర్ అధికారులు, విశ్లేషకులు చెప్తున్నారు. సింగరాయకొండ నుంచి రాయలసీమకు వెళ్లేందుకు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర రహదారికి అత్యంత చేరువలో ఈ పార్కు ఏర్పాటు చేస్తున్నారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేమార్గంలో భాగంగా ఇక్కడకు చేరువలో ఉన్న పామూరులో రైల్వే రవాణా సౌకర్యం అందుబాటులో ఉంది. అలాగే రామాయపట్నం పోర్టు కూడా ఇక్కడ తయారైన పారిశ్రామిక ఉత్పత్తుల రవాణాకు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం ఎంఎస్ఎంఈ పార్కులో స్థలాన్ని తక్కువ ధరకు పారిశ్రామిక వేత్తలకు ఇచ్చే అవకాశం ఉంది. ఉదాహరణకు 20 ఏళ్ల క్రితం జాతీయ రహదారి పక్కన సింగరాయకొండ, గుండ్లాపల్లి వద్ద పారిశ్రామిక పార్కుల ఏర్పాటుపై కూడా అప్పట్లో పెదవి విరిచిన వారు లేకపోలేదు. కానీ ఇప్పుడు గుండ్లాపల్లి పారిశ్రామిక కారిడార్ పరిశ్రమలకు నిలయంగా మారింది. సింగరాయకొండ వద్ద అప్పట్లో స్థలాలు పొందిన చిన్నచిన్న పారిశ్రామికవేత్తలు కోటీశ్వరులయ్యారు.

మరిన్ని వస్తాయి : డాక్టర్ ఉగ్ర

కనిగిరి నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టిన ఏ పనులు ఆగవని, మరిన్ని ప్రాజెక్టులు రానున్నాయని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టితో వెనుకబడిన కనిగిరి ప్రాంత అభివృద్ధికి ఇస్తున్న చేయూతకు యావత్తు ప్రజానీకం జేజేలు పలుకుతోందన్నారు. గత ఏప్రిల్‌లో మంత్రి లోకేష్ శంకుస్థాపన చేసిన రిలయన్స్ సంస్థ బయోగ్యాస్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. సీఎం చంద్రబాబు జోక్యం చేసుకొని రిలయన్స్ సంస్థతో మాట్లాడి ఇక్కడ ఏర్పాటయ్యే ప్లాంట్ సామర్థ్యాన్ని పెంపొందించేలా చేశారని తెలిపారు. అదే తరహాలో పారిశ్రామిక పార్క్‌ను నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడేలా ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. త్వరలో ట్రిపుల్ ఐటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుందని చెప్పారు. సోలార్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఒక సంస్థ ముందుకు వచ్చిందని వెల్లడించారు. ఆ సంస్థతో విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్ ఆధ్వర్యంలో చర్చలు జరుగుతున్నాయన్నారు. ఇటు రైల్వే అటు రోడ్డు రవాణా సౌకర్యాలు పెరిగినందున ఇతరత్రా అనుకూలమైన పరిశ్రమలను రప్పించేందుకు ప్రత్యేక చొరవ చూపుతానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే ఉగ్ర తెలిపారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు అనంతరం వెలిగొండ ద్వారా సాగునీరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ఎలా అందించాలన్న అంశంపై ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. కనిగిరి ప్రాంత అభివృద్ధికి సీఎం ఇస్తున్న చేయూతకు రుణపడి ఉంటానని తెలిపారు.

సీఎం పర్యటన 2.15 గంటలు

(3వ పేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. తిరిగి హెలికాప్టర్‌లో వెళ్లిపోతారు. అలా మొత్తం కార్యక్రమం 2.15 గంటలు మాత్రమే కాగా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో అటు అధికారులు, ఇటు స్థానిక టీడీపీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశారు. సీఎం పర్యటనకు పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పర్యవేక్షణలో మొత్తం 879 మంది వివిధ స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొననున్నారు. ఇద్దరు ఏఎస్పీలు, ఎనిమిది మంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 49 మంది ఎస్ఐలతోపాటు 800మంది పోలీసులు, హోంగార్డులు విధుల్లో పాల్గొననున్నారు. కాగా ఎస్పీ నేతృత్వంలో సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. హెలిప్యాడ్, కాన్వాయ్ మార్గం, పైలాన్, సభా ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. మరోవైపు సీఎం చంద్రబాబునాయుడు హెలికాప్టర్‌లో రానుండగా సోమవారం హెలికాప్టర్ కూడా ట్రయల్ రన్ నిర్వహించారు.

అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

మార్కాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అటవీ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని మార్కాపురం ఎఫ్ఆర్‌వో ఎస్.పిచ్చిరెడ్డి అన్నారు. అటవీశాఖ డివిజన్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. ముందుగా అధికారులు, సిబ్బంది అమరులైన అటవీ ఉద్యోగులకు నివాళులర్పించారు. అనంతరం ఎఫ్ఆర్‌వో పిచ్చిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 25 మంది ఉద్యోగులు విధి నిర్వహణలో అమరులయ్యారన్నారు. వారి సేవలను స్మరించుకోవడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో కొర్రపోలు ఎఫ్ఆర్‌వో ఖాజారహంతుల్లా, కార్యాలయ ఏవో ఖాజా మొహిద్దీన్, ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ మార్కాపురం డివిజన్ అధ్యక్షుడు పి.కరిముల్లా, డీఆర్‌వోలు జి.నాగరాజుగౌడ్, శ్రీనివాసులు, సాయికుమార్, బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.కోటి ఆస్తికి టెండర్!

(3వ పేజీ తరువాయి)

చైర్మన్ కొసనా గురుబ్రహ్మం దేవస్థాన సత్రాన్ని సొంత ట్రస్ట్‌గా మార్పు చేశారు. ఆ సత్రం పేరును అత్యంత రహస్యంగా శ్రీ గుంటిగంగమ్మ అన్నదాన సత్రం ట్రస్ట్‌గా రిజిస్ట్రేషన్ చేయించారు. ఆలయకమిటీ సభ్యులను తొలగించి ట్రస్ట్ చైర్మన్‌గా గురుబ్రహ్మం, సభ్యులుగా ఆయన కుమారుడు కొసనా శివరాజ్, అవిశనేని వెంగన్న, నన్నూరి శ్రీనివాసరెడ్డి, సానె ఆంజనేయులుని నియమించారు. కోటి రూపాయల విలువైన ఆస్తిని తన సొంతమన్నట్లు ట్రస్ట్‌గా ఏర్పాటుచేసి తానే చైర్మన్‌గా ఉండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయాన్ని దేవదాయ శాఖ అధికారులు, దాతలకు తెలియకుండా గోప్యంగా ఉంచారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా గురుబ్రహ్మం పదవీకాలం గత అక్టోబరు 25న ముగిసింది. ఆగమేఘాల మీద గతనెల 24న ఎంపీ మాగుంట, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ లక్ష్మి చేతులు మీదుగా ప్రారంభించారు. గతంలో దేవస్థాన సత్రం పేరుతో సత్రం భవనంపై ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని తొలగించారు. గోప్యంగా శ్రీగుంటి గంగమ్మ అన్నదాన ట్రస్ట్ సత్రంగా శిలాఫలకం ఏర్పాటుచేశారు. దీనిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



దేవస్థాన అన్నదాన సత్రంగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన శిలాఫకం



మాగుంట చేతులమీదుగా ట్రస్ట్ పేరిట ప్రారంభింపజేసిన శిలాఫలకం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జి.వాసుబాబు, గుంటిగంగ ఆలయ ఈవో

గుంటిగంగ సన్నిధిలో ఆలయ కమిటీ తీర్మానం మేరకు దేవదాయ శాఖ అనుమతితో అన్నదాన సత్రం నిర్మించారు. దాన్ని ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గురుబ్రహ్మం ట్రస్ట్ పేరిట మార్చినట్లు పలువురు ఫిర్యాదు చేశారు. తగు చర్యల నిమిత్తం దేవదాయ శాఖ డీసీ, ఏసీల దృష్టికి తీసుకెళ్లాం. సత్రం నిర్మాణం కోసం చేసిన తీర్మానాలు,, వివరాలు తెలియజేశాం. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందగానే చట్టపరమైన చర్యలు చేపడతాం.

అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలి

అవీఇవీ

పెంచితే ఇబ్బందులు తప్పవు : ఆర్ఎం రామారావు



మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి తులసి

ఒంగోలు రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : రైతులు బోర్డు అనుమతి మేరకు మాత్రమే పొగాకు పంట సాగు చేయాలని, విస్తీర్ణం పెంచితే రైతులకు ఇబ్బందులు తప్పవని బోర్డు ఆర్ఎం రామారావు చెప్పారు. ఒంగోలు పొగాకు వేలం కేంద్రం 2లో వేలం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆర్ఎం రామారావు మాట్లాడుతూ రైతులు పొగాకులో నాణ్యతను పెంచుకోవాలన్నారు. నాణ్యత తగ్గితే ధరలు తగ్గుతాయని చెప్పారు. అధిక ధరలకు కౌలు భూములు తీసుకొని సాగు చేయవద్దన్నారు. వేలం నిర్వహణాధికారి తులసి మాట్లడుతూ రైతులు పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు వైపు మొగ్గు చూపాలన్నారు. ఈ ఏడాది 13.5 మిలియన్‌ల కేజీల పొగాకు కొనుగోలు చేయాల్సి ఉండగా 13.53 మిలియన్ కేజీలను కొన్నామని చెప్పారు. సరాసరి ధర కేజీ రూ.221.07 పలికిందన్నారు. బ్రైట్ 4.6 మిలియన్ కేజీలు అమ్మగా సరాసరి ధర రూ.289.23 పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ లీఫ్ మేనుజర్ రాజ్ థొరై, డక్కన్ మేనేజర్ కోటిరెడ్డి, ఎంపీపీఎల్ మేనేజర్ మారుతి, రైతునాయకులు వడ్డెళ్ల ప్రసాదు, పెనుబోతు సునిల్, వై.వెంకట శేషయ్య, దుగ్గినేని మల్లికార్జునరావు, దొడ్డా సీతారామయ్య, చేరుకూరి వాసుబాబు, రాజారావు, మారెళ్ల సుధాకర్, పెద్దరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వేలం నిర్వహణాధికారి తులసీని ప్రశంసించిన రైతులు

వేలం జరిగిన 182 రోజులపాటు సెలవు పెట్టకుండా నిరంతరాయంగా వేలాన్ని నిర్వహించిన అదికారి జె.తులసిని ఆర్ఎం అభినందించారు.

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడిగా సుబ్బారావు

దర్శి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ జిల్లా అధ్యక్షుడిగా కాలం సుబ్బారావు ఎన్నికయ్యారు. దర్శిలో రెండు రోజులపాటు ఆ సంఘం జిల్లా మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కాలం సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా ముప్పా రమేష్, కోశాధికారిగా పారా శ్రీనివాస్‌తో పాటు మొత్తం 61 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.

నష్టాన్ని గుర్తించాం..ప్రభుత్వానికి నివేదిస్తాం..

(3వ పేజీ తరువాయి)

వచ్చింది. వారితోపాటు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఉన్నారు. ముందుగా వరద నష్టాలపై జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను బృంద సభ్యులు తిలకించారు. అనంతరం వరద నష్టాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద నష్టాలపై కలెక్టర్ రాజాబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర బృంద సభ్యులకు వివరించారు. జిల్లాలో ప్రధానంగా వ్యవసాయ, దాని అనుబంధ రంగాలు, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, పశుసంవర్ధక తదితర శాఖలతోపాటు ఒంగోలు నగరంపైనా తీవ్ర ప్రభావం చూపిందని కేంద్ర బృందం సభ్యులకు వివరించారు. తుఫాన్ తర్వాత సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు తీసుకున్న చర్యలను తెలియజేసేలా రూపొందించిన వీడియోను బృందం వీక్షించింది. జిల్లాలోని పశ్చిమప్రాంతంలో అధికంగా నష్టం వాటిల్లిందని కలెక్టర్ రాజాబాబు వివరించారు. పత్తి 8,313 హెక్టార్లు, వరి 1,557, సజ్జ 1,388, మొక్కజొన్న 1,260 హెక్టార్లు దెబ్బతిన్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ రకాల పంటలు 12,570 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు కలెక్టర్ బృంద సభ్యులకు వివరించారు.

అన్నివిధాలా ఆదుకోవాలి

తుఫాన్ వల్ల తీవ్రంగా నష్టం వాటిల్లినందున అన్నివిధాలుగా ఆదుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒడా చైర్మన్ షేక్ రియాజ్ కోరారు. బృంద సభ్యులను కలిసి ఒంగోలు నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని నివేదిక రూపంలో అందజేశారు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ కూడా బృంద సభ్యులను కలిసి వరద నష్టాలను వివరించారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా కలిసి రైతులను, వివిధ వర్గాల ప్రజలను అన్నివిధాలుగా ఆదుకోవాలని కేంద్ర బృందాన్ని కోరారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం అనంతరం కేంద్రబృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని కొప్పోలు, కొత్తపట్నం మండలం అల్లూరులో నష్టాలను పరిశీలించారు. వరి పొలాలను పరిశీలించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు జరిగిన నష్టాన్ని కేంద్ర బృంద సభ్యులకు వివరించారు. అదేవిధంగా ఎన్‌జీపాడులో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలించారు. కేంద్ర బృందం వెంట కలెక్టర్ రాజాబాబు, జేసీ రాజాబాబుతో పాటు ఆయాశాఖల అదికారులు ఉన్నారు.

కొండ కనుమల్లో కోట్లతో అభివృద్ధి

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు
పీసీపల్లి మండలానికి పట్టనున్న మహర్దశ
నేడు పరిశ్రమల పార్క్‌కు ప్రారంభోత్సవం చేయనున్న సీఎం

కనిగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొండ కనుమల్లో మారుమూల గ్రామాల్లో కోట్ల రూపాయల వెచ్చించి ప్రజాప్రభుత్వం అభివృద్ధికి బాటలు వేస్తోంది. ఈక్రమంలో వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలానికి మహర్దశ పట్టింది. ఇప్పటికే పీసీపల్లి మండలంలోని దివాకరపల్లిలో కొండల నడుమ రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు చకచకా పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం గుంటూరు లింగన్నపాలెంలో ఎంఎస్‌ఎంఈ (సూక్ష్మ,చిన్నతరహా పరిశ్రమల) ద్వారా పీసీపల్లి మండలం పారిశ్రామిక వాడగా మారనుంది. మంగళవారం గుంటూరు లింగన్నపాలెంలో పరిశ్రమల ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగనుంది.

● కొండల్లో పారిశ్రామిక వాడలు

కనిగిరి నియోజకవర్గంలోని ఏ ప్రాంతం చూసినా కొండ, గుట్టలు, రాళ్లు, రప్పలేగా అనే నోళ్లకు నేడు మూతలు పడేలా పారిశ్రామిక సిరులు కురిపించనున్నారు. ఇప్పటికే రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు దివాకరపల్లిలో ఏర్పాటు కాగా, గుంటూరు లింగన్నపాలెంలో ఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో సూక్ష, చిన్నతరహా పరిశ్రమాలు ఏర్పాటు కానున్నాయి. రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుతో వేలాది ఎకరాల బీడుభూమలు కూడా ఆదాయసిరులుగా మారే అవకాశం ఈ ప్రాంత ప్రజలకు లభించింది. బీడు భూముల్లో పచ్చిగడ్డిని అమ్ముకున్నా ఆయా కంపెనీ నగదు చెల్లించనుంది. దీంతో దండగగా ఉన్న భూముల్లో నేడు పండగ అనేవిధంగా ప్రభుత్వం నిరూపించింది. ఇంకోపక్క సూక్ష, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుతో ఆయా పరిశ్రమల స్థాపనలో భాగమైన ఉద్యోగులు ఉపాది కోసం ఈ ప్రాంతానికి వచ్చే అవకాశం ఉంది. దీంతో ఆయా గ్రామాల్లోని భూముల ధరలు పెరగటంతో పాటు ఇళ్ల నిర్మాణాలు పెరిగే అవకాశం ఉంది.

● చకచకా ఏర్పాట్లు

పీసీపల్లి మండలంలోని గుంటూరులింగన్నపాలెం పరిధిలో ఎంఎస్‌ఎంఈ ద్వారా పరిశ్రమల స్థాపనకై సీఎం చంద్రబాబునాయుడు మంగళవారం ప్రారంభించనున్నారు. ఇందుకోసం యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు జరుగుతున్నాయి. పైలాన్ ప్రారంభోత్సవం అనంతరం సీఎం చంద్రబాబు సభాస్థలికి వచ్చే మార్గం తారుతో రోడ్డు వేయించారు. సీఎం ప్రసంగించే సభాస్థలికి ముమ్మరంగా పనులు చేస్తున్నారు. ఆప్రాంతంలో గ్రీనరీ కోసం మూడు అడుగుల మేర ఉన్న చెట్లను ప్రత్యేకంగా తెప్పించి ప్రత్యేక మిషన్ ద్వారా చెట్లను నాటించారు. కార్యక్రమం వద్దకు వచ్చేవారికి అన్ని విధాలుగా మౌలిక వసతుల తో పాటు భోజనవసతి, పార్కింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభ కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించేందుకు సమీప గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, దామచర్ల సత్య పనులను పర్యవేక్షించారు.


పరిశ్రమలు ఏర్పాటు కానున్న గుంటూరు లింగన్నపాలెం


పరిశ్రమల ప్రారంభోత్సవ ప్రాంగణంలో చెట్లను నాటేందుకు తవ్వుతున్న మిషన్

ఆ పల్లె ప్రజలు ఊహించి ఉండరు

శతాబ్దాలుగా ఆయా ప్రాంత ప్రజల తరాలు మారుతున్నాయి కాని వారి తలరాతలు మాత్రం మారడంలేదు. సూర్యోదయానికి ముందే పొలం పనులు చేసుకుంటూ వ్యవసాయం పైనే ఆధారపడి జీవించే కుటుంబాలు. పశువుల పోషణే ఆదాయమార్గంగా భావించి ఆ దిశగా జీవనం సాగించేవారే అధికంగా ఉంటారు. కొన్ని కుటుంబాలు గొర్రెలను మేపుకుంటూ, అమ్ముకోవటమే వారి ఆదాయ వనరు. పశువులు, గొర్రెలు, నాగలి కొర్రలు సంచరించే ఈ ప్రాంతంలో పరిశ్రమల స్థాపన జరుగుతుందని, అందుకోసం తమ భూములకు మంచి విలువ వస్తుందని దీంతో వారి నివాసాలు పారిశ్రామిక వాడలుగా మారతాయని ఆయా గ్రామాల ప్రజలు ఊహించి ఉండరు. నేటి పరిస్థితిని బట్టి చూస్తుంటే అది నిజమని చెప్పాల్సిందే మరి.



నెమళ్ల సందడి

అడవి నుంచి పంట పొలాల్లోకి...

బేస్తవారపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : దట్టమైన అడవి మధ్యలో.. జన సంచారం లేని ప్రదేశాల్లో నెమళ్లు సంచరిస్తుంటాయి. ఈ మధ్య కురిసిన వర్షాలకు పంట పొలాలు పచ్చగా కనిపిస్తుండడంతో నెమళ్లు జన సంచారంలోకి వచ్చాయి. సోమవారం ఉదయం మండలంలోని పూసలపాడు గ్రామ పరిధిలోని హైవేరోడ్డు సమీపంలో నెమళ్లు పంట పొలాల్లో తిరుగుతున్నాయి. దీంతో ప్రజలు వాటిని ఆశక్తిగా చూసి తిలకించారు. గతంలో మండలంలోని జగ్గంబోట్ల కృష్ణాపురం రహదారిలో నెమలి జన సంచారంలోకి వచ్చింది.

మైనార్టీ కమిషన్ సభ్యుడిగా కపిల్‌బాషా

మరో ముగ్గురు కార్పొరేషన్ డైరెక్టర్లగా నియామకం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులుగా ఒంగోలుకు చెందిన షేక్ కపిల్ బాషాను నియమిస్తూ టీడీపీ అధిష్టానం సోమవారం ప్రకటించింది. సుదీర్ఘకాలంగా పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేసిన ఆయన గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ తర్వాత రాష్ట్ర మైనార్టీ సెల్‌గా పనిచేసిన కపిల్‌బాషాకు మరోసారి రాష్ట్ర పదవి లభించింది. ఈ సందర్భంగా కపిల్ బాషా మాట్లాడుతూ తనకు రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులుగా పదవి కోసం కృషి చేసిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టరుగా బీజేపీ నేత పిడుగు వెంకటశివారెడ్డిని, రాష్ట్ర సగర/ఉప్పర సంఘం వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గిద్దలూరుకు చెందిన ఆరేపల్లి మల్లికార్జున రావు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులుగా యర్రగొండపాలెం జనసేన పార్టీకి చెందిన డాక్టర్ గౌతంరాజ్‌ను నియమించినట్లు ప్రభుత్వం ప్రకటించింది.


కపిల్ బాషాను అభినందిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

రాష్ట్రాన్ని అధోగతి పట్టిస్తున్న దుష్టత్రయం

ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి
ఒంగోలులో కాంగ్రెస్ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో త్రిబుల్ ఇంజన్ సర్కారు నడుస్తోందని, చంద్రబాబు, జగన్, పవన్ కల్యాణ్ ముగ్గరూ ముగ్గురేనని, ప్రధాని మోడీకి తొత్తులుగా మారి రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టారని కాంగ్రెస్ పార్టీ ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి విమర్శించారు. సోమవారం ఒంగోలులోని డీసీసీ కార్యాలయంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి సమావేశానికి జిల్లా అధ్యక్షులు షేక్ సైదా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మస్తానవలి మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తోందన్నారు. ఓట్ చోరీ ద్వారానే బీజేపీ నేతృత్వంలో ఏన్డీయే కూటమి దేశంలోని వివిధ రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చిన విషయం రాహుల్ గాంధీ బయటపెట్టారని చెప్పారు. తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు షేక్‌సైదా మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి అన్ని కమిటీలు పూర్తిస్థాయిలో నియమించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం, ప్రధాన కార్యదర్శి ఈదా సుధాకర్ రెడ్డి, జిల్లాలోని పలు నియోజకవర్గ సమన్వయకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మస్తాన్‌వలి, పక్కన సైదా

సీఎం పర్యటన షెడ్యూల్ వివరాలు

పీసీపల్లి మండలం గుంటూరు లింగన్నపాలెంలో మంగళవారంఎంఎస్‌ఎంఈ పార్క్‌ను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్నారు. ఆ పర్యటన వివరాలు ఇలా.

- **ఉదయం 9.30గంటలకు :** తాడేపల్లి మండలం, ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.
- **10.15గంటలకు :** పీసీపల్లి మండలం, గుంటూరు లింగన్నపాలెం ఎంఎస్‌ఎంఈ పార్క్ సమీపంలోని హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు.
- **10.15నుండి 10.25 వరకు :** ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి స్వాగతం పలుకుతారు.
- **ఉదయం 10.25గంటలకు:** హెలిప్యాడ్ నుంచి కార్యక్రమ స్థలానికి బయలుదేరుతారు.
- **ఉదయం 10.35 నుంచి 12.15వరకు:** ఎంఎస్‌ఎంఈ పార్క్(గుంటూరు లింగన్నపాలెం)ను ప్రారంభిస్తారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన ఎంఎస్‌ఎంఈ పార్కులు, పలు పెట్టుబడి ప్రాజెక్టులు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లకు వర్చువల్‌గా ప్రారంభిస్తారు. తదుపరి పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్‌ఎంఈ పార్క్ ప్రతినిధులతో పాటు వివిధ పథకాల లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.
- **మధ్యాహ్నం 12.15గంటలకు:** కార్యక్రమాన్ని ముగిస్తారు.
- **12.25గంటలకు:** హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- **12.30గంటలకు:** హెలికాప్టర్‌తో తిరుగు ప్రయాణం
- **1.15గంటలకు:** తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

- పీసీపల్లి, (ఆంధ్రజ్యోతి)



సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

పీసీపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు తెలిపారు. మంగళవారం గుంటూరు లింగన్నపాలెంలో ఎంఎస్‌ఎంఈ పార్క్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి విచ్చేయనున్న నేపథ్యంలో సోమవారం ఎస్పీ బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసుల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసే వరకు ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. నిర్దేశించిన స్థలాలకు సమయానికి హాజరై క్రమశిక్షణతో వ్యవహరించాలని ఆదేశించారు. హెలిప్యాడ్, కాన్వాయ్ మార్గం, పైలాన్, సభా ప్రాంగణం పరిసరాల్లో ఉన్న సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా డ్రోన్లు, సీసీ కెమెరాల సహాయంతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. ఏదైనా సమస్య తలెత్తినట్లయితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఇద్దరు ఎస్పీలు, 8మంది డీఎస్పీలు, 20మంది సీఐలు, 49మంది ఎస్సైలతో పాటు సుమారు 800మంది పోలీసు, హోంగార్డులు, భద్రతా సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించినట్లు ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఆరు ప్రత్యేక మొబైల్ టీంలను ఏర్పాటుచేసినట్టు చెప్పారు.


భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

● పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

సీఎం పర్యటనకు యుద్ధప్రాతిపదికన హెలిప్యాడ్ నిర్మాణంతో పాటు ఎంఎస్‌ఎంఈ పార్క్ ప్రారంభోత్సవానికి సంబంధించిన పైలాన్‌ను నిర్మించారు. సభావేదికను ఏర్పాటు చేశారు. కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, ఒడా చైర్మన్ రియాజ్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య, అధికారులు, పోలీసుశాఖ, సిబ్బందితో కలిసి పర్యటన ఏర్పాట్లను సమీక్షించారు. హెలిప్యాడ్ వేదిక, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రజా సదస్సు వేదిక వంటి అన్ని అంశాలను పరిశీలించి అధికారులకు, సంబంధిత విభాగాలకు అవసరమైన సూచనలు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను వారు ఆదేశించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు ఉగ్ర, ఇంటూరితోపాటు సత్య


గంగాపాలెంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు

ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం

గంగాపాలెంలో ఎంఎస్‌ఎంఈ పార్క్ స్థలాన్ని పరిశీలించిన టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు
నేడు సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. సోమవారం మండలంలోని గంగాపాలెం సమీపంలో ఎంఎస్‌ఎంఈ(చిన్న, మధ్యతరహా సంస్థలు) పార్క్ స్థలాన్ని మార్కాపురం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డితో కలిసి ఎరిక్షన్‌బాబు పరిశీలించారు. అనంతరం ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం జిల్లాలోని పీసీపల్లి మండలంలోని లింగన్నపాలెంలో ఎంఎస్‌ఎంఈ పార్క్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. ఈక్రమంలోనే గంగాపాలెంలోని సర్వే నెంబరు 258, 259, 260లో సుమారు 40.39 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న పార్క్‌ను కూడా వర్చువల్‌గా సీఎం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పార్కు ద్వారా పరిశ్రమలు, పెట్టుబడులు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వెనుకబడిన ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎంపీడీవో బండారు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు చిట్యాల వెంగళ్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ కిషోర్, ఎంసీహెచ్ మంత్రునాయక్, కంచర్ల సత్యనారాయణ గౌడ్, చలమయ్య, నాయకులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశానికి నిరసన సెగ

నేలపై కూర్చొని ఆందోళన చేసిన ప్రజాప్రతినిధులు
బిల్లులు చెల్లించాలంటూ ఎంపీడీవోపై ఆగ్రహం
తర్లుపాడులో వాయిదా పడిన సమావేశం

తర్లుపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో ఓ అన్నమ్మపై ప్రజాప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ సూరెడ్డి బూలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ముకుమ్మడిగా చాంబర్ వద్దకు వెళ్లి చేసిన పనులకు ఎందుకు బిల్లులు చెల్లించరంటూ నిరసన తెలిపారు. ఎంపీడీవో సమాధానం చెప్పేంత వరకూ సమావేశాన్ని జరగనివ్వబోమంటూ నినాదాలు చేశారు. దీంతో ఎంపీడీవో మాట్లాడుతూ చేసిన పనులకు సంబంధించిన ఎం.బుక్‌లను పరిశీలించిన తరువాత బిల్లులు పెడతామని హామీ ఇచ్చినప్పటికీ వారు శాంతించలేదు. సమావేశాన్ని జరగనివ్వకుండా నినాదాలు చేశారు. ఎంపీడీవో సమావేశాన్ని వాయిదావేస్తూ ప్రకటించి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దూదేకుల పెద్దమస్తాన్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరై 3 నెలల క్రితం అకౌంట్లలో పడినప్పటికీ అధికారుల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తూ చేసిన పనులకు బిల్లులు పెట్టడం లేదన్నారు. దీంతో పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతోందని చెప్పారు. వీరికి మద్దతుగా జడ్పీటీసీ సభ్యురాలు వెన్న ఇందిరా నేలపై కూర్చొని నిరసన తెలిపారు.


నేలపై నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

సమ్మెటివ్-1 పరీక్షలు ప్రారంభం

ఒంగోలు విద్య, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6నుంచి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సోమవారం నుంచి సమ్మెటివ్ అసెస్‌మెంట్-1(ఎస్ఏ1) పరీక్షలు ప్రారంభమయ్యాయి. 1నుంచి 5 తరగతుల విద్యార్థులకు మంగళవారం నుంచి పరీక్షలు జరగనున్నాయి. 6నుంచి 10 తరగతుల వారికి మండల విద్యావనరుల కేంద్రాల నుంచి అందజేస్తున్న ప్రశ్నాపత్రాల్లో మార్పులు చేసినట్లు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎం.వి. కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు మొదట ప్రకటించిన ప్రకారం ప్రతి సెషన్ పరీక్ష ప్రారంభానికి గంట ముందు మాత్రమే ప్రశ్నాపత్రాలను ఆయా పాఠశాలలు అందజేయాలి. మండల కేంద్రానికి కొన్ని పాఠశాలలు 30నుంచి40 కి.మీ. దూరంలో ఉన్నందున రెండు పూటలా గంట ముందుగా ఎమ్మార్సీలకు వచ్చి ప్రశ్నాపత్రాలు తీసుకెళ్లడం ఇబ్బందికరంగా ఉందని కొందరు టీచర్లు ఎస్సీఈఆర్టీడైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని పాఠశాల డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి అంగీకరించారు. మంగళవారం నుంచి రెండు పూటల పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను ఉదయమే అందజేయాలని డైరెక్టర్ ఆదేశించారు.

ఎన్జీవో అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఎర్రగొండపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం తాలూకా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ మేరకు ఎన్నికల అధికారి మార్కాపురం అధ్యక్షుడు బీవీ శ్రీనివాసశాస్త్రి నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా చేదూరి రవికుమార్, సహ అధ్యక్షుడిగా వై.శివారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎస్ఎం సుబాని, పి. ఆవులయ, బి. హరిచరణ్, ఎం. కాశీరత్నాలు, మహిళా ఉపాధ్యక్షునిగా ఈశ్వరమ్మ, కార్యదర్శిగా ఎన్.హృదయ్‌రంజన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్యాంబాబు, సంయుక్త కార్యదర్శులుగా కిరణ్ రాజు, రాంబాబు, కె. శ్రీనివాసులు, ఖాదర్‌వలి, మహిళా సంయుక్త కార్యదర్శిగా రాములమ్మ, కోశాధికారిగా లక్ష్మమ్మ, జిల్లా కమిటీ కార్యవర్గసభ్యులుగా వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు, జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి, మూడు మండలాల ఏపీ ఎన్జీవో సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




ఎన్నికైన నూతన కార్యవర్గం


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు

ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : 18 ఏళ్లుగా వైద్యశాఖలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం వైద్యశాఖ సెకండ్ ఏఎన్ఎంల ధర్నా జరిగింది. ధర్నాకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ధర్నాలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మినిమం టైం స్కేలు ప్రకారం వేతనం చెల్లించాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారందరిని రెగ్యులర్ చేయడంతో పాటు సచివాలయాల్లో ఖాళీ పోస్టుల భర్తీ సమయంలో వీరికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయకుమార్, కొండలు, లీల, మరియమ్మ, మల్లేశ్వరి, రవికుమారి, యాస్మిన్, సుజాత, కోటమ్మ, అపర్ణ, లక్ష్మీదేవి, విజయకుమారి,ప్రమీల తదితరులు ఉన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

అందెశ్రీ మృతికి పలువురి సంతాపం


అందెశ్రీ(ఫైల్)

ఒంగోలు కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):సోమవారం మృతి చెందిన ప్రముఖ ఆశు కవి, వాగ్గేయకారుడు డాక్టర్ అం దెశ్రీ మృతి పట్ల జిల్లాకు చెందిన పలువురు కవులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జనగాంకు చెందిన అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. ఆయనకు మన జిల్లాతో, జిల్లా కవులతో కూడా మంచి పరిచయాలు ఉన్నాయి. గతంలో జిల్లాలో జరిగిన మహాకవి గుర్రం జాషువా జయంతి సభలో ఆయన పాల్గొని తన కవితా ప్రసంగంతో తన్మయులను చేశారు. అందెశ్రీ మృతి పట్ల నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘ గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, జనసాహితీ వేదిక అధ్యక్షుడు డాక్టర్.జి.వి.కృష్ణయ్య, నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, ప్రముఖ నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు, కత్తి కల్యాణ్, డాక్టర్ నూకతోటి రవికుమార్, దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి, అంగలకుర్తి ప్రసాద్, చప్పిడి కోటేశ్వరరావు, రెబ్బవరపు ఉదయ్, గంగవరపు సునీత, మున్నంగి రాజకుమారి, డాక్టర్ నూనె అంకమ్మ రావు, కుర్రా ప్రసాద్ బాబు, బీరం అరుణ తదితరులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

16న ఒంగోలులో 'సనాతన ధర్మం- ప్రజాస్వామ్యం'పై సదస్సు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సైంటిఫిక్ సోషలిస్టు స్టడీ సర్కిల్ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 16వతేదీన స్థానిక సీపీఐ కార్యాలయంలో సనాతనధర్మం- సామాజిక అంతరాలు- ప్రజాస్వామ్యం అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు స్టడీసర్కిల్ నిర్వహణ ప్రతినిధి ఎం. వెంకయ్య తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సదస్సులో ప్రముఖ సామాజిక, సాంస్కృతిక విశ్లేషకురాలు పీఏ దేవి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతంచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరామ్ శ్రీనివాసులు, ఆర్. శివనాగేశ్వరరావు, బేగ్, నల్లూరి క్రాంతి, కే వెంకటేశ్వర్లు, బి. రామారావు, పిచ్చయ్య, శిఖా చంద్రశేఖర్ బాబు,పీ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.


ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో మాట్లాడుతున్న మేయర్ సుజాత

క్విస్‌లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ఒంగోలు విద్య, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు క్విస్ ఫార్మసీ కళాశాలలో వికసితభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో నగర పరిధిలోని వెంగముక్కలపాలెంలో సోమవారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక శిబిరాలను మేయర్ గంగాడ సుజాత ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం అభినందనీయమన్నారు. ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని, విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించేందుకు ఎన్నో మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధన మూర్తి, స్టాఫ్ సిబ్బంది,విద్యార్థులు ఉన్నారు.

క్విస్‌లో ఫ్యాకల్టీ కార్యక్రమం

క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఫ్యాకల్టీడెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, గాయత్రిదేవిలు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ఇస్రో మాజీసైంటిస్టు టీఎస్ రఘురామ్, కళాశాల ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు, మెకానికల్ హెచ్‌వోడీ సమీరకుమార్, డీపీఎస్ఆర్ డైరెక్టర్ సుబ్బారావు ఉన్నారు.

అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాగుడ్లూరు మండలం చేవూరులో అటవీ భూములను రామదూత స్వామి నుంచి స్వాధీనం చేసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య డిమాండ్‌చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ సంఘాల నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, గుమ్మళ్ళ నరసింహారావు, కాలేషా బేగ్, సుభాని, రంగారెడ్డి, పిచ్చయ్య ఉన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

ఒంగోలు నియోజకవర్గ పరిధిలో రూ.92 కోట్లు నష్టం
కేంద్ర బృందానికి ఎమ్మెల్యే దామచర్ల వినతి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ కారణంగా ఒంగోలు నియోజకవర్గ పరిధిలో వివిధ శాఖలలో మొత్తం రూ. 92 కోట్లు నష్టం వాటిల్లిందని, బాధితులను ఆదుకుని నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కేంద్ర బృందాన్ని కోరారు. సోమవారం ఒంగోలు విచ్చేసిన కేంద్ర బృందాన్ని కొత్తపట్నం మండలం చింతల వద్ద ఎమ్మెల్యే దామచర్ల కలిసి నష్టం వివరాలను తెలియజేశారు. ఆక్వా సెక్టార్‌కు సంబంధించి రొయ్యలు, చేపలు చెరువుల సాగులో 312 హెక్టార్లలో రూ. 19.94 కోట్లు నష్టం వాటిల్లగా, ఒంగోలు నగర పరిధిలోని డ్రైన్‌లు, సీసీ రోడ్‌లు, కల్వర్టులు దెబ్బతిన్నాయని, వాటి నష్టం విలువ రూ. 19.91 కోట్లు ఉందని వివరించారు. అలాగే ఒంగోలు అర్బన్, రూరల్ పరిధిలో తుఫాన్ కారణంగా పంట నీట మునిగి, రైతులు నష్టపోయారని, 850 ఎకరాలలో రూ. 81.41 లక్షలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అలాగే ఒంగోలు నియోజకవర్గ పరిధిలోని రోడ్డు దెబ్బతిని రూ. 47.99 కోట్లు, ఇరిగేషన్ శాఖకు సంబంధించి ఒంగోలు రూరల్ పరిధిలోరూ. 2.97 కోట్లు నష్టం వాటిల్లినట్లు కేంద్ర బృందానికి ఐదు నివేదికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, ఒడా చైర్మన్ షేక్ రియాజ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.


కేంద్ర బృందానికి నష్టం వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

కౌలురైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్ : మొంథా తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన కౌలు రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద కేంద్ర బృందం సభ్యులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య పలు అంశాలను బృందం సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. అధిక వర్షాల వల్ల జిల్లాలో 25వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, అందులో కౌలు రైతులు అధికంగా ఉన్నారన్నారు. పంటల నష్టం కౌలు రైతుల పేరుమీద రాసి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలు పరిశీలించిన కేంద్ర బృందం

నాగులుప్పలపాడు : మొంథా తుఫాన్ ప్రభావంతో మండల పరిధిలో దెబ్బతిన్న పంటలను కేంద్ర బృందం కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలసి మంగళవారం సాయంత్రం పరిశీలించింది. తొలుత చదలవాడ వద్ద తుఫాన్ ప్రభావంతో నీటమునిగిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, అనంతరం నాగులుప్పలపాడు - ఉప్పుగుండూరు రోడ్డులోని రైతుబంధు కోల్డ్‌స్టోరేజి వెనుక దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలించారు. అనంతరం చీరాల బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఏడీఏ రమేష్ బాబు, ఏవో వెంకట్రావు,తహశీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో తేళ్ల రవికుమార్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.


నాగులుప్పలపాడు వద్ద దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న కేంద్రబృందం

తుఫాన్‌కు నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలి


కేంద్ర బృందానికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌కు నష్టపోయిన జిల్లా ప్రజలను ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు.సోమవారం ఒంగోలు వచ్చిన కేంద్ర బృంద సభ్యులు సౌసమి బసు, మహేష్‌కుమార్, శేఖర్ రాయ్, సాయిభగీరధిలను కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా సీపీఎం జిల్లాకార్యదర్శి ఎస్కే మాబు మాట్లాడుతూ మొంథా తుఫాన్ జిల్లాను తీవ్రంగానష్టపర్చిందని, రెండు రోజుల్లో 18.40 సెం.మీ. వర్షపాతం నమోదైందన్నారు. దీంతో ముంపు సమస్య తీవ్రంగా ముందుకు వచ్చిందన్నారు, మరో వైపురహదారులు కూడా దెబ్బతిన్నాయన్నారు. పలు రకాలపంటలు కూడా దెబ్బతిన్నాయని,అందువల్ల కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు, బృందాన్ని కలిసిన వారిలో సీపీఎం నాయకులు జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, పమిడి వెంకట్రావు, ఎం.రమేష్, బి.రఘురాం తదితరులు ఉన్నారు.

ఎంఎస్ఎంఈ పార్కుతో ఉపాధి, ఉద్యోగాలు

మంత్రి స్వామి
నెన్నూరుపాడులో మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు

టంగుటూరు (కొండపి), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొండపి మండలం నెన్నూరుపాడులో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు శుభపరిణామమన్నారు. ఈ పార్కును మంగళవారం వర్చువల్‌గా కనిగిరి పర్యటనలో సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభిస్తుండటం ఆనందదాయకమన్నారు. నెన్నూరుపాడులో రూ.7కోట్ల పెట్టుబడితో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభించడం ద్వారా నియోజకవర్గంలోని వందలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలి

నెన్నూరుపాడు గ్రామం వద్ద 44 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కును మంగళవారం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభిస్తున్న నేపథ్యంలో కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం కోసం అక్కడ ఏర్పాట్లు చేసినట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు కొర్రపాటి వసంతరాయుడు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యకు వారు కృతజ్ఞతలు తెలిపారు.


ఎంఎస్ఎంఈ పార్కుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న, అధికారులు

ఎంఎస్ఎంఈ పార్కు స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో

కొండపి, : మండలంలోని నెన్నూరుపాడు గ్రామంలో ఎంఎస్ఎంఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్) పార్కుకు కేటాయించిన 44 ఎకరాల భూమిని ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న సోమవారం పరిశీలించారు. మంగళవారం సీఎం చంద్రబాబు పీసీపల్లి మండలం జి.లింగన్నపాలెం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కులను వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈనేపథ్యంలో నెన్నూరుపాడు వద్ద కేటాయించిన స్థలం వద్ద సీఎం చంద్రబాబు కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. అందుకు సంబంధించి అక్కడ ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీవో రామాంజనేయులు, వెలుగు ఏపీఎం గోపీనాథ్, పీఆర్ ఏఈఈ బి.ప్రసాదరావు, ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు, తెలుగు రైతు నియోజకవర్గ నాయకుడు తిప్పారెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆదాయవనరులు పెంచుకోవాలి

ఎంఎల్ఏ జనార్దనరావు సూచన

ఒంగోలు(రూరల్),నవంబరు10(ఆంధ్రజ్యోతి): ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయ వనరులు పెంచుకోవాలని ఎంఎల్ఏ దామచర్ల జనార్దనరావు అన్నారు. ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు కార్యాలయంలో సోమవారం ఏఎంసీ మార్కెట్ కమిటీ తొలి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్ఏ మాట్లాడుతూ పెళ్లూరు, త్రోవగుంట దగ్గర గల వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టులద్వారా ఆదాయ వనరులు పెంచుకోవాలన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ నుంచి రావాల్సిన నగుదు ఇప్పించాలని ఎంఎల్ఏను కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ జాతీయరహదారి వైపు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడంతో ఆదాయవనరులు పెంచుకోవచ్చునని కమిటీ సభ్యులు సూచించారు. అనంతరం యార్డు ప్రాంగణంలో ఎంఎల్ఏ జనార్దనరావు మొక్కలు నాటారు. ఒడా చైర్మన్ రియాజ్, ఏఎంసీ వైస్ చైర్మన్ చిట్టెం వెంకటదుర్గాప్రసాదరావు, కార్యదర్శి నరహరి సభ్యులు పాల్గొన్నారు.


ఏఎంసీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ దామచర్ల జనార్దనరావు

జిల్లాస్థాయి పోటీలకు పాతసింగరాయకొండ విద్యార్థుల ఎంపిక

సింగరాయకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి పరుగు పందెం పోటీలకు మండలంలోని పాత సింగరాయకొండ జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం ఒంగోలు వీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్-17 బాలుర, బాలికల పరుగు పందెంలో వీరు సత్తా చాటారు. బాలికల విభాగం 400, 1500 మీటర్లలో రోహిణిశ్రీలక్ష్మి ద్వితీయ స్థానం, 3000 మీటర్లలో సీహెచ్.వైష్ణవి ద్వితీయ స్థానం సాధించారు. బాలుర విభాగం 1500 మీటర్లలో ఎం.చరణ్‌తేజ ద్వితీయ స్థానం, 3000 మీటర్ల పందెంలో పి.హర్షవర్ధన్ ప్రథమ, ఎం.చరణ్‌తేజ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం పద్మజ, వ్యాయామ ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, అన్వర్, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సూర్యనారాయణ అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

నటరాజ కళాకేంద్రం కమిటీ ఎన్నిక

మద్దిపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):మద్దిపాడు నటరాజ కళాకేంద్రం నూతన కమిటీ ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. గౌరవాధ్యక్షులుగా ఉప్పుగుండూరి నాగేశ్వర రావు, అధ్యక్షునిగా ఆరి సూర్యనారాయణ, ఉపాధ్యక్షునిగా కాకుమాను సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా దేవరశెట్టి ఎలమందతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆరె సూర్యనారాయణ మాట్లాడుతూ నటరాజ కళాకేంద్రంకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు.

పొగాకు రైతులకు మెరుగైన ధర

పొగాకు రైతులకు మెరుగైన ధర కల్పించి సకాలంలో అమ్మకాలు పూర్తి చేయడానికి అన్ని విధాల కృషి చేస్తున్నామని పొగాకు బోర్డు ఆర్ఎం రామారావు తెలిపారు. సోమవారం వెల్లంపల్లి వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించి పొగాకు కొనుగోలు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధరల విషయంలో ఎప్పటికప్పుడు వ్యాపారులతో సంప్రదింపులు చేస్తున్నామని, కొనుగోలు మరో 10 రోజుల్లో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

మద్దిపాడు వైపాలెం ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఎర్రగర్ల చైతన్య స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడి భజన అంగరంగ వైభవంగా నిర్వహించారు. అరటి బోదెలతో అయ్యప్ప మందిరాన్ని, 18 మెట్లను తీర్చిదిద్దగా భజన కార్యక్రమంలో అయ్యప్ప, శివ, భవానీ స్వాములు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్తీక్, రాజేశ్వరి నేతృత్వంలో అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.


గ్రానైట్ ఫ్యాక్టరీలను పరిశీలిస్తున్న మైన్స్ అధికారులు

గ్రానైట్ పరిశ్రమ సమస్యలపై కమిటీ పరిశీలన

- ఓనర్లు అడిగిన డిమాండ్లపై నిజనిర్ధారణలో మైన్స్ అధికారులు

చీమకుర్తి,నవంబరు10(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమ సమస్యలపై పరిష్కార దిశగా ప్రభుత్వం నియమించిన కమిటీ వేగంగా చర్యలు తీసుకుంటోంది. సమస్యల అధ్యయనానికి ఫ్యాక్టరీ ఓనర్లు విన్నవించుకున్న డిమాండ్లను ఫీల్డ్ లెవెల్లో పరిశీలించటానికి మైన్స్ అధికారులు సోమవారం చీమకుర్తి మండల పరిధిలోని పలు గ్రానైట్ ఫ్యాక్టరీలను పరిశీలించారు. యజమానులు అడిగిన ప్రధాన డిమాండ్లలో ఒకటైన కట్టర్‌కి క్యూబిక్ మీటర్‌కి ఇచ్చే అనుమతి 350 అడుగుల నుంచి 450కి పెంచమనే అంశంపై అధికారులు పరిశీలించారు. టెక్నాలజీ పెరిగిన నేపథ్యంలో కటింగ్ బ్లేడ్ మందంలో వచ్చిన మార్పుల మేరకు ముడిరాయినుంచి ఎక్కువ శ్లాబులు ఉత్పత్తి అవుతున్నాయని,ఈ మేరకు పరిమితి పెంచాలని మంత్రుల కమిటీ ముందు ఓనర్లు తెలిపారు. ఈ అంశం నిజమా కాదా అని ప్రత్యక్షంగా మైనింగ్ అధికారులు పరిశీలించారు.ట్రాన్సిట్ పాస్‌లను రద్దు చేయాలని మరో విన్నపాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. పెరల్,కృష్ణశాయి,కేఎంటీ,ఆపిల్ గ్రానైట్ ఫ్యాక్టరీలను పరిశీలించారు.పరిశీలించిన వారిలో మైన్స్ ఏజీ రవివర్మ, టీఏలు సురేష్‌బాబు, రాజా,హరిబాబు, నాగేశ్వరరావులున్నారు.వీరి వెంట ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు యర్రగుంట్ల శ్రీనివాసరావు,కాట్రగడ్డ రమణయ్య,భవాని ప్రసాద్,అహ్మద్‌భాష పాల్గొన్నారు.


సత్యను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

సంగమేశ్వరుని సన్నిధిలో కార్తీక వనభోజనాలు

- హాజరైన దామచర్ల సత్య, కూటమి పార్టీల నేతలు

పొన్నలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుపాడు సమీపంలోని సంగమేశ్వర దేవాలయంలో సోమవారం కార్తీక వనభోజనాలను నిర్వహించారు. రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ పాల్గొని సంగమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ సంగమేశ్వర ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశామని చెప్పారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజా ప్రభుత్వం సంగమేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, టీడీపీ పొన్నలూరు, జరుగుమల్లి, మర్రిపూడి, కొండపి, సింగరాయకొండ మండలాల అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు, పోకూరి రవికుమార్, గోపిరెడ్డి శ్రీనివాసులు, కొర్రపాటి వసంతనాయుడు, మించాల బ్రహ్మయ్య, సీనియర్ నాయకుడు కర్ణ కోటిరెడ్డి, నాయకులు మండవ ప్రసాద్, పల్లపోతు ప్రసాద్, పెద్దబాబు, గుమ్మళ్ల వెంకట్రావు, మండవ మురళీమోహన్, పల్లపోతు రమేష్ బాబు, ముప్పాళ్ల పీఏసీఎస్ చైర్మెన్ మన్నెం రమణయ్య, సర్పంచ్ షేక్ మస్తాన్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా శివారెడ్డి


పీవీ శివారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా భారతీయజనతాపార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు పిడుగు వెంకట శివారెడ్డిని నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు సంస్థలకు ప్రభుత్వం డైరెక్టర్ పదవులు కేటాయించగా అందులో ఒంగోలుకు చెందిన పీవీ శివారెడ్డికి లేబర్ వెల్ఫేర్‌బోర్డులో డైరెక్టర్‌గా అవకాశం దక్కింది. భారతీయ జనతా పార్టీలో కీలకంగా పనిచేసిన శివారెడ్డి గత ఎన్నికల సమయంలో జిల్లా అధ్యక్షుడుగా పనిచేశారు. ఆ సమయంలో కూటమి అభ్యర్థుల గెలుపుకోసం పని చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూటమి పార్టీలకు చెందిన ప్రతినిధులకు నామినేటెడ్ పదవులు ఇస్తున్నారు. అందులో భాగంగానే శివారెడ్డికి సోమవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా అవకాశం లభించింది. శివారెడ్డిని పలువురు బీజేపీ నాయకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి

సంతనూతలపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ద్విచక్ర వాహనదారు మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం ఉదయం సంతనూతలపాడు చిన్నచెరువు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పెదనందిపాడుకు చెందిన తన్నీరు కోటేశ్వర రావు(55) గత కొంతకాలంగా సంతనూతలపాడు వడ్డెరపాలెంలో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో సోమవారం తన స్వగ్రామం పెదనందిపాడుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు చిన్నచెరువు సమీపంలోని అలుగు వద్ద కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. ఇదే సమయంలో తండ్రి వెనుకనే వస్తున్న కుమారుడు శ్రీనివాసరావు విషయం కుటుంబసభ్యులకు తెలిపాడు. వెంటనే వారు ఆటోలో గాయాలపాలైన కోటేశ్వరరావును ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుని కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో పోలీసులు అప్రమత్తం

- ఢిల్లీ ఘటన నేపథ్యంలో విస్తృత తనిఖీలు

ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద ఉగ్రవాదుల దాడిలో భారీ పేలుడు జరిగిన నేపథ్యంలో జిల్లా పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఈమేరకు ఎస్పీ హర్షవర్ధన్ రాజ్ నేతృత్వంలో జిల్లాలో హై అలర్ట్ ప్రకటించారు. దీంతో సోమవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించడంతోపాటు, ప్రత్యేకించి కోస్తా తీరం వెంట పోలీసులు అప్రమత్తం అయ్యారు. అలాగే లాడ్జిలు, రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లలో, సినిమా థియేటర్‌లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించడంతోపాటు తీర ప్రాంతంలో మెరైన్ పోలీసులు కూడా అప్రమత్తం అయ్యారు. దీంతో అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేశారు.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)

కమనీయం శివపార్వతుల కల్యాణం

- పాల్గొన్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి
- పెద్ద సంఖ్యలో భక్తుల హాజరు

ఒంగోలు కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):కార్తీక సోమవారం సందర్భంగా స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలో ఏర్పాటుచేసిన పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ప్రముఖ వేద పండితులు మఠంపల్లి దక్షిణామూర్తి శాస్త్రి యాజ్ఞికంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కల్యాణోత్సవంలో వివిధ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర కమిటీ నిర్వాహకులు అళహరి చెంచల రావు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు బహూకరించగా మఠంపల్లి దక్షిణామూర్తి శాస్త్రి వేద ఆశీర్వచనాన్ని అందజేశారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య పరిస్థితులలో ఆర్థికంగా సతమతమవుతున్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి భరోసా ఇస్తుందని ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 10వ విడతలో 74 మందికి రూ.32.26 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సోమవారం ఉదయం పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. పేద ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్య వచ్చినా ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 645 మందికి 6 కోట్ల రూపాయల మేర చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సర్వం శివోహం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని పట్టణంలోని శైవలాయాలు శివ నామస్మరణలతో మార్మోగుతున్నాయి. కార్తీక 3వ సోమవారం, పట్టణంలోని జగదాంబ సమేత మార్కాండేశ్వరుని దర్శనానికి తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు బారులు తీరారు. అర్చకులు ఆంజనేయ శర్మ, వరణ్ తేజ శర్మ మార్కాండేశ్వర స్వామి జగదాంబలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రాత్రి మార్కాండేశ్వర స్వామికి నవనీతం అలంకారం చేశారు. ఆలయంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. నవగ్రహ నాగుల పూజలు చేశారు. ఈవో ఇదుల చెన్నకేశుల రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది కార్యక్రమాలు పర్యవేక్షించారు.


కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు

సామూహిక వ్రతాలు


సామూహికంగా సత్య వ్రతాలు చేస్తున్న దంపతులు

గిద్దలూరు : కార్తీక మాస పూజలు ఘనంగా జరుగుతున్నాయి. కార్తీక సోమవారం సందర్భంగా పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో రమాసహిత శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు సామూహికంగా వైభవంగా నిర్వహించారు. 60 మంది దంపతులు వ్రతాల్లో పాల్గొన్నారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగ సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు ఆయా పూజా కార్యక్రమాలలో పాల్గొనగా వ్రతాల్లో పాల్గొన్న భక్తులందరికీ అన్నప్రసాదాన్ని అందజేశారు.

శ్రీకుసుమ హరనాథ క్షేత్రంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని సామూహికంగా శివాభిషేకాలు నిర్వహించారు. 40 మంది దంపతులు సామూహిక అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదేరోజు సాయంత్రం ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. కుసుమ హరనాథ భక్తసమాజం అధ్యక్షులు నటుకుల శ్రీనివాసులు, కార్యదర్శి తుమ్మలపెంట శ్రీనివాసులు, కమిటీ ప్రతినిధులు ఆయా పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

సమగ్ర వివరాలతో ప్రభుత్వానికి అందజేస్తాం

పంటల నష్టంపై

ఉద్యాన శాఖాధికారి ఆదిరెడ్డి


నల్లగుంట్లలో నీటిలో ఉన్న మిరప తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి

పెద్ద దోర్నాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటల వివరాలను సమగ్రంగా నమోదు చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని ఉద్యాన శాఖాధికారి ఆదిరెడ్డి రైతులకు తెలిపారు. మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో మొంథా తుఫాన్ వల్ల కురిసిన వర్షానికి అటవీ ప్రాంతం నుంచి ప్రవహించిన వరద నీటిలో నేటికీ ముం పులో ఉన్న మిరప తోటలను సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ఆంధ్రజ్యోతిలో పంటలను పరిశీలించండి ఆదుకోం డి శీర్షికన సోమవారం వచ్చిన కథనంపై స్పందించిన ఎర్రగొండపాలెం ఉద్యాన శాఖాధికారి ఆదిరెడ్డి క్షేత్ర స్థాయిలో మి రప. బొప్పాయి పంటలను పరిశీలించా రు. ముంపు నుంచి పంటలు కాపాడుకునేందుకు అత్యవసరంగా కొన్ని నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి ముంపు నుంచి ఇపుడిప్పుడే బయట పడిన, పడుతున్న కొన్ని పొలాల్లో మిరప మొక్కలను సరి చేసుకోవాలని, పొలంలో నీరు లేకుం డా చూడాలని, అనంతరం యూరియా, 19:19:19లేదా, 13-0-45 వంటి పోషకాలు కలిగిన మందులు పిచికారీ చేయాలని, వేరుకుళ్ళ, కాండం తెగులు నివారణకు కాపర్‌ఆక్సిక్లోరైడ్ 3గ్రాములు లీటరు నీటికి వాడాలని, ఆకు మచ్చ తెగులుకు మ్యాంకోజబ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తదితర సూ చనలు చేశారు. మరో వైపు అధికారి సూ చనలపై బాధిత రైతులు ఆందోళన వ్య క్తం చేస్తున్నారు. పది రోజులుగా నీటిలో ఉన్న మిరప మొక్కలు బతుకుతాయా, మళ్లీ మం దులు పిచికారీ చేస్తే అదనపు భారమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉర్దూ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న మైనారిటీస్ సంక్షేమ శాఖ సభ్యులు

కంభం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మైనారిటీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ వారు పంపిణీ చేసిన 10వ తరగతి ఉర్దూ మీడియం స్టడీ మెటీరియల్‌ను ఉప విద్యాశాఖాధికారి ఎం.శ్రీనివాసులు విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా డీవైఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ సంబంధిత స్టడీ మెటీరియల్ 10వ తరగతి విద్యార్థులకు బహుళ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు టి అబ్దుల్ సత్తార్, టి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వై వీనారాయణ, పిడిఎస్ సుబ్రమణ్యం, సీఆర్పీ మురళీమోహన్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం

రాచర్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాచర్లలోని అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్ ఆధ్వర్యంలో రాచర్ల అయ్యప్ప స్వామి ఆలయంలో దీక్షధారులకు భిక్షను ఏర్పాటు చేయగా ఆయన పాల్గొని అన్నం వడ్డించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్, ఎంఈవో వీ గిరిధరశర్మ, పశువైద్యాధికారి డీ హరిబాబు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ జీవనేశ్వరరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పగిలిన పైపులకు మరమ్మతులు

రాచర్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనుములవీడు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుకు సంబంధించిన పైపులైను గత రెండు రోజుల కిందట మరమ్మతులకు గురైంది. దీంతో గ్రామంలో రెండు రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడింది. స్పందించిన ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్ స్థానిక కార్యదర్శి టి గణేష్‌తో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించడంతో సోమవారం ఆయన ఆ సమస్యను పరిష్కరించారు.

18న జాబ్‌మేళా

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ సోమవారం తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసు గల 10వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు షేక్ ఫిరోజ్ గాంధీ, ఫోన్ నెంబర్‌8013950097కు సంప్రదించాలని తెలిపారు.

నేడు మండల సమావేశం

పెద్దారవీడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరుగుతుందని ఎంపీడీవో జాన్‌సుందరం సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన తెలిపారు.

పశ్చిమ ప్రకాశాన్ని విస్మరించడం దారుణం

మార్కాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో అతలాకుతలమైన మార్కాపురం డివిజన్‌ను కేంద్ర బృందం విస్మరించడం దారుణమని ఏపీ రైతు సంఘం నాయకులు అన్నారు. పశ్చిమ ప్రకాశంలో పంట నష్టాన్ని పరిశీలంచేందుకు కేంద్రం బృందం రావాలని డిమాండ్ చేస్తూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీ కోసం కార్యక్రమంలో ఏవో రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

పామూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండలం గుంటూరు లింగన్నపల్లి గ్రామంలో మంగళవారం ఎంఎస్ఎంఈ ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యాటనను విజయవంతం చేయాలని టీడీపీ పామూరు, సీఎస్‌పురం మండలాల అధ్యక్షులు బొల్లా నరసింహారావు, బొబ్బూరి రమేష్ పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఈకార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వసతులు మెరుగుపరుస్తాం

దర్శి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో వసతులు మెరుగుపర్చి నివాసయోగ్యంగా ఉండేవిధంగా అభివృద్ధి చేస్తామని గృహ నిర్మాణ శాఖ అధికారులు తెలిపారు. 'అధ్వానంగా జగనన్న కాలనీలు' శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాలనీల్లో లబ్ధిదారులకు అవసరమైన మెటీరియల్ సకాలంలో అందించటంతో పాటు ఇసుక డిపో ఏర్పాటు చేశామన్నారు. నీరు, విద్యుత్ వసతులు సమకూర్చామన్నారు. కాలనీల్లో నీరు నిల్వ ఉండకుండా అభివృద్ధి చేస్తామన్నారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి

పామూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ భృతి చెల్లించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జీవైఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీచేసి ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాక్ పోస్టులను భర్తీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ముండ్లమూరులో ర్యాలీ

ముండ్లమూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని వెలుగు కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వీవోఏలు, సిబ్బందితో కలిసి సోమవారం మన డబ్బులు.. మన లెక్కలు కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం హనుమంతరావు, సీసీలు రత్నకుమారి, సుచేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన మంచినీటి ట్యాంక్


తాళ్లూరు బీసీ కాలనీలో శిథిలమైన మంచినీటి ట్యాంక్

» పట్టించుకోని అధికారులు

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తాళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు బీసీ కాలనీలో ఎన్ఏపీ మంచినీటి ట్యాంకు శిథిలమవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంక్‌ను మరమ్మతులు చేయకపోవటంతో మంచినీటి కోసం కాలనీవాసులు పడరానిపాట్లు పడుతున్నారు. ఈప్రాంతంలో ఫ్లోరిన్ అధికంగా ఉండటంతో బీసీ కాలనీలో దశాబ్దాల కాలంక్రితం ఎన్ఏపీ పైప్‌లైన్ వేసి మినీట్యాంక్ నిర్మించారు. ఆ ప్రాంతంలో రెండు కుళాయులు ఏర్పాటుచేశారు. దీంతో కాలనీవాసులు ఎన్ఏపీ మంచినీరు సేవిస్తున్నారు. అయితే, ఆట్యాంక్ శిథిలమవడంతో కుళాయిలకు నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో ఆకాలనీ ప్రజలు ఎన్ఏపీ మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీవాసులు గ్రామంలోకి వెళ్లి మంచినీరు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి ట్యాంక్‌ను మరమ్మతులుచేసి తమ ఇబ్బందులను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ముండ్లమూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపాడులో సోమవారం ఉదయం అభయాంజనేయ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. పెద్దఎత్తున భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, టీడీపీ నియోజక వర్గ నాయకుడు లలిత్‌సాగర్ ప్రత్యేక పూజలు చేశారు. ఒకే గ్రామంలో వేర్వేరు చోట్ల నిర్మించిన దేవాలయాల్లో ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఒక చోట శివ నామస్మరణలతో మార్మోగగా, మరోచోట ఆంజ నేయం, ఆంజనేయం అంటూ మార్మోగాయి. అర్ధనారీశ్వరుడుఆలయంలో వజ్రాల రామకృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో శ్రీశివలింగ దక్షిణామూర్తి ధ్వజస్తంభం యంత్ర ప్రతిష్ఠ జరిగింది. సాయంత్రం రెండుచోట్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.


ఆలయంలో ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామి

ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయురాలిగా

సర్తాజ్‌బేగం



దొనకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్లకోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌డీ సర్తాజ్‌బేగం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు.

మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డులు ప్రకటించింది.

ఈసం దర్భంగా సర్తాజ్‌బేగంను ఎంఈవోలు సాంబశివరావు, అమీర్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

విజృంభిస్తున్న గాలికుంటు వ్యాధి

ముండ్లమూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో గాలికుంటు వ్యాధి విజృంభిస్తోంది. వేలాది రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన పాడి పశువులకు గాలికుంటు వ్యాధి సోకటంతో పశుపోషకులు ఆందోళన చెందు తున్నారు. ఒకవైపు పాలు ఇచ్చే పశువులు, ఆవులతోపాటు గొర్రెలు, మేకల కు గాలికుంటు వ్యాధి సోకింది. మండలంలో 50వేల వరకు మూగ జీవాలు ఉన్నాయి. ఇప్పటికే సగం పశువులకు ఈవ్యాధి సోకింది. వ్యాధి నయం చేసుకోవటానికి పశుపోషకులు వేలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో పశుపోషకులకు కోలుకోలేని దెబ్బ తగిలింది.

మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని తమ్మలూరు, నాయుడుపాలెం, పెదరావిపాడు, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, ఈదర, భీమవరం, అయోధ్యనగర్‌తో పాటు జమ్మలమడక, మక్కెనవారిపాలెం, సుంకరవారిపాలెంతో నూజెండ్లపల్లి పాటు మండలంలో పలుగ్రామాల్లో గాలికుంటు వ్యాధి విజృంభించింది. ఒక్కో గేదెకు రూ.2వేలు నుంచి రూ.5వేల వరకు ఖర్చు పెడుతున్నారు. అయినా తగ్గటం లేదు. పూర్తిగా గేదెలు మేత, నీరు తాగకపోవటం వల్ల బక్కచిక్కిపోయాయి. ఒక్కో గేదెను రూ. 50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు కొనుగోలు చేశారు. గత వా రం పది రోజుల నుంచి గాలికుంటు వ్యాధి సోకటంతో అదే గేదెను రూ.30 వేల నుంచి రూ.50వేల వరకు మాత్రమే అడుగుతున్నారు.

ఇప్పటికైనా మండల పశువైద్యాధికారులు గ్రామాలను సందర్శించి గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు టీకాలు వేసి కాపాడాలని పశుపోషకులు కోరుతున్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

దర్శి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనాక్షి హాస్పటల్‌లో మంగళవారం సంతాన సాఫల్య ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శ్రావణిరెడ్డి తలిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఒంగోలులో ఏర్పాటుచేసిన ఫర్టికేర్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పురుషుల్లో వీర్యకణాల సమస్య ఉన్నవారికి ప్రత్యేక చికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు. స్త్రీలలో తరచూ గర్భం కోల్పోతున్నవారికి, సంతానం లేనివారికి చికిత్సలు చేయటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని దర్శిప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గృహనిర్మాణాల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలి

పామూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పీఎంఏవై 2.0 పథకం కింద గృహనిర్మాణాలకు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ డీఈ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'పామూరు మండలంలో గృహనిర్మాణాలకు మంజూరు కాని నిధులు, సర్వేతోనే కాలయాపన' శీర్షికన ఈనెల 4న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలో ఇప్పటి వరకు 1289 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. వీటిన్నంటికి పీఎంఏవై గ్రామీణ -ఆవాస్ 2024లో సర్వే చేయడానికి ప్రభుత్వం ఈనెల 30 వరకు అవకాశం ఇచ్చిందన్నారు. ఆతర్వాత ప్రభుత్వం గృహాలు మంజూరు చేసిన వెంటనే ఇంటి నిర్మాణ పనుల గురించి తెలియజేస్తామన్నారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్టు చెప్పారు.

నిరుపయోగంగా ఎత్తిపోతల పథకాలు

» పట్టించుకోని ఐడీసీ అధికారులు


నిరుపయోగంగా మారెళ్ళ - 3 ఎత్తిపోతల పథకం

ముండ్లమూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. గుండ్లకమ్మ, చిలకలేరు వాగులను ఆధారంగా చేసుకొని కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి నిర్మించిన ఎత్తిపోతల పథకాల ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురికావడంతో ఈపరిస్థితి ఏర్పడింది. దశాబ్దం క్రితం బీడు భూముల్లో చిరులు కురిపించిన రైతులు నేడు మెట్ట పైర్లకే పరిమితమై పోయారు. అవి కూడా ప్రస్తుతం అంత ఆశాజనకంగా లేవు.

గుండ్లకమ్మ ఆధారంగా మారెళ్ళ, గంగన్నపాలెం, జమ్మలమడక, మక్కెన వారిపాలెం, నాయుడుపాలెం, రామకృష్ణాపురం రైతుల పొలాలకు నిర్మించిన ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు చేరేది. చిలకలేరును ఆధారం చేసుకొని నిర్మించిన రెండు ఎత్తి పోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. మారెళ్ళలో రూ.47 కోట్లతో నిర్మించిన మారెళ్ళ - 4 ఎత్తి పోతల పథకం కింద 4,800 ఎకరాలు, మారెళ్ళ - 3 ఎత్తి పోతల పథకం కింద రూ.5 కోట్లతో నిర్మించిన ఎత్తి పోతల పథకం కింద వెయ్యి ఎకరాలు, రూ.22 కోట్లతో నిర్మించిన గంగన్నపాలెం ఎత్తిపో తల పథకం కింద 2200 ఎకరాలు, రూ.17 కోట్లతో నిర్మించిన మక్కెన వారిపా లెం ఎత్తిపోతల పథకం కింద 1500 ఎకరాలు ఉన్నాయి. ఇవన్నీ 2014లో నాటి టీడీపీ హయాంలోనే నిర్మించారు. చిలకలేరు వాగు ఆధారంగా ముం డ్లమూరు - వేంపాడు సమీపంలో రూ.3 కోట్లతో నిర్మించిన గొట్టిపాటి హను మంతరావు ఎత్తిపోతల పథకం కింద 803 ఎకరాలు, రూ.5 కోట్లతో నిర్మించిన ముండ్లమూరు తారకరామ ఎత్తిపోతల పథకం కింద ఐదు వందల ఎకరాలు ఉన్నాయి.

గత వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయక పోవటంతో నిరుపయోగంగా మారాయి. ప్రజాప్రభుత్వమైనా స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటుచేసి ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.


నిరుపయోగంగా పోలవరం ఎత్తిపోతల పథకం



ప్రత్యేక అలంకరణలో కోటప్పకొండ త్రికోటేశ్వరుడు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తికం.. కమనీయం



సూర్యలంక బీచ్‌లో పూజలు

ఆలయాలకు.. పోటెత్తిన భక్తులు ● వైభవంగా కార్తిక సోమవారం పూజలు

అద్దంకి, బాపట్ల రూరల్,అమరావతి, కోటప్పకొండ(నరసరావుపేట), పెదకాకాని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తికమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అన్ని ప్రాంతాల్లోని శైవక్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణాల్లో కార్తిక దీపాలు వెలిగించిన భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. శివనామస్మరణతో దేవాలయాలు మార్మోగాయి. రోజంతా కొందరు మహిళలు ఉపవాస దీక్ష చేపట్టారు. పంచారామ క్షేత్రాల్లో ప్రథమ ఆరామమైన అమరావతిలోని అమరేశ్వరాలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. తొలుత కృష్ణానదిలో స్నానమాచరించిన భక్తులు నదీతీరంలో, ఆలయ పరిసరాల్లో కార్తిక దీపాలను వెలిగించారు. అనంతరం క్యూల్లో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. మేధా దక్షిణా మూర్తి స్వరూప త్రికోటేశ్వరస్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలంకరణ సేవ జరిగింది. ఆలయ ప్రాంగణం, నందీ శ్వరుని విగ్రహం వద్ద భక్తులు దీపారా ధనలు చేశారు. పెద కాకాని మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శివయ్య దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. యజ్ఞాల బావి వద్ద స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపారాధనలు చేశారు. అనంతరం స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాకాని శివయ్యను హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ గేదెల తుహిన్ కుమార్ దంపతులు, విజయవాడ డీసీపీ కెజివి సరిత, గుంటూరు ఆర్డీవో శ్రీనివాస్ దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో అమరావతి అమరేశ్వరుడు

సముద్రుడికి తాంబూలం

బాపట్లలోని సూర్యలంక సముద్రతీరం తెల్లవారుజాము నుంచే భక్తులతో సందడి నెలకొంది. తీరంలో మహిళలు, పురుషులు పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళా భక్తులు తీరం ఒడ్డున ఇసుకతిమ్మెలతో శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సముద్రదేవుడికి తాంబూలాన్ని సమర్పించారు.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



బాపట్ల : సూర్యలంక తీరంలో భక్తుల స్థానాలు



గుంటూరులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వాటర్‌షెడ్ పర్యావరణానికి పునాది

- నీటి నిర్వహణతోనే దేశాభివృద్ధి
- జాతీయ సదస్సులో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- గుంటూరులో అట్టహాసంగా ప్రారంభమైన సదస్సు
- వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన అధికారులు, ఎన్‌జీవోలు
- వెంగళాయపాలెం చెరువు సందర్శనకు నేడు కేంద్ర మంత్రి చౌహాన్



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, అధికారులు

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ అంటే చెక్‌డ్యాం కాదని ఇది గ్రామీణ భారత పునర్నిర్మాణానికి బలమైన పర్యావరణ పునాది అని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రెండు రోజుల వాటర్‌షెడ్ జాతీయ సదస్సు గుంటూరులో ఐటీసీ వెల్‌కం హోటల్‌లో సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. కేంద్రం, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు, ఎన్‌జీవోలు, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ దేశాన్ని ప్రగతిపథంలో నిలిపేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషికి అండగా కేంద్ర ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేయాలన్నారు. వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో వెంగళాయపాలెంలోని 21 ఎకరాల విస్తీర్ణంలోని చెరువుని కేవలం రూ.కోటి ఖర్చు చేసి 15 రోజుల్లోనే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. ఆ చెరువుని మంగళవారం ఉదయం ప్రతినిధులంతా సందర్శించాలని కోరారు. దేశాభివృద్ధి నీటి నిర్వహణపై ఆధారపడి ఉందని, వర్షం వచ్చినప్పుడే ఆ నీటిని సేకరించి నిల్వ చేసుకుని ఆ తర్వాత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాటర్ షెడ్ కార్యక్రమాల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చన్నారు. తద్వారా రైతులకు పంట ఆదాయం పెరుగుతుందన్నారు. రెండో పంట సాగు చేసే అవకాశం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. వచ్చే ఏడాది ప్రారంభించబోయే వాటర్ డెవలప్‌మెంట్ కన్వర్జెన్స్ - పీకేఎస్‌వై 3.0ని ఏ విధంగా రాష్ట్రాలు (మిగతా 4వ పేజీలో)



వివిధ రాష్ట్రాల నుంచి సదస్సుకు హాజరైన అధికారులు

నేడు వాటర్‌షెడ్ మహోత్సవ్ సభ

వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపొనెంట్ ఆఫ్ ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (డబ్ల్యూడీసీ-పీఎంకేఎస్‌వై) 2.0తో గుంటూరు సమీపంలోని వెంగళాయపాలెంలో అభివృద్ధి చేసిన చెరువును మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సందర్శించనున్నారు. సోమవారం రాత్రి గుంటూరుకు చేరుకున్న ఆయ న ఐటీసీ హోటల్‌లో బస చేశారు. ఆయన మంగళవారం ఉదయం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారు లతో కలిసి వెంగళాయపాలెం చెరువుని సందర్శిస్తారు. అనంతరం లయోలా పాఠశాలలో జరిగే వాటర్ షెడ్ మహోత్సవ్ సభలో పాల్గొంటారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం జాతీయ వాటర్ షెడ్ సదస్సు ముగింపు కార్యక్రమం ఐటీసీ హోటల్‌లో జరుగుతుంది. సాయంత్రం పెమ్మసాని నివాసంలో డిన్నర్‌కి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హాజరౌతారు.

ఢిల్లీ ఘటనతో... రెడ్ అలర్ట్



- ఎక్కడికక్కడ అప్రమత్తమైన పోలీసులు
- హోటళ్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా రెండు గంటల పాటు నాకాబందీ





గుంటూరు: నాకాబందీలో భాగంగా తనిఖీలు చేస్తున్న పోలీసులు



గుంటూరు: రైల్వే స్టేషన్ వద్ద డాగ్స్‌తో తనిఖీలు చేస్తున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

బాపట్ల, చీరాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం బాంబు పేలుళ్ల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు రెడ్‌అలర్ట్ ప్రకటించారు. ఐజీ, ఎస్పీలతో డీజీపీ హరీష్‌కుమార్‌గుప్త అత్యవసరంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. నాకాబందీ పేరుతో విస్తృత తనిఖీలకు ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సోమ వారం రాత్రి 8:30 నుంచి 10:30 గంటల వరకు పోలీసులు విస్తృతంగా తనిఖీ చేపట్టారు. రోడ్లపైనా, అన్ని ప్రధాన కూడళ్లలోనూ వాహన తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, హోటళ్లతో పాటు జన సమర్థంగా ఉండే ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. జాతీయ, రాష్ట్ర రహదారుల్లోనూ ఆయా తనిఖీలు కొనసాగాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు ఇతర రవాణా వాహనాలను ఆపి ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహించారు. ఆయా తనిఖీల్లో అనుమానాస్పద వ్యక్తులను పూర్తిస్థాయిలో విచారించి వారి ఆధారాలు పరిశీలించిన తర్వాతే వదిలేశారు. బాంబుడిస్పోజల్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌లు సైతం రంగంలో దిగి తనిఖీలు నిర్వహించాయి. మరోవైపు కౌంటర్ ఇంటెలిజెన్స్, యాంటీ టెర్రరిస్ట్ నిఘా బృందాలు రంగంలో దిగి క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఆరాతీస్తున్నాయి.పోలీసులు అన్ని ప్రాంతాల్లో ఏకకాలంలో రంగంలోకి తనిఖీలు చేపట్టడంతో ఏం జరిగిందో అర్థం కాక వాహన చోదకులు అయోమయానికి గురయ్యారు. మరోవైపు ఆయా జిల్లాల్లో వీఐపీల కదలికలు ఉన్న ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టు దిట్టం చేశారు. ఇక జిల్లా కేంద్రాలైన గుంటూరు, నరసరావుపేట, బాపట్ల తో పాటు అన్ని పట్టణ ప్రాంతాల్లోనూ ఆకస్మిక తనిఖీలు కొనసాగాయి. గుంటూరు శివారు వెంగళాయపాలెంలో జరగనున్న జాతీయ వాటర్ షెడ్ మహోత్సవానికి కేంద్ర మంత్రులు హాజరవుతున్న నేపథ్యంలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆయా ప్రాంతాల్లో బందోబస్తును పటిష్ఠం చేశారు.

రాజ్యలక్ష్మి కుటుంబానికి అండగా ఎన్నారైలు

● మృతదేహం తరలింపునకు నిధుల సేకరణ



కారంచేడు(పర్చూరు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువు కోసం అమెరికా వెళ్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన కారంచేడు గ్రామానికి చెందిన యార్లగడ్డ రాజ్యలక్ష్మి(రాజీ) కుటుంబ సభ్యులకు భారత సంతతి బాసటగా నిలి చింది. ఆమె కుటుంబం ఆర్థిక సమస్యలో ఉందన్న విషయాన్ని అమెరికాలో ఉన్న ఆంధ్రా స్టూడెంట్ డైస్ గుర్తించింది. ఈ క్రమంలో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు, ఆమె కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎన్నారైలు నిధులు సేకరిస్తున్నట్లు మృతురాలి బంధువు చైతన్య తెలిపారు. అంత్యక్రియల ఖర్చుతోపాటు, విద్యా రుణాలను తిరిగి చెల్లించేలా గో ఫండ్ మీ సంస్థ సాయంతో భారత కమ్యూనిటీ నిధులు సేకరిస్తున్నట్లు సమాచారం.

శింగరకొండలో 18న కోటీ దీపోత్సవం

అద్దంకి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద ఈ నెల 18న కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, అసిస్టెంట్ కమిషనర్, ఈవో తిమ్మానాయుడు తెలిపారు. దీపోత్సవంలో పాల్గొనే భక్తులు బుధవారంలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆలయ రాతి ముఖ మండపం నిర్మాణం పూర్తయిన తర్వాత మొదటి సారిగా నిర్వహిస్తున్న కోటి దీపోత్సవానికి ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాలలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పూజా సామగ్రిని దాతల సహకారంతో పంపిణీ చేస్తామన్నారు.

రూ.9.72 కోట్లతో జల్‌జీవన్

గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణం



ఇంటూరులో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకు

వేమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేమూరు నియోజకవర్గంలోని 18 గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ.9.72 కోట్లతో జల జీవన పథకం పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పథకానికి సంబంధించి పలు గ్రామాల్లో నూతనంగా వాటర్ ట్యాంకులు, బోర్ల నిర్మాణంతో పాటు పైపులైన్ల ఏర్పాటు చేయనున్నారు. వీటిలో కొన్ని పనులను ప్రారంభించి శరవేగంగా కొనసాగిస్తున్నారు. మరికొన్ని పనులకు టెండర్లు పూర్తి చేశారు. ఆయా మండలాల పరిధిలో చావలి, పెరవలిపాలెం, అమృతలూరు, గోవాడ, ఇంటూరు, అద్దేపల్లి, కోనేటిపురంలో ట్యాంకుల నిర్మాణాలకు నిధులు కేటాయించారు. పెనుమర్రులో ఉప్పునీటి సమస్య పరిష్కారానికి కొల్లూరు మండలం చినపులివర్రు నుంచి పైపులైన్ నిర్మాణం చేయనున్నారు. కోడిపర్రు, యలవర్రులో బోర్ల నిర్మాణం, కిష్కంధపాలెం, పోతార్లంక, బోడపాడు, గోపాయపాలెం, ప్యాపర్రు, భట్టిప్రోలు, ఆలపాడులో పైపులైన్లను నూతనంగా ఏర్పాటు చేయనున్నారు.

నిబంధనలు.. స్పీడ్‌బ్రేక్

● చోదకుల ప్రాణాలతో చెలగాటం

పర్చూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేగ నిరోధకాల ఏర్పాటులో నిబంధనలకు తిలోదకాలిస్తూ వాహన చోదకుల ప్రాణాలతో అధికారులు చెలగాటం ఆడుతున్నారు. గ్రామాలు, పట్టణాలతో పాటు జాతీయ రహదారులపై కూడా ఇష్టం వచ్చినట్లుగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నారు. రోడ్ల నిర్మాణంలో ప్రమాదాలకు అవకాశం లేకుండా తగు ప్రమాణాలను పాటించాలని కేంద్ర ప్రభుత్వం పదే పదే సూచిస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారులు వాటిని పట్టించుకోవడంలేదు. జాతీయ రహదారి 167 ఏలో పర్చూరు వైజంక్షన్ కూడలిలోని ఫ్లైఓవర్ సమీపం పర్చూరు - గుంటూరు రోడ్డులో ఏర్పాటు చేసిన వేగనిరోధకాలు ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ తొలిరోజే పర్చూరు నుంచి గుంటూరు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురై పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే పర్చూరు మండలం అడుసుమల్లికి చెందిన ఓ వ్యక్తి స్పీడ్ బ్రేకర్‌ను గుర్తించక ప్రమాదానికి గురై గుంటూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గడిచిన మూడు రోజుల వ్యవధిలో అనేక మంది వేగ నిరోధకాలను గుర్తించక ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలయ్యారు. ఇంతటి ప్రమాద కరంగా పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారని వాహనదారులు వాపోతున్నారు.



ప్రమాద భరితంగా ఉన్న గుంటూరు రోడ్డులో వేగనిరోధకం

నేడు కేంద్ర బృందం పర్యటన

● కారంచేడులో దెబ్బతిన్న పంటల పరిశీలన



స్వర్ణ కాలువ వద్ద దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కారంచేడు(పర్చూరు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నష్టాన్ని అంచనా వేయడానికి పౌసుమి బసు నేతృత్వంలోని కేంద్ర బృందం మంగళవారం జిల్లాలో పర్యటించనుంది. ఈ బృందం తొలుత చీరాలలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తుంది. అనంతరం వేటపాలెం మండలం రామాపురం గ్రామానికి చేరుకుని రోడ్లను, కారంచేడులో ముంపు బారిన పడిన పంటలను, కొమ్మమూరు కాల్వకు పడిన గండ్లను పరిశీలించనున్నది. మధ్యాహ్నం వరకు మొత్తం మూడు గంటల పాటు జిల్లాలో ఈ బృందం నష్టాల్ని పరిశీలించనున్నది. కాగా ఈ బృందం పర్యటించే ప్రాంతాల్లో సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్ పర్యటించారు. కారంచేడు మండలంలో దెబ్బతిన్న పంటలతో పాటు కొమ్మమూరు కాల్వ, కప్పలవాగు, పర్చూరు వాగులకు పడిన గండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం స్వర్ణ గ్రామంలో స్వర్ణ కాలువ పొంగి కొమ్మమూరు కెనాల్‌లో కలిసిన ప్రాంతాన్ని ఆయన పరిశీలిం చారు. బృందానికి నష్టాలను వివరించే క్రమంలో అధికారులు పక్కాగా వ్యవహరించాలని తెలిపారు. కేంద్ర బృందం పర్యటించే రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని తహసీల్దారు నాగరాజును ఆదేశించారు. చీరాల ఆర్డీవో, డీఏవో, డీఎస్పీ, డీఈఈ, కేడబ్ల్యూడీ ఈఈ, కారంచేడు మండల తహసీల్దార్‌తో పాటు ఇతర అధికారులకు విడివిడిగా బాధ్యతలను కలెక్టర్ అప్పజెప్పారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్పీ వెంకటరత్నం, డ్రెయినేజ్ ఈఈ మురళీకృష్ణ, వ్యవసాయశాఖ అధికారి కె.భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.




రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు

ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : 18 ఏళ్లుగా వైద్యశాఖలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం వైద్యశాఖ సెకండ్ ఏఎన్ఎంల ధర్నా జరిగింది. ధర్నాకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ధర్నాలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మినిమం టైం స్కేలు ప్రకారం వేతనం చెల్లించాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారందరిని రెగ్యులర్ చేయడంతో పాటు సచివాలయాల్లో ఖాళీ పోస్టుల భర్తీ సమయంలో వీరికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయకుమార్, కొండలు, లీల, మరియమ్మ, మల్లేశ్వరి, రవికుమారి, యాస్మిన్, సుజాత, కోటమ్మ, అపర్ణ, లక్ష్మీదేవి, విజయకుమారి,ప్రమీల తదితరులు ఉన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

అందెశ్రీ మృతికి పలువురి సంతాపం


అందెశ్రీ(ఫైల్)

ఒంగోలు కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):సోమవారం మృతి చెందిన ప్రముఖ ఆశు కవి, వాగ్గేయ కారుడు డాక్టర్ అం దెశ్రీ మృతి పట్ల జిల్లాకు చెందిన పలువురు కవులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జనగాంకు చెందిన అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. ఆయనకు మన జిల్లాతో, జిల్లా కవులతో కూడా మంచి పరిచయాలు ఉన్నాయి. గతంలో జిల్లాలో జరిగిన మహాకవి గుర్రం జాషువా జయంతి సభలో ఆయన పాల్గొని తన కవితా ప్రసంగంతో తన్మయులను చేశారు. అందెశ్రీ మృతి పట్ల నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘ గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, జనసాహితీ వేదిక అధ్యక్షుడు డాక్టర్.జీ.వి.కృష్ణయ్య, నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, ప్రముఖ నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు, కత్తి కల్యాణ్, డాక్టర్ నూకతోటి రవికుమార్, దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి, అంగలకుర్తి ప్రసాద్, చప్పిడి కోటేశ్వరరావు, రెబ్బవరపు ఉదయ్, గంగవరపు సునీత, మున్నంగి రాజకుమారి, డాక్టర్ నూనె అంకమ్మ రావు, కుర్రా ప్రసాద్ బాబు, బీరం అరుణ తదితరులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

16న ఒంగోలులో 'సనాతన ధర్మం- ప్రజాస్వామ్యం'పై సదస్సు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సైంటిఫిక్ సోషలిస్టు స్టడీ సర్కిల్ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 16వతేదీన స్థానిక సీపీఐ కార్యాలయంలో సనాతనధర్మం- సామాజిక అంతరాలు- ప్రజాస్వామ్యం అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు స్టడీసర్కిల్ నిర్వహణ ప్రతినిధి ఎం. వెంకయ్య తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సదస్సులో ప్రముఖ సామాజిక, సాంస్కృతిక విశ్లేషకురాలు పీపీ దేవి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతంచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరామ్ శ్రీనివాసులు, ఆర్. శివనాగేశ్వరరావు, బేగ్, నల్లూరి క్రాంతి, కే వెంకటేశ్వర్లు, బి. రామారావు, పిచ్చయ్య, శిఖా చంద్రశేఖర్ బాబు,పీ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో మాట్లాడుతున్న మేయర్ సుజాత

క్విస్‌లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ఒంగోలు విద్య, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు క్విస్ ఫార్మసీ కళాశాలలో వికసితభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో నగర పరిధిలోని వెంగముక్కలపాలెంలో సోమవారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక శిబిరాలను మేయర్ గంగాడ సుజాత ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం అభినందనీయమన్నారు. ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని, విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించేందుకు ఎన్నో మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధన మూర్తి, స్టాఫ్ సిబ్బంది,విద్యార్థులు ఉన్నారు.

క్విస్‌లో ఫ్యాకల్టీ కార్యక్రమం

క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఫ్యాకల్టీడెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, గాయత్రిదేవిలు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ఇస్రో మాజీసైంటిస్టు టీఎస్ రఘురామ్, కళాశాల ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు, మెకానికల్ హెచ్ఓడీ సమీరకుమార్, డీపీఎస్ఆర్ డైరెక్టర్ సుబ్బారావు ఉన్నారు.

అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాగుడ్లూరు మండలం చేవూరులో అటవీ భూములను రామదూత స్వామి నుంచి స్వాధీనం చేసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య డిమాండ్‌చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ సంఘాల నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, గుమ్మళ్ళ నరసింహారావు, కాలేషా బేగ్, సుభాని, రంగారెడ్డి, పిచ్చయ్య ఉన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

ఒంగోలు నియోజకవర్గ పరిధిలో రూ.92 కోట్లు నష్టం
కేంద్ర బృందానికి ఎమ్మెల్యే దామచర్ల వినతి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ కారణంగా ఒంగోలు నియోజకవర్గ పరిధిలో వివిధ శాఖలలో మొత్తం రూ. 92 కోట్లు నష్టం వాటిల్లిందని, బాధితులను ఆదుకుని నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కేంద్ర బృందాన్ని కోరారు. సోమవారం ఒంగోలు విచ్చేసిన కేంద్ర బృందాన్ని కొత్తపట్నం మండలం చింతల వద్ద ఎమ్మెల్యే దామచర్ల కలిసి నష్టం వివరాలను తెలియజేశారు. ఆక్వా సెక్టార్‌కు సంబంధించి రొయ్యలు, చేపలు చెరువుల సాగులో 312 హెక్టార్లలో రూ. 19.94 కోట్లు నష్టం వాటిల్లగా, ఒంగోలు నగర పరిధిలోని డ్రైన్‌లు, సీసీ రోడ్‌లు, కల్వర్టులు దెబ్బతిన్నాయని, వాటి నష్టం విలువ రూ. 19.91 కోట్లు ఉందని వివరించారు. అలాగే ఒంగోలు అర్బన్, రూరల్ పరిధిలో తుఫాన్ కారణంగా పంట నీట మునిగి, రైతులు నష్టపోయారని, 850 ఎకరాలలో రూ. 81.41 లక్షలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అలాగే ఒంగోలు నియోజకవర్గ పరిధిలోని రోడ్లు దెబ్బతిని రూ. 47.99 కోట్లు, ఇరిగేషన్ శాఖకు సంబంధించి ఒంగోలు రూరల్ పరిధిలోరూ. 2.97 కోట్లు నష్టం వాటిల్లినట్లు కేంద్ర బృందానికి ఐదు నివేదికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, ఒడా చైర్మన్ షేక్ రియాజ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.


కేంద్ర బృందానికి నష్టం వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

దెబ్బతిన్న పంటలు పరిశీలించిన కేంద్ర బృందం

నాగులుప్పలపాడు : మొంథా తుఫాన్ ప్రభావంతో మండల పరిధిలో దెబ్బతిన్న పంటలను కేంద్ర బృందం కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలసి మంగళవారం సాయంత్రం పరిశీలించింది. తొలుత చదలవాడ వద్ద తుఫాన్ ప్రభావంతో నీటమునిగిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, అనంతరం నాగులుప్పలపాడు - ఉప్పుగుండూరు రోడ్డులోని రైతుబంధు కోల్డ్‌స్టోరేజి వెనుక దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలించారు. అనంతరం చీరాల బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఏడీఏ రమేష్ బాబు, ఏవో వెంకట్రావు,తహశీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో తేళ్ల రవికుమార్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చి ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్ : మొంథా తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన కౌలు రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద కేంద్ర బృందం సభ్యులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య పలు అంశాలను బృందం సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. అధిక వర్షాల వల్ల జిల్లాలో 25వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, అందులో కౌలు రైతులు అధికంగా ఉన్నారన్నారు. పంటల నష్టం కౌలు రైతుల పేరుమీద రాసి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కౌలురైతులకు


నాగులుప్పలపాడు వద్ద దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న కేంద్రబృందం


కేంద్ర బృందానికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తుఫాన్‌కు నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌కు నష్టపోయిన జిల్లా ప్రజలను ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు.సోమవారం ఒంగోలు వచ్చిన కేంద్ర బృంద సభ్యులు సౌసమి బసు, మహేష్‌కుమార్, శేఖర్ రాయ్, సాయిభగీరధిలను కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా సీపీఎం జిల్లాకార్యదర్శి ఎస్కే మాబు మాట్లాడుతూ మొంథా తుఫాన్ జిల్లాను తీవ్రంగానష్టపర్చిందని, రెండు రోజుల్లో 18.40 సెం.మీ. వర్షపాతం నమోదైందన్నారు. దీంతో ముంపు సమస్య తీవ్రంగా ముందుకు వచ్చిందన్నారు, మరో వైపురహదారులు కూడా దెబ్బతిన్నాయన్నారు. పలు రకాలపంటలు కూడా దెబ్బతిన్నాయని,అందువల్ల కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు, బృందాన్ని కలిసిన వారిలో సీపీఎం నాయకులు జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, పమిడి వెంకట్రావు, ఎం.రమేష్, బి.రఘురాం తదితరులు ఉన్నారు.

ఎంఎస్ఎంఈ పార్కుతో ఉపాధి, ఉద్యోగాలు

మంత్రి స్వామి
నెన్నూరుపాడులో మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు

టంగుటూరు (కొండపి), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొండపి మండలం నెన్నూరుపాడులో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు శుభపరిణామమన్నారు. ఈ పార్కును మంగళవారం వర్చువల్‌గా కనిగిరి పర్యటనలో సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభిస్తుండటం ఆనందదాయకమన్నారు. నెన్నూరుపాడులో రూ.7కోట్ల పెట్టుబడితో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభించడం ద్వారా నియోజకవర్గంలోని వందలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలి

నెన్నూరుపాడు గ్రామం వద్ద 44 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కును మంగళవారం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభిస్తున్న నేపథ్యంలో కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం కోసం అక్కడ ఏర్పాట్లు చేసినట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు కొర్రపాటి వసంతరాయుడు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యకు వారు కృతజ్ఞతలు తెలిపారు.


ఎంఎస్ఎంఈ పార్కుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న, అధికారులు

ఎంఎస్ఎంఈ పార్కు స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో

కొండపి, : మండలంలోని నెన్నూరుపాడు గ్రామంలో ఎంఎస్ఎంఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్) పార్కుకు కేటాయించిన 44 ఎకరాల భూమిని ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న సోమవారం పరిశీలించారు. మంగళవారం సీఎం చంద్రబాబు పీసీపల్లి మండలం జి.లింగన్నపాలెం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కులను వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈనేపథ్యంలో నెన్నూరుపాడు వద్ద కేటాయించిన స్థలం వద్ద సీఎం చంద్రబాబు కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. అందుకు సంబంధించి అక్కడ ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీవో రామాంజనేయులు, వెలుగు ఏపీఎం గోపీనాథ్, పీఆర్ ఏఈఈ బి.ప్రసాదరావు, ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు, తెలుగు రైతు నియోజకవర్గ నాయకుడు తిప్పారెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆదాయవనరులు పెంచుకోవాలి

ఎంఎల్ఏ జనార్దనరావు

ఒంగోలు(రూరల్),నవంబరు10(ఆంధ్రజ్యోతి): ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయ వనరులు పెంచుకోవాలని ఎంఎల్ఏ దామచర్ల జనార్దనరావు అన్నారు. ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు కార్యాలయంలో సోమవారం ఏఎంసీ మార్కెట్ కమిటీ తొలి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్ఏ మాట్లాడుతూ పెళ్లూరు, త్రోవగుంట దగ్గర గల వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్ట్‌లద్వారా ఆదాయ వనరులు పెంచుకోవాలన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ నుంచి రావాల్సిన నగుదు ఇప్పించాలని ఎంఎల్ఏను కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ జాతీయరహదారి వైపు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడంతో ఆదాయవనరులు పెంచుకోవచ్చునని కమిటీ సభ్యులు సూచించారు. అనంతరం యార్డు ప్రాంగణంలో ఎంఎల్ఏ జనార్దనరావు మొక్కలు నాటారు. ఒడా చైర్మన్ రియాజ్, ఏఎంసీ వైస్ చైర్మన్ చిట్టెం వెంకటదుర్గాప్రసాదరావు, కార్యదర్శి నరహరి సభ్యులు పాల్గొన్నారు.


ఏఎంసీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ దామచర్ల జనార్దనరావు

జిల్లాస్థాయి పోటీలకు పాతసింగరాయకొండ విద్యార్థుల ఎంపిక

సింగరాయకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి పరుగు పందెం పోటీలకు మండలంలోని పాత సింగరాయకొండ జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపిక య్యారు. శనివారం ఒంగోలు పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్-17 బాలుర, బాలికల పరుగు పందెంలో వీరు సత్తా చాటారు. బాలికల విభాగం 400, 1500 మీటర్లలో రోహిణిశ్రీలక్ష్మి ద్వితీయ స్థానం, 3000 మీటర్లలో సీహెచ్.వైష్ణవి ద్వితీయ స్థానం సాధించారు. బాలుర విభాగం 1500 మీటర్లలో ఎం.చరణ్‌తేజ ద్వితీయ స్థానం, 3000 మీటర్ల పందెంలో పి.హర్షవర్ధన్ ప్రథమ, ఎం.చరణ్‌తేజ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం పద్మజ, వ్యాయామ ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, అన్వర్, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సూర్యనారాయణ అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

నటరాజ కళాకేంద్రం కమిటీ ఎన్నిక

మద్దిపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):మద్దిపాడు నటరాజ కళాకేంద్రం నూతన కమిటీ ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. గౌరవాధ్యక్షులుగా ఉప్పుగుండూరి నాగేశ్వర రావు, అధ్యక్షునిగా ఆరి సూర్యనారాయణ, ఉపాధ్యక్షునిగా కాకుమాను సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా దేవరశెట్టి ఎలమందతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆరె సూర్యనారాయణ మాట్లాడుతూ నటరాజ కళాకేంద్రంకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు.

పొగాకు రైతులకు మెరుగైన ధర

పొగాకు రైతులకు మెరుగైన ధర కల్పించి సకాలంలో అమ్మకాలు పూర్తి చేయడానికి అన్ని విధాల కృషి చేస్తున్నామని పొగాకు బోర్డు ఆర్ఎం రామారావు తెలిపారు. సోమవారం వెల్లంపల్లి వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించి పొగాకు కొనుగోలు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధరల విషయంలో ఎప్పటికప్పుడు వ్యాపారులతో సంప్రదింపులు చేస్తున్నామని, కొనుగోలు మరో 10 రోజుల్లో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

మద్దిపాడు పైపాలెం ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఎర్రగర్ల చైతన్య స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడి భజన అంగరంగ వైభవంగా నిర్వహించారు. అరటి బోదెలతో అయ్యప్ప మందిరాన్ని, 18 మెట్లను తీర్చిదిద్దగా భజన కార్యక్రమంలో అయ్యప్ప, శివ, భవానీ స్వాములు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్తీక్, రాజేశ్వరి నేతృత్వంలో అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.


గ్రానైట్ ఫ్యాక్టరీలను పరిశీలిస్తున్న మైన్స్ అధికారులు

గ్రానైట్ పరిశ్రమ సమస్యలపై కమిటీ పరిశీలన

- ఓనర్లు అడిగిన డిమాండ్లపై నిజనిర్ధారణలో మైన్స్ అధికారులు

చీమకుర్తి,నవంబరు10(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమ సమస్యలపై పరిష్కార దిశగా ప్రభుత్వం నియమించిన కమిటీ వేగంగా చర్యలు తీసుకుంటోంది. సమస్యల అధ్యయనానికి ఫ్యాక్టరీ ఓనర్లు విన్నవించుకున్న డిమాండ్లను ఫీల్డ్ లెవెల్లో పరిశీలించటానికి మైన్స్ అధికారులు సోమవారం చీమకుర్తి మండల పరిధిలోని పలు గ్రానైట్ ఫ్యాక్టరీలను పరిశీలించారు. యజమానులు అడిగిన ప్రధాన డిమాండ్లలో ఒకటైన కట్టర్‌కి క్యూబిక్ మీటర్‌కి ఇచ్చే అనుమతి 350 అడుగుల నుంచి 450కి పెంచమనే అంశంపై అధికారులు పరిశీలించారు. టెక్నాలజీ పెరిగిన నేపథ్యంలో కటింగ్ బ్లేడ్ మందంలో వచ్చిన మార్పుల మేరకు ముడిరాయినుంచి ఎక్కువ శ్లాబులు ఉత్పత్తి అవుతున్నాయని,ఈ మేరకు పరిమితి పెంచాలని మంత్రుల కమిటీ ముందు ఓనర్లు తెలిపారు. ఈ అంశం నిజమా కాదా అని ప్రత్యక్షంగా మైనింగ్ అధికారులు పరిశీలించారు.ట్రాన్సిట్ పాస్‌లను రద్దు చేయాలని మరో విన్నపాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. పెరల్,కృష్ణశాయి,కేఎంటీ,ఆపిల్ గ్రానైట్ ఫ్యాక్టరీలను పరిశీలించారు.పరిశీలించిన వారిలో మైన్స్ ఏజీ రవివర్మ, టీఏలు సురేష్‌బాబు, రాజా,హరిబాబు, నాగేశ్వరరావులున్నారు.వీరి వెంట ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు యర్రగుంట్ల శ్రీనివాసరావు,కాట్రగడ్డ రమణయ్య,భవాని ప్రసాద్,అహ్మద్‌భాష పాల్గొన్నారు.


సత్యను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

సంగమేశ్వరుని సన్నిధిలో కార్తీక వనభోజనాలు

- హాజరైన దామచర్ల సత్య, కూటమి పార్టీల నేతలు

పొన్నలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుపాడు సమీపంలోని సంగమేశ్వర దేవాలయంలో సోమవారం కార్తీక వనభోజనాలను నిర్వహించారు. రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ పాల్గొని సంగమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ సంగమేశ్వర ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశామని చెప్పారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజా ప్రభుత్వం సంగమేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, టీడీపీ పొన్నలూరు, జరుగుమల్లి, మర్రిపూడి, కొండపి, సింగరాయకొండ మండలాల అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు, పోకూరి రవికుమార్, గోపిరెడ్డి శ్రీనివాసులు, కొర్రపాటి వసంతనాయుడు, మించాల బ్రహ్మయ్య, సీనియర్ నాయకుడు కర్ణ కోటిరెడ్డి, నాయకులు మండవ ప్రసాద్, పల్లపోతు ప్రసాద్, పెద్దబాబు, గుమ్మళ్ల వెంకట్రావు, మండవ మురళీమోహన్, పల్లపోతు రమేష్ బాబు, ముప్పాళ్ల పీఏసీఎస్ చైర్మెన్ మన్నెం రమణయ్య, సర్పంచ్ షేక్ మస్తాన్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా శివారెడ్డి


పీవీ శివారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా భారతీయజనతాపార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు పిడుగు వెంకట శివారెడ్డిని నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు సంస్థలకు ప్రభుత్వం డైరెక్టర్ పదవులు కేటాయించగా అందులో ఒంగోలుకు చెందిన పీవీ శివారెడ్డికి లేబర్ వెల్ఫేర్‌బోర్డులో డైరెక్టర్‌గా అవకాశం దక్కింది. భారతీయ జనతా పార్టీలో కీలకంగా పనిచేసిన శివారెడ్డి గత ఎన్నికల సమయంలో జిల్లా అధ్యక్షుడుగా పనిచేశారు. ఆ సమయంలో కూటమి అభ్యర్థుల గెలుపుకోసం పని చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూటమి పార్టీలకు చెందిన ప్రతినిధులకు నామినేటెడ్ పదవులు ఇస్తున్నారు. అందులో భాగంగానే శివారెడ్డికి సోమవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా అవకాశం లభించింది. పలువురు బీజేపీ నాయకులు అభినందించారు.

వాటర్‌షెడ్.. పర్యావరణానికి పునాది

(3వ పేజీ తరువాయి)

అమలు చేసుకుంటాయనే దానిపై అభిప్రాయాలు సేకరించారు. రాజస్థాన్‌లో అభివృద్ధి చేసిన సరోవరం గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జాన్సీలో వాటర్‌షెడ్ కార్యక్రమం కింద అభివృద్ధి చేసిన నీటి వనరులను ప్రతీఒక్కరూ సందర్శించి స్ఫూర్తి పొందాలని అధికారులు సూచించారు. ల్యాండ్ స్కేపింగ్, వనరుల పరిరక్షణ ద్వారా పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ గురించి ఇక్రిశాట్ సంస్థ పవర్ పాయింట్ ప్రజంటేషన్ అందర్నీ ఆకట్టుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని జాన్సీ జిల్లాకు చెందిన ఇక్రిశాట్ టీమ్ లీడర్ డాక్టర్ రమేష్ సింగ్ దీని గురించి వివరించారు. సాంప్రదాయ నీటి పొదుపు విధానాల గురించి న్యూఢిల్లీకి చెందిన అంతర్జాతీయ నీటి యాజమాన్య సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ గోపాల్‌కుమార్ విశ్లేషించారు. నదులు, సాంప్రదాయ నీటి సంరక్షణ విధానాల పునరుద్ధరణ, పర్వతశ్రేణుల్లో నీటి బుగ్గల పునరుద్ధరణ, గడ్డి మైదానాల అభివృద్ధి, వాటర్‌షెడ్ ప్రాజెక్టుల అమలులో హైడ్రాలజీ ప్లానింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీవోఎల్ఆర్ సెక్రెటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రెటరీ నితిన్ ఖడే, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రెటరి శశిభూషణ్‌కుమార్, డైరెక్టర్ కృష్ణ తేజ, గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా నమూనా

సదస్సులో భాగంగా ఐటీసీ హోటల్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ వాటర్‌షెడ్ 3డీ నమూనా ఏర్పాటు చేసింది. పచ్చని సోయగాల నడుమ, సరోవరం నుంచి నీరు జాలువారుతున్నట్లు రూపొందించిన ప్రదర్శన అతిథులను ఆకట్టుకుంది. చూడముచ్చటైన ల్యాండ్ స్కేపింగ్, ప్రజలకు నడక మార్గాలు వంటివి ఇందులో పొందుపరిచారు.

విద్యార్థులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా ముచ్చట్లు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అన్నంబొట్లవారిపాలెం (పర్చూరు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో ఓ వేడుకలకు సోమవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హాజర య్యారు. ఈ సందర్భంగా ఏదుబాడు గ్రామం నుంచి అన్నంబొట్లవారిపాలెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు ఎమ్మెల్యేని చూసి పరుగులు తీస్తూ ఆయన వద్దకు చేరుకున్నారు. 'గుడ్ మార్నింగ్ సార్' అంటూ పిల్లలు సెల్యూట్ చేశారు. ఎమ్మెల్యే ఏలూరి 'వెరీ గుడ్ మార్నింగ్' అంటూ ఒక్కరిని స్కూల్, ఊరు, తరగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అయనతో ఆప్యాయంగా మాట్లాడారు. విద్యార్థులను మీకు ఏసబెక్టు అంటే ఇష్టం, అభిరుచులు ఏంటి అంటూ వారితో కొంత సేపు ముచ్చటించారు.

అవీ..ఇవీ..

పంటలకు నష్టపరిహారం చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేత

బల్లికురవ, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానుతో దెబ్బతిన్న పంటలకు వెంటనే పంట నష్ట పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం తహసీల్దార్ రవినాయక్‌ను వ్యవసాయ కార్మిక సంఘం నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. పలు గ్రామాలలో వరి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అధికారులు 33శాతం పైన పంట దెబ్బతింటేనే పరిహారం జాబితాలో నమోదు చేస్తామని చెబుతున్నారన్నారు. అలాకాకుండా పంట ఎంత దెబ్బతిన్న నమోదు చేయాలన్నారు. అధికారులు పంటలను పూర్తిగా పరిశీలించకుండానే పంట జాబితాలను నమోదు చేస్తున్నారన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలలో పర్యవేక్షణ చేయకుండానే పంట నష్ట జాబితాలను తయారు చేసి పంపుతున్నారన్నారు. వెంటనే అధికారులు గ్రామాలలో పర్యటించి కౌలుకార్డులు లేని కౌలురైతులకు కూడా పంటనష్ట పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నేతలు జి. అంజయ్య, బొంతావీరయ్య తదితరులు ఉన్నారు.

నేడు టెక్స్‌టైల్ పార్కుకు భూమిపూజ

● స్థలంలో ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

వేటపాలెం (చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని చేనేతల చిరకాల స్వప్నం నేడు సాకారంకానుంది. సుదర్ఘ కాలంగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు నేతన్నలు ఎదురు చూపులు ఫలించాయి. ఎమ్మెల్యే కొండయ్య చల్లారెడ్డి పాలెంలో మంగళవారం భూమిపూజ కార్యక్రమం చేయను న్నారు. ఈక్రమంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను తహసీల్దార్ గీతా రాణీ, ఎంపీడీవో రాజేష్‌బాబు సెక్రటరీ సంపత్‌కుమార్ ఇతర సిబ్బందితో కలిసి పరిశీలించారు. దీంతో నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



భూమిపూజ కార్యక్రమంలో అధికారులు, స్థానికులు

వేటపాలెం(చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నట్లు వేటపాలెం మండలం నీలకంఠాపురం ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు స్వప్న చెప్పారు. సోమవారం సర్వశిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ద్వారా పాఠశాలలో రూ.13.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన తరగతి గదికి స్కూల్ కమిటీ, స్థానిక పెద్దలుతో కలిసి భూమిపూజ చేశారు. సుదీర్ఘ కాలంగా ఇబ్బందులకు నేటితో పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో శివయ్య, కొండలరెడ్డి, వెంకట సుబ్బారావు, బుల్లియ్య, వరప్రసాదరావు, హనుమంతురావు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి

● మృతుడు పర్చూరు మండలం గర్నెపూడి వాసి



పోతురాజు (ఫైల్)

బోయినవారిపాలెం (చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రీసర్వే విధులు నిర్వహిస్తూ వీఆర్‌వో గుండెపోటుతో మృతిచెందాడు. పర్చూరు మండలం గర్నెపూడికి చెందిన అల్లడి పోతురాజు(49) ప్రస్తుతం చీరాల మండలం బోయినవారిపాలెం సచివాలయంలో వీఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే సోమవారం గ్రామం పరిధిలో సహ ఉద్యోగులతో కలిసి రీసర్వే నిర్వహిస్తూ అకస్మాత్తుగా కుప్పకూలాడు. దీంతో ఆందోళన చెందిన ఉద్యోగులు వెంటనే ముందుగా ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు చీరాల ఏరియా వైద్యశాలకు తీసుకువెళ్లగా అక్కడి వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తహసీల్దార్ గోపీకృష్ణ, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లల ఉన్నారు.

సోలార్ హబ్‌కు పచ్చజెండా

ఎస్.ఎల్.గుడిపాడు వద్ద ఏర్పాటుకు ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రి మండలి



సోలార్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రాంతం

అద్దంకి, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : నియోజక వర్గంలో సోలార్ యూనిట్‌ల పరికరాల తయారీ హబ్‌కు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. నియోజక వర్గంలోని బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు, ముక్తేశ్వరం, సంతమాగులూరు మండలం తూర్పు కుందుర్రు రెవెన్యూల పరిధిలో వెయ్యిఎకరాలలో రెన్యూవబుల్ ఎనర్జీ మాన్యుఫాక్చ రింగ్‌జోన్ ఏర్పాటు చేసేందుకు ఏపీఎస్‌పీసీఎల్ ముందుకు వచ్చింది. దేశవ్యాప్తంగా పెద్దఎత్తున సోలార్ ప్లాంట్‌లు, యూనిట్‌లు ఏర్పాటు జరుగుతున్నాయి. కేం ద్ర ప్రభుత్వం కూడా రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో సోలార్ ప్లాంట్ల, యూనిట్లలో వినియోగించే వస్తువులు తయారీ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడంతో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మరింత చొరవ తీసుకొని నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అందుకు అవసరమైన వెయ్యి ఎకరాల భూములు బల్లికురవ, సంతమాగులూరు మండలాలలో గుర్తించారు. రైతులకు పరిహారంగా ఎకరాకు రూ.18 లక్షల చొప్పున చెల్లించే విధంగా కూడా అధికారులు పలు ధఫాలుగా రైతులతో చర్చించారు. అదే సమయంలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే వీలు ఉండడంతో రైతులు కూడా తమ భూములు ఇచ్చేందుకు సుముఖత చూపారు. ఇప్పటికే బల్లికురవ, సంతమాగులూరు మండలాలలో గ్రానైట్ పరిశ్రమతో ప్రత్యేక గుర్తింపు రాగా, రెన్యూవబుల్ ఎనర్జీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుతో మరింత గుర్తింపు రానుంది.

వంతెన ఏర్పాటు చేయండి మహాప్రభో

కొమ్మినేనివారిపాలెం- కొప్పెరపాడు గ్రామాల రైతుల వినతి



వంతెన లేకపోవడంతో రహదారి మధ్య నిలిచిన నీరు

బల్లికురవ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొమ్మినేనివారిపాలెం-కొప్పెరపాడు గ్రామాల మధ్య ఉన్న లింక్ రోడ్డులో వంతెన లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డును ఇటీవల జిల్లా పరిషత్ నిధులతో గ్రావెల్ మట్టితోలి అభివృద్ధి పరిచారు. కాని వాగుపై వంతెన ఏర్పాటు కాలేదు. దీంతో నిత్యం రెండు గ్రామాలకు చెందిన రైతులు పంట పొలాలకు గ్రామాలకు రావాలంటే మూడు అడుగుల లోతు నీటిలో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్రవాహనాలపై ఎరువుల బస్తాలు వేసుకొని నీటిలో రాలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. సాగర్ కాలువల ద్వారా నీరు వచ్చే అన్ని రోజులు వాగు నీరు బాగా ఉధృతిగా వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. పలుమార్లు రోడ్డును అభివృద్ధి చేశారు గాని వంతెన మాత్రం నిర్మాణం చేయలేదని రైతులు వాపోతున్నారు. ఈ రోడ్డులో వంతెన ఏర్పాటు చేస్తే నామ్ హైవే రోడ్డుకు సులువుగాగా వెళ్లేలా ఉపయోగ పడుతుందని పేర్కొంటున్నారు. మండల పరిషత్ నిధుల ద్వారా అయినా, లింకురోడ్డులో వంతెన ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతు న్నారు. గతంలో వంతెన లేక వాగులో ప్రమాదాలు కూడా జరిగిన దాఖలాలు ఉన్నా యని ప్రజలు గుర్తు చేస్తున్నారు. అధికారులు వెంటనే వంతెన ఏర్పాటు పనులు చేయించే చర్యలు చేపట్టాలని రెండు గ్రామాల ప్రజలు కోరతున్నారు.

నేడు జిల్లాలో పంట నష్టాలపై కేంద్రబృందం పరిశీలన

బృందాన్ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసిన కలెక్టర్



బృందం సభ్యులు పౌసుమీ బసుకు మొక్కను అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

చీరాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పంట నష్టాలు, దెబ్బతిన్న కాలువలను పరిశీలించేందుకు నేడు జిల్లాలో కేంద్రబృందం సభ్యులు, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ పౌసుమీ బసు పర్యటించనున్నారు. ఈక్రమంలో సోమవారం చీరాల ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు విచ్చేశారు. వీరిని కలెక్టర్ డా.వినోద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. వారి వెంట ఆర్థిక మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరక్టర్ మహేష్‌కుమార్, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, హైవే ఇంజనీర్ శశాంక్ శేఖర్‌రాయ్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ నిపుణులు సాయి భగీరథ్, రాష్ట్ర డిజాస్టర్ మేనేజింగ్ డైరక్టర్ అథారటీ ప్రకర్ జైన్ ఉన్నారు.

చేనేత రంగాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

నేత కార్మికులతో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య

చీరాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : 'చేనేత రంగాభివృద్ధికి అన్నివిధాలుగా ప్రత్యేక కృషి చేస్తున్నాము. మునుపెన్నడూ లేని విధంగా కొత్త శకానికి కూటమి ప్రభుత్వంతో నాంది పలికింది' అని ఎమెల్యే ఎంఎం. కొండయ్య తెలిపారు. చేనేతల కలలను సాకారం చేస్తూ మంగళవారం వేటపాలెం మండలం చల్లారెడ్డి పాలెంలో హ్యాండ్‌లూమ్ పార్కు ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నట్లు ఆయన చెప్పారు. సోమవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో చేనేత నాయకులు, కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మంగళవారం జరగనున్న భూమిపూజకు సంబంధించి నేతన్నలతో మాట్లాడారు. ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న ట్లు వివరించారు. విశేషంగా కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ మించాల సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ జనార్దనరావు, సీనియర్ టీడీపీ నాయకులు సిద్ధి బుచ్చేశ్వర రావు, నాసిక వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలలో పరిశీలన



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న శివకుమార్

ఇంకొల్లు, నవంబరు 10,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలంలోని పదవతరగతి పరీక్షా కేంద్రాలను సోమవారం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎగ్జామినేషన్ కె.శివకుమార్ పరిశీలించారు. 2025-26వ సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించేందుకు మండలంలోని ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇంకొల్లు బాలికోన్నత పాఠశాల, శ్రీగౌతమి హైస్కూల్, ఆదర్శ హైస్కూల్, పూసపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శివకుమార్, ఎంఈవో శ్రీనివాసరావులు పరిశీలించారు. అన్ని కేంద్రాలలో వసతులను పరిశీలించారు. ప్రతి సబ్జెక్ట్ టీచర్లతో మాట్లాడి పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బల్లికురవ, నవంబరు10(ఆంధ్రజ్యోతి): నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా బల్లికురవ మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని ఇన్‌చార్జ్ ఏఈ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, మండల ప్రజలు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి,నవంబరు10(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌టవర్ లైన్ల ఏర్పాటు నేపథ్యంలో మంగళవారం అద్దంకి పట్టణంలోని రవి రెస్టారెంట్ నుండి భవానిసెంటర్ వరకు నామ్ రోడ్డుకు రెండు వైపుల, భాగ్యనగర్ పరిసర ప్రాంతాలలో మంగళవారం ఉదయం 8 గంటల నుండి సాయం త్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు.

మందుబాబుకు జరిమానా

అద్దంకి,నవంబరు10(ఆంధ్రజ్యోతి):మద్యంసేవించి వాహనం నడిపిన వ్యక్తిని సోమవారం అద్దంకి కోర్టులో హాజరు పరచగా, న్యాయాధికారి అఖిల రూ.3వేల జరిమానా విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

మొంథా తుఫాన్ పంటనష్టంపై నివేదిక

● 1985 ఎకరాలలో పంటనష్టం

పంగులూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీవర్షాలు, గాలులకు మండలంలోని పలు గ్రామాలలో 1985 ఎకరాలలో పంటనష్టం వాటిల్లినట్లు ఏవో డి.సుబ్బారెడ్డి తెలిపారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటల ఎన్యుమరేషన్ పూర్తిచేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు తెలిపారు. మండలంలో 1843 ఎకరాలలో మినుము పంటకు నష్టం వాటిల్లగా, 74.78 ఎకరాలలో పత్తి, 68 ఎకరాలలో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు నివేదికలో తెలిపారు. పంట నష్టపోయిన రైతులు 1112 మంది కాగా, నష్టం అంచనా విలువ రూ.123 కోట్లుగా గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు ఏవో తెలిపారు.

జూదరులను పట్టించిన డ్రోన్

● పేకాట శిబిరంపై దాడి..రూ.1.70 లక్షలు స్వాధీనం

● 14 మంది అరెస్ట్..14 సెల్‌ఫోన్‌లు స్వాధీనం



పేకాట ఆడుతున్న జూదరులు

నక్కలవారిపాలెం(చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు నేర నియంత్రణకు కృషి చేస్తున్నారు. ఈక్రమంలోనే రూరల్ సీఐ శేషగిరిరావు ఆదేశాల మేరకు ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ స్టేషన్ పరిధిలోని నక్కలవారిపాలెంలో పేకాట శిబిరాన్ని డ్రోన్ సాయంతో గుర్తించారు. శిబిరంపై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 14 మంది జూదరులను అరెస్ట్ చేశారు. అలాగే వారి సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. దాడిలో రూ.1.70 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యంలో ముమ్మర తనిఖీలు

● జిల్లా వ్యాప్తంగా పోలీసుల అలర్ట్

● అన్ని ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీలు



చీరాల పట్టణంలో పోలీసుల తనిఖీలు

చీరాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో బాంబు పేలుళ్లు చోటుచేసుకోవడంతో పలువురు అమాయకులు మృత్యువాత పడ్డారు. దీంతో సోమవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. బాపట్ల, చీరాల, రేపల్లె, వేమూరు, అద్దంకి, పర్చూరు ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లలో తనిఖీలు చేపట్టారు. కార్లు, లారీలు, ఆటోలు, ద్విచక్రవాహనాలు సైతం ముమ్మర తనిఖీలు చేశారు. చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అనుమానితుల వివరాలు సేకరించారు. ఎస్పీ ఉమామహేశ్వర్ బాపట్ల రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. పరిస్థితుల గురించి అధికారులను ఆరా తీశారు. అలాగే తీరం వెంబడి ప్రాంతాల్లో మెరైన్ పోలీసులను అధికారులు అప్రమత్తం చేశారు. కట్టుదిట్టమైన గస్తీ ఉంచారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని జిల్లా కార్యాలయాలనికి అందించాలని సూచించినట్లు తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి ఖోఖో విజేత పంగులూరు



ట్రోఫీని అందుకుంటున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలురజట్టు

పంగులూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్, ఖోఖో పోటీలలో ప్రకాశం జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. ఈనెల 8, 9, 10 తేదీలలో అండర్-19 రాష్ట్రస్థాయి బాలుర ఖోఖో పోటీలు విజయనగరం కేంద్రంగా నిర్వహించారు. ఈ పోటీలలో సోమవారం జరిగిన ఫైనల్ పోటీలో విజయనగరం జట్టుతో తలపడిన ఉమ్మడి ప్రకాశంజిల్లా బాలుర జట్టు గెలుపొందినట్లు ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి యం.సీతారామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు జిల్లా జట్టుకు గుర్తింపు తెచ్చారన్నారు. విజేతలకు ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అక్టోబర్ 10న ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర ఖోఖో జట్టు ఎంపిక నిర్వహించారు. ఎస్.జి.ఎఫ్. అండర్-19 బాలురఖోఖో పోటీలకు ఎంపికైన జిల్లాజట్టు ఈనెల 6వ తేదీ వరకు పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం. కళాశాలలో శిక్షణ పొందారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న అర్చకులు

నూతలపాడు(పర్చూరు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం నూతలపాడు గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వార్ల గాలిగోపుర కలశ స్థాపన ధ్వజస్తంభ పునర్నిర్మాణ వేడుకలు సోమవారం అశేష భక్తుల నడుమ నిర్వహించారు. స్వామివార్ల ధ్వజస్తంభ వేడుకలను తిలకించేందుకు పెద్దఎత్తున ఆయా గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. స్వామివార్ల పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు

అద్దంకి : కార్తీక సోమవారం పూజలు మహిళా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని పాతశివాలయం, వేయిస్తంభాలగుడి, కమతేశ్వరాలయాలలో భక్తులు కార్తీకదీపాలు వెలిగించి, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని మణికేశ్వరంలో భక్తులు పెద్ద సంఖ్యలో కార్తీకదీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. వేకువఝాము నుంచే భక్తులు మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు.




ఉసిరిచెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

హర హర మహాదేవ

చినగంజాం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాల్లో తెల్లవారుజామునే స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శోభాయమానంగా స్వామిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఆలయాల ప్రాంగణంలో, ధ్వజస్తంభాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మండల పరిధిలోని సోపిరాలలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయం, కడవకుదురులోని గోకర్ణేశ్వర స్వామి ఆలయం, చినగంజాం గంగాపార్వతి సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయం, కొత్తపాలెం బాలకోటేశ్వర స్వామి ఆలయం, సంతరావూరు, గొనసపూడి, చింతగుంపల్లె, పెదగంజాం తదితర గ్రామాల్లోని శైవ క్షేత్రాలాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రుద్రాభి షేకాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న భక్తులు



శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ టూర్

నెల్లూరు(క్రైం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప భక్తుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ తక్కువ చార్జీలతో నెల్లూరు నుంచి శబరిమలకు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి షమీమ్ తెలిపారు. సోమవారం నెల్లూరు ప్రధాన బస్టాండులో కరపత్రాలను విడుదల చేసి, ఆమె మాట్లాడారు. ఐదు రోజుల ప్యాకేజీ టూర్ ఉంటుందని నెల్లూరు నుంచి కాణిపాకం భవాని, ఎలిమేలి, పంబ మీదుగా శబరిమలకు తిరుగు ప్రయాణంలో కుర్తాళం, మధురై, మేల్‌మరవత్తూర్ మీదుగా నెల్లూరుకు బస్ చేసుకుంటుందని పేర్కొన్నారు. సూపర్ లగ్జరీ బస్సు చార్జీ రూ.4వేలు, అల్ట్రా డీలక్స్ రూ.3900, ఎక్స్‌ప్రెస్ రూ.3600లుగా నిర్ణయించినట్లు చెప్పారు. నెల్లూరు ప్రధాన బస్టాండు నుంచి ఈ నెల 17, 22, 23, 24, 30 తేదీల్లో, అదేవిధంగా డిసెంబరులో 1, 3, 5, 7, 11, 14, 15, 17, 22, 26, 31 తేదీల్లో, జనవరిలో 2, 5, 10 తేదీల్లో ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు 1, 2 డిపోల మేనేజర్లు వెంకటేశ్వర్లు, కరీమున్నీసా, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రి హత్య కేసులో తనయుడికి జీవితఖైదు 6

ఓం నమఃశివాయ!

శివం శంకరం శంభో మీశాన మీడే
ప్రభుం ప్రాణనాథం విభుం విశ్వనాథం
జగన్నాథనాథం సదానంద భాజాం
భవద్భవ్యభూతేశ్వరం భూతనాథం
శివం శంకరం శంభుమీశానమీడే

శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు

కార్తీక మాసం 3వ సోమవారం సందర్భంగా జిల్లాలోని శైవాలయాలు శివనామస్మరణలతో మారుమోగిపోయాయి. తెల్లవారు జామునే పుణ్య స్నానాలు ఆచరించి శివయ్య దర్శనం కోసం జనం బారులు తీరి పాలభిషేకాలు, మహాన్యాస రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష అర్చనలు, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు కార్తీక సోమవార ఉపవాస దీక్షలు చేపట్టారు. చంద్రోదయం అయిన తర్వాత కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో విశేష పుష్ప అలంకారాలు, ప్రాకారోత్సవాలు, పల్లకీసేవలు జరిగాయి. భక్తులతో ఆలయాలు కిటకిట లాడాయి. నెల్లూరులోని మూలా పేట మూల స్థానేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తరలి వచ్చారు. మూ స్థానేశ్వరుడికి పాలభిషేకాలు, సహస్ర లింగేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిపించారు. విశేష అర్చనలు జరిగాయి. బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయంలో సాయంత్రం లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. తరలివచ్చిన భక్తులు ఆలయం ముందు దీపాలు వెలిగించి, ఆదిదంపతులను పూజించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



శివలింగానికి జలభిషేకం



నెల్లూరు : మూలస్థానేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



బుచ్చి : జొన్నవాడలో లక్షదీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



నెల్లూరు : వెంగమాంబ ఆలయంలో స్వస్తిక్ ఆకృతిలో దీపాల వరుస



సంగం : తిరుమనకొండలో పాలభిషేకం


'సోమశిల'లో 71 టీఎంసీల నీరు

అనంతసాగరం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 12,026 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇక డ్యాంలో 71.747 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు

నేడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

- వివరాలు 6లో..



'మేము ఏం చేసినా చెల్లుతుందన్న ధీమానో లేదా ఏం చేసినా ఎవరేమి అడుగుతారులే' అన్న ధైర్యమో తెలియదు కానీ నెల్లూరు ఆర్అండ్‌బీ అధికారుల తీరు మాత్రం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే జిల్లాలో ఉద్యోగులు వర్సెస్ అధికారులు అన్నట్లుగా వివాదాలు నడుస్తున్నాయి. తాజాగా మరో టెండర్ వ్యవహారం ఆర్అండ్‌బీ అధికారుల తీరును వేలెత్తి చూపుతోంది. నచ్చిన కాంట్రాక్టర్‌కు వర్కులు దక్కేలా ఏకంగా టెండర్ నిబంధనలే మార్చడంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల తీరుతో అత్యవసరంగా చేయాల్సిన పనులు నెలల కొద్దీ ఆలస్యమవుతున్నాయి.

ఎవరి కోసం ఈ మార్పు?

- గత నెలలో మూడు శ్లాబ్ కల్వర్టర్ల నిర్మాణానికి టెండర్లు
- పటిష్టంగా ఉండేలా బిఎం-బిసీ విధానంలో ఎస్టిమేషన్లు
- మిక్సింగ్ ప్లాంట్ ఉన్న కాంట్రాక్టర్లకే ఎలిజిబులిటీ
- ఉన్నపళంగా టెండర్లను రద్దు చేసిన ఆర్అండ్‌బి అధికారులు
- ఇప్పుడు ప్లాంట్ అవసరం లేని విధంగా నిబంధనలు మార్పు
- ఓ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టేందుకు తెరవెనుక లాలూచీ?

నెల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు-సోమశిల రోడ్డుతోపాటు సంగం-విరువూరు-కలువాయి రోడ్డులో బాగా దెబ్బతిన్న మూడు స్లాబ్ కల్వర్టర్లను నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఒక్కో కల్వర్టర్‌ను రూ.50 లక్షలతో నిర్మించేందుకు గత నెలలో అత్యవసర మరమ్మతుల పేరుతో ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచారు. ఈ మూడు కల్వర్టర్ల నిర్మాణంతోపాటు రెండు వైపులా అప్రోచ్ రోడ్డును కూడా నిర్మించాల్సి ఉంది. సాధారణంగా ఆర్అండ్‌బీ రోడ్లను బీఎం-బీసీ (50ఎంఎం-30ఎంఎం) క్వాంటిటీతో నిర్మిస్తుంటారు. ఇలా నిర్మించే రోడ్లు వంద టన్నుల లోడ్‌తో వాహనాలు వచ్చినా తట్టుకుంటాయి. గత నెలలో టెండర్ పిలిచిన మూడు స్లాబ్ కల్వర్టర్ల విషయంలో కూడా ఇదే నిబంధన పాటిస్తూ ఎస్టిమేషన్లు తయారు చేశారు. బీఎం-బీసీ క్వాంటిటీ ఉంటే మిక్సింగ్ ప్లాంట్ ఉన్న కాంట్రాక్టర్లకు మాత్రమే టెండర్ వేసేందుకు అర్హత ఉంటుంది. అయితే ఓ కాంట్రాక్టర్ ఈ మూడు కల్వర్టర్ల పనులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించి ఆర్అండ్‌బీ అధికారుల ద్వారా పావులు కదిపారు. తనకు టెండర్ వేసేందుకు అర్హత వచ్చే విధంగా మిక్సింగ్ ప్లాంట్ నిబంధన తీసేసేలా తెరవెనుక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలోనే దసరా సమయంలో మామూళ్ల పేరుతో భారీగా చేతులు తడిసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ వెంటనే ఉన్నపళంగా అధికారులు టెండర్లను రద్దు చేశారు. ఇందుకు ఎస్టిమేషన్లో తప్పులున్నాయన్న కారణాన్ని చూపించారు. మరి ముందుగా ఎస్టిమేషన్లు తయారు చేసినప్పుడు ఏఈ నుంచి ఎస్ఈ వరకూ ప్రతీ ఒక్కరూ పరిశీలించి టెండర్లు పిలిచాక తప్పులు ఎక్కడి నుంచి వచ్చాయో అధికారులే చెప్పాలి. ఇదిలా ఉంటే అత్యవసరంగా నిర్మించాల్సిన స్లాబ్ కల్వర్టర్ల విషయంలో ఆర్అండ్‌బీ అధికారులు తీవ్ర నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారు. ఓ కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేందుకు నెల రోజుల క్రితం రద్దు చేసిన టెండర్లను ఇప్పటి వరకూ మళ్లీ పిలవలేదు. మిక్సింగ్ ప్లాంట్ నిబంధన తీసేసి టెండర్లు పిలిచేలా మళ్లీ ఎస్టిమేషన్లను మారుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం ఆర్అండ్‌బీ వర్గాల్లో చర్చనీయాంశంగా ఉంది. అధికారులకు రోడ్ల పటిష్టత కన్నా కాంట్రాక్టర్లే ముఖ్యమని, అందుకే బీఎం-బీసీ క్వాంటిటీను మార్చి తక్కువ క్వాలిటీ నిబంధనను పెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఇన్‌చార్జ్ ఎస్ఈ రామకృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా స్లాబ్ కల్వర్టర్లకు సంబంధించి మరో మారు టెండర్లు పిలవనున్నట్లు చెప్పారు. ఈసారి మిక్సింగ్ ప్లాంట్ నిబంధనను తొలగించినట్లు ఆయన స్పష్టం చేశారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతులు

జిల్లాకు 'బిర్లా' పరిశ్రమ

- బొడ్డువారిపాళెంలో 48.47 ఎకరాల స్థలం కేటాయింపు
- రూ.240 కోట్ల పెట్టుబడితో ఫైబర్ సిమెంట్ బోర్డ్ ప్లాంట్
- ప్రత్యక్షంగా 588 మందికి ఉపాధి

నెల్లూరు (వెంకటేశ్వరపురం) నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చేందుతోంది. పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూమి, నీరు, రవాణాకు అనువుగా రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులు ఉండటంతో అనేక భారీ పరిశ్రమలు జిల్లాకు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే విశ్వసముద్ర, హిందుస్థాన్ పెట్రోలియం కంపెనీ, ఇండోసోల్ సోలార్, జేఎస్‌డబ్ల్యూ, శ్రీచక్ర, క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ ఇలా అనేక ప్రసిద్ధ కంపెనీలు జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. తాజాగా బిర్లా గ్రూప్ భారీ పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొన్నది. రాజుపాళెం సమీపంలోని బొడ్డువారిపాళెం ఎంఎస్ఎంఈ పార్కులో 48.47 ఎకరాల భూమిని ఇప్పటికే ఆ సంస్థ కొనుగోలు చేసింది. దాదాపు రూ.240 కోట్ల పెట్టుబడితో ఎకో ఫ్రెండ్లీ ఫైబర్ సిమెంట్ బోర్డులను తయారు చేయనున్నారు. 588 మంది నిరుద్యోగులకు ఉపాధి లభించనున్నది త్వరలోనే గ్రౌండ్ లేవల్ పనులు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది.

మమ్మల్ని ఆదుకోండి!

కలెక్టరేట్ వద్ద కౌలు రైతుల ధర్నా

నెల్లూరు(వైద్యం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులను అన్ని విధాలా ప్రభుత్వ ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గుర్నాథం, జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, పొట్టేపాళెం చంద్రమౌలి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కింద కౌలు రైతులకు రూ.20 వేలు ప్రభుత్వం అందించాలన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు యూరియా సక్రమంగా అందేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, జిల్లా అధ్యక్షుడు పూడిపర్తి జనార్దన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు : బస్టాండులో సోదాలు చేస్తున్న పోలీసులు

ఢిల్లీ ఎఫెక్ట్..

జిల్లాలో పోలీసుల అలర్ట్

- వివిధ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు

ఢిల్లీలో సోమవారం సాయంత్రం జరిగిన బాంబు పేలుడు నేపథ్యంలో జిల్లాలో పోలీసు అధికారులు అప్రమత్తం అయ్యారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రెడ్ అలెర్ట్‌ను ప్రకటించడంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో దాడులు చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రదేశాలు ఇలా అన్నీ ప్రాంతాల్లోనూ విస్తృత తనిఖీలు చేశారు. ప్రధానంలో జనసమూహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లు సోదాలు చేశాయి. ఈ సందర్భంగా ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ అనుమానితులు ఎవరైనా ఉంటే వెంటనే సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే కావలిలో సీఐలు రాజేశ్వరరావు, గిరిబాబు, ఫిరోజ్‌లు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)



కావలిలో.

స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా..

ప్రతి నియోజకవర్గంలో పర్యవేక్షణ కేంద్రాలు

ఉదయగిరి సచివాలయం-3లో ఏర్పాటు

ఉదయగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం స్వర్ణాంధ్ర (విజన్-2047)కు శ్రీకారం చుట్టింది. పది సూత్రాల అమలు కోసం ప్రస్తుతం నియోజకవర్గానికి ఒకటి చొప్పున పర్యవేక్షణ కేంద్రం ఏర్పాటు చేసింది. ఇందుకు పది సూత్రాలు నిర్దేశించింది. పేదరిక నిర్మూలన, ఉద్యోగాల కల్పన, మానవ వనరులు, నైపుణ్యాభివృద్ధి, జల సంరక్షణ, రైతులకు తోడ్పాటుగా వ్యవసాయంలో సాంకేతికాభివృద్ధి, అంతర్జాతీయంగా సరుకు రవాణాభివృద్ధి, ఇంధన ఖర్చు తగ్గింపు, ఉత్పత్తి సామర్థ్యం పెంపు, స్వచ్ఛాంధ్ర సాధన, సామాజిక, ఆర్థిక శిక్షణ, ప్రభుత్వ రంగాల్లో ఏఐ అభివృద్ధి లక్ష్యాలుగా పెట్టుకుని ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం నియోజకవర్గానికో పర్యవేక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయగిరికి సంబంధించి స్థానిక సచివాలయం-3లో రూ.లక్షల విలువైన కంప్యూటర్లు, ఫర్నిచర్, ఇతరత్రా సామగ్రితో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యాలయంలో ఉద్యోగులు విధులు నిర్వహించే గదితోపాటు చైర్మన్, ప్రత్యేకాధికారులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు.



కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

- ఆరుగురు ఉద్యోగుల నియామకం

స్వర్ణాంధ్ర కోసం ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఓ యంగ్ ప్రొఫెషనల్‌ను నియమించారు. ఈ కేంద్రానికి చైర్మన్‌గా ఎమ్మెల్యే, ప్రత్యేకాధికారిగా డివిజన్‌స్థాయి అధికారి ఉంటారు. ఉద్యోగులు నిత్యం నియోజకవర్గ ప్రగతిని స్థానిక ఎమ్మెల్యేకు నివేదించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన కేంద్రం నుంచి వీరంతా వారికి అప్పగించిన శాఖల వారీ పురోగతితోపాటు పీ-4 అమలు తదితర వాటిని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తారు. నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులపై సమీక్షలు, ప్రజాదర్బారు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక తదితర కార్యక్రమాలు ఈ కేంద్రం నుంచే నిర్వహించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
కోడిగుడ్ల ధర (100):	585

రాయితీపై యూరియా పంపిణీ

కొండాపురం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుఎర్రబల్లి రైతుసేవా కేంద్రంలో సోమవారం రాయితీపై యూరియాను రైతులకు పంపిణీ చేశారు. సచివాలయ పరిధిలోని రైతులకు 400 యూరియా బస్తాలను ప్రజాప్రతినిధులు, సచివాలయ అధికారులు అందజేశారు. టీడీపీ నాయకుడు వేముల బాలక్రిష్ణ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో గరిమెనపెంట సొసైటీ డైరెక్టర్ వెలుగోటి కొండయ్య, టీడీపీ నాయకులు చెన్నుబోయిన నరసింహారావు, నాగిరెడ్డి, చేబ్రోలు వినయ్‌కుమార్, మోదేపల్లి శ్రీకాంత్, మండవ హరీష్, నాయుడమ్మ తదితరులు పాల్గొన్నారు.



యూరియా అందచేస్తున్న టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది

13 నుంచి పచ్చదనం, పరిశుభ్రతపై శిక్షణ

వలేటివారిపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 13 నుంచి 15 వరకు పచ్చదనం - పరిశుభ్రతపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉప సర్పంచులకు, 14న ఎంఆర్‌సిలు, గ్రీన్‌అబాసిడర్లు, గ్రీన్‌గార్డ్‌కు, 15న వీఓఏలకు, డ్వాక్రా సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విలేకరిపై దాడి అన్యాయం

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు పనులు నాసిరకంగా ఉన్నాయని వార్త రాసిన విలేకరిపై దాడి చేయడం అన్యాయమని మండల సీనియర్ సీపీఎం నాయకుడు తుమ్మల వెంకయ్య, మండల సీఐటీయు అధ్యక్షులు చల్లా నరహరి, మండల ఉపాధ్యక్షుడు షేక్ బాదుల్లా, కార్యదర్శి అన్వర్ బాషా తదితరులు మాట్లాడుతూ అన్నారు.

హైలెవల్ వంతెన నిర్మించండి సారూ..

ఉప్పుటేరుపై బ్రిడ్జి లేక జనం ఇక్కట్లు

లింగసముద్రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కందుకూరు, లింగసముద్రం, కావలి ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న మండలంలోని పెదపవని సమీపంలోని ఉప్పుటేరుపై హైలెవల్ వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఉప్పుటేరుపై సుమారు 22 సంవత్సరాల క్రితం అధికారులు లోలెవల్ వంతెన నిర్మించారు. అయితే అప్పటి నుండి పలు గ్రామాల ప్రజలు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తున్నారు. అయితే భారీ వరదలు వచ్చిన సమయంలో వరద నీరు ఈ వంతెనపై కనీసం నాలుగైదు అడుగుల ఎత్తున ప్రవహిస్తుంది. దీంతో ఈ వంతెనపై రాకపోకలు నిలిచిపోయేవి. ఈ వంతెనకు ఇరువైపులా బస్సులు, కార్లు, ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలు నిలిచిపోయేవి. దీంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వరద నీటి కారణంగా లింగసముద్రం నుండి పెదపవని మీదుగా కావలికి, కందుకూరు నుండి చినపవని మీదుగా కావలికి, అలాగే పెదపవని, ముత్యాలపాడు గ్రామాల నుండి కందుకూరుకు రాకపోకలు రోజుల తరబడి నిలిచి పోయేవి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కాగా, 2022లో ఈ వంతెనపై వచ్చిన భారీ వరదలకు ఒక ఆటో ఉప్పుటేరులో కొట్టుకొని పోయి ఇద్దరు యువకులు చనిపోయారు. దీంతో వరదలు వచ్చిన సమయంలో ఈ వంతెనపై ఎవరూ రాకుండా పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. అయితే పలుమార్లు ప్రజలు ఈ లోలెవల్ వంతెనపై హైలెవల్ వంతెనను నిర్మించాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి హై లెవల్ వంతెన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



పెదపవనిలో ఉప్పుటేరుపై నిర్మించిన లోలెవల్ వంతెన

గర్భిణులు, బాలింతలు

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

కావలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని వెంగళరావునగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ డాక్టర్ మహేష్ తెలిపారు. స్థానిక వెంగళరావునగర్ అర్బన్ హెల్త్‌సెంటర్లో సోమవారం డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ, వెంగళరావునగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ పథకం కింద గర్భిణులు, బాలింతలకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రామ్‌సెంటర్ సౌజన్యంతో ఐరన్, పోలిక్ సిరప్‌లు, క్యాల్షియం విటమిన్ డ్రాప్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్‌సెంటర్ ఛైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ రమణయ్య, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న డాక్టర్ మహేష్, తాతిరెడ్డి తదితరులు

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

కావలి, నవంబర 10 (ఆంధ్రజ్యోతి) కావలి మున్సిపాలిటీలో పని చేస్తున్న రోజువారీ పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. 2016 నుంచి డైలీవేజస్ కార్మికులుగా పని చేస్తున్నవారికి ఇప్పటికీ వేతనాలు పెంచలేదన్నారు. కనీస వేతనం రోజుకు రూ.597 ఇవ్వాల్సి ఉండగా రూ.350 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కావలి శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, సీపీఐ నాయకులు ఎం. వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు

మొక్కలు నాటితే ప్రాణులను రక్షించినట్లే..!

బిట్రగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటితే ప్రాణికోటిని రక్షించినట్లేనని కోవూరుపల్లి వైద్యుడు రామకృష్ణ, టీడీపీ మండల కన్వీనర్ ఎం నాగేశ్వరరావు పేర్కొన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి పంచాయతీ పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఇందుపూరు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతు పర్యావరణ పరిరక్షణతో పాటు అమ్మవారి సన్నిధికి వచ్చే భక్తులు సేదతీరేందుకు అనువుగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని టీడీపీ సీనియర్ నాయకుడు నాటకరాణి శీనయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బత్తిన నిరంజన్‌రెడ్డి, ఎస్ భాస్కర్, ఇందుపూరు రామోహన్‌రెడ్డి, ఎస్ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డాక్టర్ రామకృష్ణ

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

గుడ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాలిపేట ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రామాలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన ప్రజలకు పునరావాసం కోసం ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో కూడిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను నిర్మిస్తోందన్నారు. అందులో భాగంగా సాలిపేట ఎస్టీ కాలనీలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, నాయకులు చేపల రమణయ్య, అట్ల కోటయ్య, ఆవుల శ్రీను, పోలుగంగు కృష్ణ, గొల్లపోతు హరిప్రసాద్, సుబ్రమణ్యం, గద్దగుంట శ్రీను, రావూరి వేణు, తదితరులు పాల్గొన్నారు.



రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కందుకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టులుగా పనిచేస్తున్న ప్రతిఒక్కరికీ ఇళ్లస్థలాలు కేటాయించాలని కందుకూరు జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ (కేజేడబ్ల్యూఏ) యూనియన్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి వినతిప్రతం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం జర్నలిస్టు యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయిస్తామని పలుమార్లు హామీలు ఇచ్చినప్పటికీ అమలుచేయలేదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో కేజేడబ్ల్యూఏ అధ్యక్షుడు యర్రంశెట్టి ఆనంద మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గౌడపేరు రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ, కోశాధికారి కేశవరావు, సభ్యులు ప్రభాకర్, కృష్ణమోహన్, శ్రీకాంత్, మాధవరావు తదితరులు ఉన్నారు.

రైతాంగానికి చేయూతనివ్వండి : కిసాన్ మోర్చా

కావలి (టౌన్) నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతాంగానికి చేయూతనందించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల మురళీకృష్ణ నాయుడు కోరారు. జనతా వారధి కార్యక్రమంలో భాగంగా సోమవారం బీజేపీ నాయకులు ఆర్డీవో వంశీకృష్ణకు సమస్యలపై వినతిపత్రం అందించారు. రైతాంగానికి యూరియా, విత్తనాలు, పశువుల దాణా సరఫరా చేయాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జాతీయ రహదారులు గ్రామీణ ప్రాంత రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు కె బ్రహ్మానందం, నేతలు మంద కిరణ్, పరుసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నేతలు

'తల్లికి వందనం' అందించండి !

బిట్రగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అర్హులైన తమ కుటుంబాలకు అందలేదని పిల్లల తండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బోగోలు మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యంకు సోమవారం బొందునాగేంద్ర, రవికుమార్, టైలర్ మధు, శ్రీనివాసులు వినతి పత్రం అందజేశారు. దినకూలీ చేసుకుంటూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చదివించుకుంటున్నామని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు.



ఎంపీడీవోకి వినతిపత్రం అందచేస్తున్న బాధితులు

గిరిజన కాలనీకి నీరు సరఫరా చేయాలి

కావలి (టౌన్) నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గిరిజన కాలనీకి నీరు సరఫరా చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పి పెంచలయ్య డిమాండ్ చేశారు. 17వ వార్డుకు చెందిన గిరిజన కాలనీ వాసులు సీపీఎం నాయకులతో కలిసి సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని ధర్నా నిర్వహించారు. పదేళ్ళనుంచి 100 కుటుంబాలకు పైగా గిరిజనులు నివాసముంటున్నారని, నేటికీ నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు మధుసూధన్‌రావు, ప్రజా సంఘాల నాయకులు ఎస్ మధు, చలంచర్ల లక్ష్మయ్య, సుశీల తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

ప్రమాదాలు జరగకుండా క్రాస్‌రోడ్డు మూసివేత

బిట్రగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరు జాతీయ రహదారి కూడలి క్రాస్ రోడ్డును కావలి రూరల్ సీఐ పాపారావు, స్థానిక ఎస్ఐ ప్రభాకర్, ఎన్‌హెచ్ 5 సిబ్బంది సోమవారం మూసివేశారు. ఈ సందర్భంగా సీఐ పాపారావు మాట్లాడుతూ కొండబిట్రగుంట, ముంగమూరు, ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు రోడ్డు క్రాస్ చేస్తుండగా మృతి చెందారన్నారు. సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాల్యాద్రి అనే వ్యక్తి మృతి చెందడానికి కారణం రోడ్డు క్రాస్ చేయడమేనన్నారు. ప్రమాదాలను నివారించేందుకే క్రాస్ రోడ్డు మూసివేశామన్నారు. సమీపంలోని కడనూతల గ్రామంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి ద్వారా సర్వీస్ రోడ్లు ఉన్నాయని, ఆ మార్గంలో వెళ్లాలని పోలీసులు సూచించారు.



రోడ్డును మూసేస్తున్న పోలీసులు

ఇండియన్ రెడ్‌క్రాస్ సేవలు అద్వితీయం

నెల్లూరు(వైద్యం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ నెల్లూరు శాఖ సేవలు అద్వితీయమని సెయిల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ కంపెనీ చైర్మన్ తారెక్ మహమ్మద్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రానికి రక్త భాగాల విభజన యంత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్‌లో అందిస్తున్న సేవలకు అనుగుణంగా రక్తభాగాల విభజన యంత్రం (రిఫ్రిజిరేటర్ సర్టిఫ్యూజ్ మిషన్‌ను) అందజేశామని వెల్లడించారు. భవిష్యత్తులో మరింత సహకారం అందచేస్తామని తెలిపారు. తలసేమియా ప్రాజెక్టు సభ్యులు డాక్టర్ సీత, బ్లడ్‌బ్యాంకు చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ యశోవర్ధన్‌లు రెడ్‌క్రాస్ ప్రాజెక్టుల గురించి కంపెనీ ప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెయిల్ కంపెనీ ప్రతినిధులు నదియా, ఆల్‌బటాషీ, ఎరచ్ కూపర్, పేర్ల కూపర్, మహాపాత్ర, రెడ్‌క్రాస్ చైర్మన్ విజయకుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ సీహెచ్. జనార్ధన్‌రాజు పాల్గొన్నారు.



పరికరం అందజేస్తున్న సెయిల్ కంపెనీ ప్రతినిధులు, రెడ్‌క్రాస్ నిర్వాహకులు

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు

నెల్లూరు(విద్య), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈనెల 14, 15వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి పీ.అఖిల్ తెలిపారు. నాయుడుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫంక్షన్ హాలులో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 20 బంగారు, 3 వెండి, 3 కాంస్య పతకాలతో రాష్ట్రస్థాయికి అర్హత సాధించారన్నారు. విజేతలకు నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మనీషా, ఉపాధ్యక్షుడు ముఖేష్, కోశాధికారి శ్రీకాంత్, తైక్వాండో క్లబ్ నిర్వాహకుడు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జామాయిల్ సాగుపై రైతుల మొగ్గు

వీవీ పాలెం మండలంలో గణనీయంగా పెరగనున్న సాగు



వలేటివారిపాలెంలో సాగులో ఉన్న జామాయిల్

వలేటివారిపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది రైతులు జామాయిల్ సాగుపై మొగ్గుచూపుతున్నారు. దీంతో మండలంలో జామాయిల్ గణనీయంగా పెరగనుంది. గత రెండేళ్ల నుండి జామాయిల్ ధర టన్ను రూ. 8 వేలకు పెరగడమే సాగుకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. దీంతో జామాయిల్ నారుకు మంచి డిమాండ్ పెరిగింది. వాణిజ్య పంట మిర్చి సాగు ఈ ఏడాది పూర్తిగా తగ్గిపోయింది. గత రెండేళ్ల నుండి మిర్చి రైతులను తెగుళ్ల వెంటాడడం, వాతావరణం అనుకూలంగా లేకపోడంతో మిర్చి దిగుబడులు తగ్గిపోడం, దీనికి తోడు మిర్చి ధరలు లేకపోవడతో గత రెండేళ్లుగా మిర్చి సాగుచేసిన రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు. దీంతో మిర్చి సాగు పూర్తిగా తగ్గిపోయింది. అంతేగాకుండా పొగాకు రైతులకు ఈ ఏడాది పెరిగిన ఖర్చులు, తగ్గిన నాణ్యమైన దిగుబడులు, ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో పొగాకు రైతులు కూడా ఈ ఏడాది నష్టాలను మూటగట్టుకున్నారు. వాణిజ్య పంటల సాగుతో పెరిగిన పెట్టుబడులు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులు ఈ ఏడాది జామాయిల్ సాగుపై దృష్టి సారించారు. వలేటివారిపాలెం మడలంలో ఈ ఏడాది సుమారుగా 10 వేల ఎకరాలలో జామాయిల్ సాగు చేపట్టినట్లు తెలుస్తోంది. శనగ, పొగాకు, మిర్చి పంటలు పండే నల్లరేగడి భూముల్లో సైతం జామాయిల్ సాగు చేస్తున్నారు. అంతేగాకుండా సాగునీటి చెరువుల కింద మాగాణి భూముల్లో కూడా జామాయిల్ సాగు చేస్తున్నారు. అంతేగాకుండా జామాయిల్ నాటిన మూడేళ్లకే జామాయిల్ కర్ర కొట్టుడుకు వస్తుంది. సారవంతమైన నల్లరేగడి భూములు కలిగి, నీటి వసతి ఉంటే రెండున్నరేళ్లకే జామాయిల్ కటింగ్‌కు వస్తుంది. దీంతో పెట్టుబడులతో పాటు లాభాలు కూడా బాగానే వస్తాయి. జామాయిల్ మొక్క నాటిన మొదటి ఏడాది పెట్టుబడి ఎక్కువ పెట్టాల్సి వస్తుంది. రెండు, మూడు విడతలలో అంతగా పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం లేదు.

● **కొద్దిపాటి వర్షం కురిసినా...**

వర్షాకాలంలో జామాయిల్ మొక్కలు నాటుతారు. ఓ మోస్తరు వర్షం కురిస్తే మొక్క బతుకుతుంది. మూడు నాలుగు నెలల్లో ఆ మొక్కలు ఐదారు అడుగుల ఎత్తు పెరుగుతాయి. జామాయిల్ సాగుకు అడవి జంతువుల బెడద ఉండదు. ఒక్కసారి జామాయిల్ సాగు చేసి వదిలేస్తే పదేళ్ల వరకూ పంట వస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు జామాయిల్ సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

నెల్లూరు(వైద్యం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని డ్రైవర్స్ కాలనీ వాసులకు ఇళ స్థలం పట్టాలు ఇవ్వాలని డిప్యూటీ మేయర్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాదాలతోపాటు సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడారు.

రబీ సాగుకు రైతుల సన్నద్ధం

● సన్నాలపై ఆసక్తి ● పెరుగుతున్న వ్యయం ● అయినా రైతుల్లో తగ్గని ఆశలు

అల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్ సాగుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విత్తనాలను సేకరించుకొని నారుమళ్లు పోశారు. మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఐఏబీ సమావేశం నిర్వహించాక, రైతుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. పెన్నార్ డెల్టా ఆయకట్టు పరిధిలో 7.30 లక్షల ఎకరాల్లో వరిసాగు చేపట్టేలా సాగునీటిని విడుదల చేస్తామని ప్రకటించారు.


● **సన్నాలపై ఆసక్తి**

కొన్నేళ్లుగా రైతులు సన్నాల రకాలపైనే ఎక్కువ ఆధారపడి సాగు చేపడుతున్నారు. వీటిలో అధికంగా బీపీటీలు, కెఎన్ఎం, ఎన్ఎల్ఆర్ రకాలపై రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. మార్కెట్లో విక్రయించేందుకు వెసులుబాటుగా ఈ రకాలను ఎంపిక చేసుకొని సాగు చేపట్టేందుకు ముందుకు వచ్చారు. సాగు చేపట్టేందుకు కూడా అనుకూల వాతావరణం కావడంతో వీటిపై రైతులు దృష్టి సారించారు.

● **సాగు వ్యయం అధికం :** వరి సాగు చేపట్టాలంటే ఎకరానికి రైతు రూ.40 వేల వరకు వ్యయం అవుతోంది. కష్టపడి పనిచేసే రైతుకు రూ.5 వేలు తగ్గుతాయే తప్ప మిగతా ఖర్చు మొత్తం ఒకేలా ఉంటుంది. దుక్కి దున్నాలంటే ఎకరానికి దాదాపుగా రూ.4 వేలు, నారుమడికి రూ.2500, మరమ్మతులకు రూ.1000, నాట్లుకు రూ.6 వేలు, ఎరువుల యాజమాన్యానికి రూ.8 వేలు, కలుపులకు రూ.3500, పురుగు మందులకు రూ.8 వేలు, కూలీలు రూ. 8 వేలు, వరికోత యంత్రానికి రూ. 2500 వ్యయం అవుతోంది. వీటిల్లో స్వయంగా వ్యవసాయం చేసుకునే రైతుకు రూ.8 వేలు కూలీలు మినహాయిస్తే మిగిలినవన్నీ వ్యయంగా భరించాల్సిందే.

● **రైతుకు మిగిలేదేంటి..?**

ఇలా ఎకరానికి రూ.40 వేల పైచిలుకు వ్యయం అవుతుంటే ఎకరానికి 4 పుట్లు ధాన్యం దిగుబడి అయితే కొంతమేర మిగులుతుంది. పుట్టి ధర డిమాండ్‌ను బట్టి రూ.17 వేలు ఉంటే ఎకరానికి రూ.68 వేలు రాబడి ఉంటుంది. ఇందులో రూ.40 వేలు నుంచి రూ.45 వేలు వ్యయం పోను రైతుకు మిగిలేది రూ.20 నుంచి రూ.25 వేలు మాత్రమే. ధాన్యం ధర బాగా ఉంటే రైతులకు తమ కష్టం పోను కొంత వరకు లాభాలు వస్తాయి.



నాట్లకు సిద్ధంగా ఉన్న నారుమడి

వ్యయమైనా.. సాగు తప్ప మరేమీ చేయలేం !

ఏటేటా వ్యయం పెరిగిపోతున్నా వరి సాగుపై ఆధారపడి జీవించడం తప్ప ఇతర పనులేమీ చేయలేం. వ్యవసాయం ఖర్చుతో కూడుకున్నది అయిపోతున్నా, ఏదోక రోజు మా రాతలు మారుతాయని ఆశపడుతున్నాం.



- పప్పు సుధాకర్, రైతు, అల్లూరు

పూర్తిస్థాయిలో సహకారం అందిస్తేనే..

చిన్నతనం నుంచి వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నాం. ఇప్పటివరకు ఎలాంటి ఎదుగుదల లేదు. రైతులకు పూర్తిస్థాయి సహకారం అందించి ఎరువులు, పురుగు మందుల ధరలు తగ్గి, ధాన్యం ధరలు పెరిగితే కానీ రైతులు బాగుపడే మార్గం కనపడడంలేదు.



- దానం రజిని, రైతు, ఇస్కపల్లి, అల్లూరు

మెలకువలు పాటిస్తేనే ఆదాయం

రైతులు అవగాహన లేక అధిక వ్యయాన్ని భరిస్తున్నారు. అవసరం లేకున్నా వినియోగించే ఎరువులు, పురుగు మందుల కారణంగానే నష్టపోతున్నారు. విచ్చలవిడిగా వినియోగించే వీటి వల్ల దుష్ప్రభావాలు అధికమవుతున్నాయి. మెలకువలు పాటించి అవసరమైన మేరకు ఎరువులు వినియోగిస్తేనే రైతులకు ఆదాయం చేకూరుతుంది.



- వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి, అల్లూరు

అమరవీరుల స్ఫూర్తితో విధులు



అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న డీఎఫ్‌వో, అటవీశాఖ ఉద్యోగులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యోగులు విధులు నిర్వహించాలని డీఎఫ్‌వో మహబూబ్‌బాషా పేర్కొన్నారు. నరగంలోని నిప్పో వద్ద గల జిల్లా అటవీశాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా అమరవీరుల స్తూపానికి డీఎఫ్‌వో, ఉద్యోగులు,సిబ్బంది నివాళులు అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రేంజర్లు మాల్యాద్రి, రామిరెడ్డి,శేఖర్,కుమార్‌రాజా, తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ.. 'డ్రమ్ములే' ప్రమాద సూచికలు !



అల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అరే.. నడి రోడ్డుపై ఈ డ్రమ్ములేంటి? అని ఆశ్చర్యపోతున్నారా? అవును.. అల్లూరు పట్టణ శివారులోని బార్ సమీపంలో రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డు దుస్థితి ఇది. రోడ్డు మధ్యలో మోకాలి లోతు గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో వాహన చోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంత మరింత పెద్దదిగా మారింది. వాన నీటితో నిండిన ఈ గుంతను గమనించక పలువురు వాహన చోదకులు ఇక్కడ ప్రమాదాలకు గురయ్యారు. పంచాయతీ పాలకులు ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించే నాథుడే కరువయ్యాడని ప్రయాణీకులు వాపోతున్నారు. దీంతో విధి లేక స్థానికులు వాహనచోదకులను ప్రమాదాల బారినుండి కాపాడేందుకు ఇదిగో.. ఇలా రోడ్డు మధ్యలో డ్రమ్ములనే ప్రమాద సూచికలుగా ఏర్పాటు చేయడం గమనార్హం. పాలకులారా.. అధికారులారా.. పల్లె రోడ్లపై ఈ డ్రమ్ముల దుస్థితిని చూశాకైనా.. మీ 'బాధ్యత' గుర్తొస్తుందా?

నేడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో భారతరత్న మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు హాజరుకావాలని ఆయన కోరారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీరామ్



నెల్లూరు(హరనాథపురం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడుగా నెల్లూరు రూరల్ మండలం కోడూరుపాడుకు చెందిన బీ.శ్రీరామ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ సోమవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ జిల్లాలో బీఎస్పీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీని ముందంజలో నిలబెట్టేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు చేపడతామన్నారు.

తిరుమల లడ్డూ కుట్ర పాపం పండుతుంది!



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు(వైద్యం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడి ప్రసాదం పవిత్రతను భ్రష్టు పట్టించిన వారి పాపాలు పండుతున్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం నెల్లూరు నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ హయాంలో లీటరుకు రూ.20 కమీషన్ తీసుకుని కల్తీ నెయ్యి సరఫరా చేయించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఒక్క లీటరు పాలు కొనుగోలు చేయని బోలేబాబా డెయిరీ నుంచి నెయ్యి కొనుగోలు చెయ్యడం అవినీతిలో భాగమేనన్నారు. జగన్‌రెడ్డికి హిందూ దేవుళ్లంటే నమ్మకం లేదని, మాజీ చైర్మన్ సుబ్బారెడ్డిది అదే పరిస్థితి అన్నారు. సీబీఐ విచారణతో నిర్ఘాతపోయే విషయాలు బయటకు వస్తున్నాయని, వాస్తవాలు జీర్ణించుకోలేక సాక్షిలో అడ్డగోలు వార్తలు వండి వారుస్తున్నారని విమర్శించారు. బ్యాంకు లావాదేవీలు సిట్ అధికారులు కోరితే వైవీ సుబ్బారెడ్డి కోర్టుకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. ఏఆర్ డెయిరీకి అర్హత లేకపోయినా నెయ్యి సరఫరా ఆర్డర్లు ఇవ్వడం కుంభకోణంలో భాగమేనన్నారు. వైవీ సుబ్బారెడ్డి, రోజా, చెవిరెడ్డిలు ధర్మారెడ్డి సహకారంతో వేల దర్శన టిక్కెట్లు అడ్డగోలుగా పొంది సంతలా మార్చేశారని ఆరోపించారు. ప్రస్తుత తిరుమల చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో అంతా నిజాతీగా నడుస్తుందని కోటాకు మించి ఒక్క లెటరు అనుమతించే పరిస్థితి లేదని తెలిపారు.

తండ్రి హత్య కేసులో తనయుడికి జీవితఖైదు

ఉలవపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కన్న తండ్రిని తలపై రాడ్డుతో కొట్టి, ఆపై మెడను కత్తితో కోసిన కొడుక్కి ఒంగోలు ఫస్ట్ ఏడీజే న్యాయాధికారి టీ. రాజ్యలక్ష్మి జీవిత ఖైదుతోపాటు రూ.500 జరిమానా విధించారు. పోలీసుల కథనం మేరకు, మండలంలోని చాకిచర్లకి చెందిన ఒట్లూరు కృష్ణ(30) దురుసు ప్రవర్తనతో భార్య వదిలేసి వెళ్లింది. దీంతో ఆయన తల్లిదండ్రులపై ఆధారపడి బతుకుతున్నాడు. తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా తనను పట్టించుకోవడం లేదనే కోపంతో 2022 జనవరి 27న తండ్రి రమణయ్యను ఇనుప రాడ్డుతో తలపై కొట్టాడు. కిందపడిన తండ్రి మెడను కత్తితో కోసి చంపాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు సాక్ష్యాధారాలతో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు విచారించిన న్యాయాధికారి నిందితుడికి సోమవారం పైవిధంగా తీర్పు చెప్పారు. ఈ కేసును వాదించడంలో ప్రతిభ కనపరిచిన స్పెషల్ పీపీ పద్మజ, కేసు విచారణలో సాక్ష్యాలను పొందుపరిచిన అప్పటి కందుకూరు సీఐ వీ శ్రీరామ్, ఏఎస్సై ఎం వెంకటేశ్వర్లు, ఉలవపాడు పోలీసులను ఎస్పీ అజిత వేజెండ్ల ప్రత్యేకంగా అభినందించారు.

చెరువులో పడి యువకుడి మృతి

లింగసముద్రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినపవని గ్రామానికి చెందిన ఓ యువకుడు మద్యం మత్తులో చెరువులో పడి మృతి చెందాడు.ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది.లింగసముద్రం ఎస్సై ఎం నారాయణ కథనం మేరకు, చిన పవని గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ కరీం స్నేహితుడితో కలిసి రాత్రివేళ చెరువు కట్టపై కూర్చొని మద్యం సేవిస్తున్నాడు.అయితే ప్రమాదవశాత్తు అబ్దుల్ కరీం చెరువులో పడిపోయాడు. ఈ విషయం తెలిసిన ఆయన బంధువులు, గ్రామస్థులు చెరువులో గాలింపు చేపట్టారు.అయితే కొద్దిసేపటి తర్వాత అబ్దుల్ కరీంను బయటకు తీశారు.దీంతో ఆయన తల్లి, సోదరులు, బంధువులు ఆయన్ను హుటాహుటిన చికిత్స కోసం కావలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి, ఆయన చనిపోయినట్టు నిర్ధారించారు.దీంతో వారు గ్రామంలోని తమ స్వగృహానికి మృతదేహాన్ని తీసుకువచ్చారు. సోమవారం ఆయన తల్లి ఆసియా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నారాయణ తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి మృతి

నెల్లూరురూరల్లో, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్లోని వివిధ ప్రాంతాల్లో ముగ్గురు మృతి చెందారు. రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాలు మేరకు.. షేక్ షాకీర్ (15) వైఎస్ఆర్ నగర్‌కు చెందిన నలుగురు స్నేహితులతో కలిసి ఆదివారం కొండ్లపూడి పంచాయతీ టిడ్కో గృహ సముదాయం వద్ద ఉన్న చెరువులో ఈతకు వెళ్లారు. ప్రమాదవ శాత్తు షాకీర్ నీట మునగడంతో మిగిలిన వారు ఒడ్డుకు వచ్చేయగా ఇతను మాత్రం రాలేదు. దీంతో అతని తల్లిదండ్రులు తొలత కనపడటం లేదని ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టగా సోమవారం ఆ బాలుడు చెరువులో శవమైన తేలాడు.

● భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థల కారణంగా కోడూరుపాడులోని కల్తీ కాలనీకి చెందిన వానపల్లి అమర్‌బాబు(29) ఆదివారం సాయంత్రం సమీపంలోని లేఅవుట్ ప్లాట్లలో గడ్డి మందుతాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. అక్కడ క్రికెట్ ఆడుతున్న కొందరు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతనిని వైద్యం కోసం నెల్లూరులోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

● కోడూరుపాడు వద్దనున్న మూతపడిన ఎస్ఎల్వీ పవర్ ప్లాంటులో అనుమానాస్పద స్థితి అదే ప్రాంతం మార్కేండేయ కాలనీకి చెందిన పాకం వెంకటరమణయ్య(65) మృతి చెందాడు. ఈయన ఆదివారం సుబ్బారెడ్డి అనే వ్యక్తితో కలిసి ప్లాంటులోకి వెళ్లగా అక్కడ కుక్కలు మెరగడంతో సుబ్బారెడ్డి గోడ దూకి బయటకు వచ్చేయగా వెంకటరమణయ్య మాత్రం అక్కడే ఉండిపోయాడని సీఐ తెలిపారు. సోమవారం ఉదయం చూడగా ఆయన అక్కడ మరణించి ఉన్నాడని, ఇందుకు కారణం తెలియదని చెప్పారు. మృతుడి భార్య పద్మమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాలి

పరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలో పక్కాగృహాల నిర్మాణంలో అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాలని సర్పంచు దిలీప్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడుతూ 2022-24లో 34 మంది లబ్ధిదారుల నివాసాలను ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్ అగ్రిమెంటు చేయించుకోవడం జరిగిందన్నారు. అనంతరం బేస్‌మెంట్ వరకు నాశిరకంగా పనులు చేపట్టి సుమారు రూ. 90వేలు వరకు నిధులు స్వాహా చేసి పరారయ్యాడన్నారు. గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, ఇప్పటికైనా స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు.



ఎంపీడీవోకి వినతిపత్రం అందిస్తున్న సర్పంచు దిలీప్‌కుమార్

వరిలో జింకు లోపం.. దిగుబడులపై ప్రభావం

● భూసార పరీక్షలు తప్పనిసరి

● కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరి పైరులో జింకు లోపం కారణంగా మొక్కలు ఎదగకపోవడం.. తక్కువ దుబ్బు కట్టడం.. ఆకులు పసుపు రంగులోకి మారడం.. వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటివల్ల సుమారు 10శాతం వరకు దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. జిల్లాలోని అన్నీ రకాల నేలల్లో జింకు లోపం తీవ్రంగా ఉందని, తద్వారా నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను మొక్కలు సమర్థవంతంగా ఉపయోగించుకోలే పోతున్నాయని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సేద్య విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కే.కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దీనివల్ల ఎరువుల ఖర్చులు పెరుగుతాయే తప్ప, ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. వరిపైరులో జింకు ధాతువు లోపం లక్షణాలు, నివారణ పద్ధతులను ఆయన ఆంధ్రజ్యోతి ద్వారా రైతులకు తెలియజేశారు.



జింకు లోపం ఉన్న వరిపైరు (ఫైల్)

● జింకు లోపానికి కారణాలు

లవణ సాంద్రత ఎక్కువగా ఉన్న నేలలు, క్షార, ఒండ్రు, సున్నపు నేలల్లో జింకు లోపం కనిపిస్తుంది. ఈ నేలల్లో సేంద్రీయ కర్బన శాతం తక్కువగా ఉండడం, కేవలం రసాయన ఎరువుల పైనే ఆధారపడి, సేంద్రీయ ఎరువులను విస్మరించడం, సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని పాటించకపోవడం వల్ల కూడా జింకు లోప లక్షణాలు కనిపిస్తాయి.

● లక్షణాలు

నారుమడిలోనూ, వరినాట్లు నాటాక ప్రధాన పొలంలోనూ జింకు లోపం కనిపిస్తోంది. చలి విపరీతంగా ఉండే రబీలోనూ, ఎడగారు వరిలోనూ ఎక్కువ జింకు లోపం వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల ప్రధాన పోషకాలు తగినంత వేసినా కూడా పైరు సరిగా పెరగదు. సాధారణంగా వరి నాటిన రెండు నుంచి నాలుగు, ఆరు వారాల్లో దుబ్బు కట్టే దశలో జింకు లోపాలు స్పష్టంగా కనిపిస్తాయి. పై నుంచి మూడు లేదా నాలుగు ఆకుల్లో ఈనె పాలిపోతుంది. ముదురాకు చివర్లో మధ్య ఈనెల ఇరుపక్కల తుప్పు, ఇటుకరంగు మచ్చలు కనిపిస్తాయి. ఆకులు చిన్నవిగా, పెళుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. మొక్కలు గిడసబారి దుబ్బు చేయవు. గుట్టగుట్టలుగా పైర్లు చనిపోయి ఖాళీగా పొలంలోనే నేల కనిపిస్తుంది నత్రజని ఎరువులు వేసినా పైరు పచ్చగా మారదు.

● నివారణ చర్యలు

వరిపైరు వేసే ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలి. జింకు తగినంత ఉందో.. లేదో...? తెలుసుకోవాలి. జింకు లోపం ఉందని తేలితే తప్పనిసరిగా ఎకరాకు 20కిలోల జింకు సల్ఫేట్‌ను వేసుకోవాలి. నారుమడడిలో సెంటు స్థలానికి 500గ్రాముల జింకు సల్ఫేట్‌ను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. ఎకరాకు రెండు క్వింటాళ్ల పశువుల ఎరువు, లేకుంటే కంపోస్టు, లేదంటే కోళ్ల వ్యర్థాలు, లేకుంటే ఫిల్టర్ మడ్ లాంటి సేంద్రీయ ఎరువులతో కలిపి 15కిలోల జింకు సల్ఫేట్‌ను 20 నుంచి 30 రోజుల వరకు గోనెసంచిలో ఉంచి మాగబెట్టాలి. ఈ మిశ్రమాన్ని పైరు వేసే ముందు దుక్కిలో చల్లితే దిగుబడిలో మార్పు కనిపిస్తుంది. వరి మాత్రమే పండించే పొలాల్లో ప్రతి మూడు పైర్లకు ఒకసారి, రెండు పంటలు పండించే పొలంలో ప్రతి రబీ పంటకు ఆఖరి దమ్ములో ఎకరాకి 20కిలోల జింకు సల్ఫేట్ వేయాలి. క్షార, చౌడు, సున్నపు నేలలైతే జింకు సల్ఫేటును ఎకరాకి 40కిలోల చొప్పున వేసుకోవాలి. 1-2 కిలోల జింకు సొల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా అనే జీవన ఎరువును 50కిలోల మట్టి, లేదంటే వర్మికంపోస్టు, లేదంటే పశువుల ఎరువుతో కలుపుకుని రెండు నుంచి మూడు రోజుల తరువాత ఎకరానికి చల్లుకోవాలి. 5-10 గ్రాముల జింకు సొల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా జీవన ఎరువును కిలో విత్తనానికి జిగురుతో లేదంటే బెల్లం ద్రావణంతో కలిపి నీడలో ఆరబెట్టి విత్తనాన్ని ఉపయోగించాలి. వరిపైరు జింకు లోపం కనిపించిన వెంటనే లీటరు నీటికి 2గ్రాముల చొప్పున జింకు సల్ఫేట్‌ను కలిపి 5రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి. భాస్వరం ఎరువుతో జింకు సల్ఫేటును కలిపి వేయకూడదు. రెండింటికి మధ్య కనీసం మూడు రోజుల వ్యవధి ఉండాలి. రెండూ కలిపి వేస్తే రసాయనిక చర్య వల్ల ఫలితం ఉండదు. జింకు సల్ఫేటు ద్రావణంలో పురుగు, తెగుళ్ల మందులు కలపరాదు.



డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి



దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు (వైద్యం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన విజ్ఞప్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని చెప్పారు. భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదో అర్జీదారులకు వివరించాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన పలు అర్జీలను పరిష్కరించారు అనంతరం దివ్యాంగుల వద్దకు వెళ్లిన కలెక్టర్ సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జేసీ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్‌వో విజయకుమార్, డీపీవో శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో న్యాయం చేస్తాం : ఎస్పీ



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతీ సమస్యకు చట్టపరిధిలో న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. 134 వినతులు రాగా వాటిని పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌజన్య, ఆత్మకూరు, ఎస్బీ డీఎస్పీలు వేణుగోపాల్, శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రేమను నిరాకరించానని కావలికి చెందిన వేణు తన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పెడుతూ వేధిస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ ఫిర్యాదు చేసింది. అదేవిధంగా మనుబోలుకు చెందిన రమణయ్య మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడంటూ నెల్లూరు రూరల్‌కు చెందిన ఓ దివ్యాంగురాలు ఫిర్యాదు చేసి అతని నుంచి రక్షణ కల్పించాలని కోరింది. కొండాపురంకు చెందిన మాలకొండయ్య సబ్సిడీలోన్లు ఇప్పిస్తానని నమ్మించి రూ.35వేలు తీసుకుని మోసం చేశాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన ఓమహిళ ఫిర్యాదు చేసింది. ఇంకా బ్యాంకు ఉద్యోగం ఇప్పిస్తామని నెల్లూరు నగరానికి చెదిన జెనర్జీ రూ.10లక్షలు తీసుకుని మోసం చేశాడని వేదాయపాళెంకు చెందిన ఓవ్యక్తి ఫిర్యాదు చేశారు.

'చంద్రన్న విద్యుత్ వెలుగు'తో ప్రయోజనం

త్రీ ఫేజ్ కరెంటు సరఫరా సందర్భంగా కలెక్టర్



రైతుతో కలిసి త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న కలెక్టర్ శుక్లా, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చంద్రన్న విద్యుత్ వెలుగుల పేరిట త్రీ ఫేజ్ కరెంట్‌ను 24 గంటల పాటు అందించడం వల్ల రైతులకు, పారిశ్రామివేత్తలకు ప్రయోజనం చేకూరనున్నదని కలెక్టర్ హిమాన్షు శుక్లా, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రూరల్ నియోజకవర్గంలో త్రీఫేజ్ పనులను సోమవారం వారు కోడూరుపాడు వద్ద రైతు రమణయ్య యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ నెల్లూరు రూరల్లో రూ. 50 కోట్లతో గ్రామాలు, మూడు డివిజన్లలో ఈ పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఇందువల్ల రైతులకు సాగునీటి సరఫరా కష్టాలు పూర్తిగా తీరినట్టేనని తెలిపారు. అటు వ్యాపారులు, ఇటు చిన్న పరిశ్రమదారులకు ఊరట లభించిందన్నారు. కోడూరుపాడులోని ఎస్టీకాలనీని భగత్‌సింగ్ కాలనీ తరహాలో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ వెంకటేశ్వర్లు, ఎస్ఈ రాఘవేంద్రన్, కార్పొరేటర్ నాగరాజు, టీడీపీ నేతలు గిరిధర్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, భానుశ్రీ పాల్గొన్నారు.కాగా నియోజకవర్గంలో ఎక్కడిక్కడ రైతులతో విద్యుత్ పనులను ప్రారంభించారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు



ట్రాన్స్‌జెండర్‌లకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(వైద్యం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 70 మంది ట్రాన్స్‌జెండర్లకు కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం గుర్తింపు కార్డులు అందజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ల ప్రతినిధి వనజ మాట్లాడుతూ తమకు గుర్తింపు కార్డులు ఇవ్వడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. పెంచన్ మంజూరుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అధికారులు గుర్తింపు కార్డు అడుగుతున్న నేపథ్యంలో ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆఖరికి శబరమలకు వెళ్లాల్సి ఉన్నా కలెక్టర్ ఇచ్చిన గుర్తింపు కార్డు ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

పట్టపగటి పూట.. సర్పాల సయ్యాట !

● విష పురుగులకు నిలయంగా ఇందిరమ్మకాలనీ

కావలి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇక్కడ రగిలేందుకు మొగలి పొద లేదు. వేయడానికి చెరుకు గడల మంచమూ లేదు. ఊదడానికి నాదస్వరమూ లేదు. అందుకే.. ఎక్కడ కలుసుకోవాలో తెలియక మునుసూరు ఇందిరమ్మ కాలనీలో.. ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో.. ఏపుగా పెరిగిన పచ్చగడ్డిలో ఓ నాగుపాము-జెర్రిపోతు ఇదిగో.. ఇలా.. విరహంతో పెన వేసుకున్నాయి. చిరంజీవి సినిమాలో అయితే.. ఇది.. సర్పాల సయ్యాటే. కానీ.. కావలి పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో మాత్రం ఇది.. ప్రజల ప్రాణాలతో ఆడే ప్రమాదకరమైన ఆట! కాలనీలో వీధి దీపాలు లేవు. అర్ధంతరంగా ఆగిన నివాసాల మధ్య.. సాగే ఈ సర్పాల నృత్యాన్ని ఇక్కడి పాలకులు.. అధికారులు ఓ చోద్యంలా చూస్తున్నారు. మరోవైపు.. స్థానికులు మాత్రం నిత్యం విష పురుగుల గుప్పిట్లో భయాందోళనలకు గురవుతున్నారు. అట్టల ఫ్యాక్టరీ సమీపంలోని మాదాల వెంకటేశ్వర్లు ఇంటి ముందు సోమవారం పట్టపగలే సుమారు 10 అడుగుల పొడవు గల నాగుపాము, జెర్రిపోతులు పెనవేసుకుని తోకలపై లేచి నాట్యం చేయడంతో కాలనీవాసులు, పిల్లలు భయంతో వణికిపోయారు. ఇందిరమ్మకాలనీలో వీధిలైట్లు వెలగడం లేదని, నివాసాల మధ్య అసంపూర్తి నిర్మాణాలతో నిరుపయోగంగా ఉన్న ఇంటి బేస్‌మెంట్లు విష సర్పాలకు నిలయాలుగా మారాయని స్థానికులు వాపోతున్నారు. పట్టపగలే పాములు కనిపిస్తుండడంతో ఇక.. రాత్రి సమయాల్లో అయితే ఇళ్ల నుండి బయటకు రాలేకపోతున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. అధికారులు, పాలకులు వెంటనే స్పందించి, వీధి దీపాలు ఏర్పాటు చేసి, నివాసాల మధ్య బేస్‌మెంట్ల వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

